శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM

నక్సలిజం నిర్మూలనకు ప్రభుత్వ చర్యలపై నేడు లోక్‌సభలో చర్చ

తమిళనాడులో అభ్యర్థులను ప్రకటించిన సిపిఐ

బిజెపి అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగానికి ముప్పే... 05

సంపుటి 28, సంచిక: 275 | సోమవారం | 30-03-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

## తాతలు దిగొచ్చినా.. పొంగులేటి

# రాజీనామా చేయరు



- సభా సంప్రదాయాలకు వ్యతిరేకంగా స్పీకర్ స్థానాన్ని శాసించే సంస్కృతి ఎక్కడిది?
- మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలుంటే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటాం
- ఇసుక అక్రమ రవాణా, గనుల అక్రమ మైనింగ్‌పై విచారణ చేసేందుకు సిబిసిఐడిపై నమ్మకం లేకపోతే సిబిఐకి అప్పగించాలా?
- మంత్రిని బ్లాక్‌మెయిల్ చేసి హరీశ్‌రావు కుటుంబ సభ్యులను రక్షించుకునేందుకే హౌస్ కమిటీ కోసం పట్టుబడుతున్నారు
- బిఆర్‌ఎస్ సభ్యులపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- కాళేశ్వరం కేసు సిబిఐకి అప్పగిస్తే 48 గంటల్లో కెసిఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తానన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు ఏమయ్యాయని నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్

అవినీతికి పాల్పడినట్టు ఆధారాలుంటే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'మీరు చెప్పింది వినకపోతే' పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాలా?, 'మీ తాతలు దిగొచ్చినా' అది జరగబోదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సాంప్రదాయాలకు వ్యతిరేకంగా స్పీకర్ స్థానాన్ని శాసించే సంస్కృతి ఎక్కడిదని మండిపడ్డారు. శాసనసభలో ఆదివారం అక్రమ మైనింగ్ విషయం అంశంపై బిఆర్‌ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ఇన్నేళ్లు సభ్యులుగా ఉన్నామని చెప్పుకునే వాళ్లకు తెలిసింది ఇదేనా? అని ఎద్దేవా చేశారు. స్పీకర్ ఎవరికి అవకాశం ఇస్తే వారు సభలో మాట్లాడాలని సూచించారు. సిబిసిఐడిపై నమ్మకం లేకపోతే సిబిఐకి విచారణను అప్పగించాలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రిని బ్లాక్ మెయిల్ చేసి, వారి (హరీశ్‌రావు) కుటుంబ సభ్యులను రక్షించుకునేందుకే హౌస్ కమిటీ కోసం పట్టుపడుతున్నారని అన్నారు. ఆదాయాన్ని పెంచి, పేదలకు పంచాలనే

తరువాయి 2లో

### తల్లిదండ్రులను చూడకుంటే జీతంలో కోత

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణే లక్ష్యం

తెలంగాణ అసెంబ్లీలో కీలక బిల్లు ఆమోదం 02




12


## యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలి

- శాంతి నెలకొల్పాలి
- పలువురు మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్
- అమెరికా బానిసత్వంలో తరిస్తూ విశ్వగురువునని మోదీ చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శ

యుద్ధానికి వ్యతిరేకంగా చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు వామపక్షాలు, కాంగ్రెస్ భారీ ర్యాలీ

## ఏ పనీ జరగడంలేదు

- అభివృద్ధి పనులను మంత్రులు మంజూరు చేస్తున్నా ఆర్థిక శాఖ మంత్రి సంతకాలు చేయడంలేదు
- మంత్రులు ఆర్థిక శాఖ మంత్రికి సమన్వయంగా ఉండేలా చర్యలు చేపట్టాలి
- నాకూ మంత్రుల అపాయింట్‌మెంట్ దొరకడంలేదు
- ప్రభుత్వంపై సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని అసంతృప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా సమస్యలు, తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తాను ప్రస్తావించే, ప్రతిపాదించే పనులను మంత్రులు వెంటనే మంజూరు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క పనీ కూడా జరగడంలేదని సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ప్రజాప్రతినిధి అయిన తనకు మంత్రుల అపాయింట్‌మెంట్స్ దొరకడంలేదు. కనీసం వారు ఫోన్లు కూడా ఎత్తరు. ఇదేం ఖర్మ. ఇక మేం భరించలేం. అభివృద్ధి పనులను మంత్రులు మంజూరు చేస్తున్నప్పటికీ ఆర్థిక శాఖ మంత్రి మాత్రం సంతకాలు చేయడం లేదు. పనుల నిర్వహణలో మొత్తం ఆర్థిక శాఖ అధికారమే కొనసాగుతుందా? లేదా? మంత్రిదా అర్థం కావడంలేదు. ఇప్పటికైనా మంత్రులు, ఆర్థిక శాఖ మంత్రికి సమన్వయం

తరువాయి 12లో

శాసనసభ సమావేశాలకు అంతరాయం 02


### బిఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్

కడియం శ్రీహరిపట్ల అనుచితంగా ప్రవర్తించిన కౌశిక్‌రెడ్డిపై ప్రత్యేక చర్యలకు ఎథిక్స్ కమిటీకి నివేదిస్తూ శాసనసభ తీర్మానం

గుజరాత్‌లో దళిత, ఆదివాసీలపై

## ద్వేషం, వివక్ష, అకృత్యాలు తీవ్రమవుతున్నాయ్

- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ
- 'ఉనా కొరడా దెబ్బల ఘటన' బాధితులకు సంఘీభావం ప్రకటించిన కాంగ్రెస్ అగ్రనేత
- న్యాయం జరిగేంత వరకూ వారి గొంతుకలను వినిపిస్తూనే ఉంటానని హామీ



**న్యూఢిల్లీ :** బిజెపి ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రంగా విరుచుకుపడ్డారు. గుజరాత్‌లో దళిత, ఆదివాసీ వర్గాల పట్ల ద్వేషం, వివక్ష, అకృత్యాల వాతావరణం క్రమంగా తీవ్రమైందని ఆరోపించారు. 2016 నాటి 'ఉనా కొరడా దెబ్బల ఘటన' బాధితులకు సంఘీభావం తెలిపారు. వారికి న్యాయం జరిగేంత వరకు వారి గొంతుకలను వినిపిస్తూనే ఉంటానని రాహుల్‌గాంధీ హామీనిచ్చారు. గుజరాత్‌కు చెందిన దళిత, ఆదివాసీ వర్గాల ప్రతినిధుల బృందంతో (ఉనా ఘటన బాధితులతో సహా) ఇటీవల జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఉనా ఘటనలో స్వయం ప్రకటిత గోరక్షకులు నలుగురు యువకులను కొరడాలతో దారుణంగా

తరువాయి 12లో

## ఐజెయు అధ్యక్షుడిగా బల్వీందర్ సింగ్ జమ్మూ సెక్రటరీ జనరల్‌గా డి.సోమసుందర్

ఐజెయు జాతీయ 11వ ప్లీనరీలో నూతన కార్యవర్గం ఎన్నిక



**అమరావతి :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ 11వ ప్లీనరీ ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐజెయు అధ్యక్షుడిగా బల్వీందర్ సింగ్ జమ్మూ (పంజాబ్), సెక్రటరీ జనరల్‌గా డి.సోమసుందర్ (ఆంధ్రప్రదేశ్) గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా... ప్లీనరీ వేదికపై ఆదివారం తమ బాధ్యతలు చేపట్టారు. ఆఫీస్ బేరర్ పోస్టులకు, కార్యవర్గ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ జరగగా, ఐజెయు జాతీయ కార్యవర్గం సీనియర్ పాత్రికేయుడు ఎం.ఎ.మాజిద్‌ను ఎన్నికల అధికారిగా నియమించింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయింది. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక ఫలితాలను ఎన్నికల అధికారి మాజిద్ ప్లీనరీలో ప్రకటించారు. జాతీయ ఉపాధ్యక్షులుగా అమర్ మోహన్ ప్రసాద్ (బీహార్), వై.నరేందర్ రెడ్డి (తెలంగాణా), జాతీయ కార్యదర్శులుగా నరేంద్ర భరద్వాజ్ (ఉత్తర ప్రదేశ్), డి.ఎస్.ఆర్.సుభాష్ (తమిళనాడు), పి. భాస్కర్ రెడ్డి (కర్నాటక), కోశాధికారిగా బల్బీర్ సింగ్ జందు (పంజాబ్) ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా రవీందర్ సింగ్ (ఉత్తరప్రదేశ్), కె.సత్యనారాయణ (తెలంగాణ), కె.అజిత (తెలంగాణ), నగునూరి శేఖర్ (తెలంగాణ), కూన అజయ్ బాబు (ఆంధ్రప్రదేశ్), ఈ.ఎన్.రాజు (ఆంధ్రప్రదేశ్), కుణాల్ జే. మాత్రే (మహారాష్ట్ర),

తరువాయి 12లో

పుట్టుకొస్తున్న ప్రైవేటు హాస్టళ్ళు

## ప్రాణాలతో చెలగాటం

విద్యార్థులకు ఫంక్షన్ హాల్స్‌లో మిగిలిన భోజనం వడ్డింపు
పట్టింపు లేని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు




ప్రజాపక్షం/హనుమకొండ

ప్రైవేటు హాస్టళ్ళు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. అడుగడుగునా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు హాస్టళ్ళు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ త్రినగరి లో కొన్ని ప్రయివేట్ హాస్టళ్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఇటీవల పలు హాస్టళ్ళ యాజమాన్యాలు ఇష్టానుసారముగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.గ్రేటర్ వరంగల్ నగరంలో రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ హాస్టళ్ళు ఇందులో ఉంటున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో సైతం విఫలం అవుతున్నట్లు విమర్శలు


తరువాయి 2లో

## పశ్చిమాసియా జలాల్లోకి.. అమెరికా బహుముఖ దళాలు

- అసలు యుద్ధం ఇకపైనే మొదలుకానుందా?
- అనేక వారాల యుద్ధానికి సిద్ధమైన పెంటగాన్!
- ఇజ్రాయెల్,అమెరికా యూనివర్సిటీలకు ఇరాన్ తుది హెచ్చరిక
- రెండోరోజు బాలిస్టిక్ క్షిపణి దాడులు చేసిన హౌతీలు
- దక్షిణ లెబనాన్‌లో తొమ్మిదిమంది పారా మెడిక్స్ మృతి
- దుబాయ్‌లో ఎయిర్ డిఫెన్స్ డిపో ధ్వంసం

యుద్ధ వ్యతిరేక భారీ ప్రదర్శనలు

**దుబాయ్:** పశ్చిమాసియా జలాల్లోకి బహుముఖ నైపుణ్యం గల అమెరికా సైన్యం (భూతల,సముద్రతల పోరాట పటిమ) ప్రవేశించింది. ఆదివారంనాటికి సరిగ్గా నెలరోజులు పూర్తిచేసుకున్న యుద్ధం కేవలం గగనతల దాడులకే పరిమితం కాగా ఇప్పుడు కీలక అమెరికా దళాల రాకతో యుద్ధం కొత్త మలుపు తీసుకోనున్నది. అసలు యుద్ధం ఇప్పుడే ప్రారంభం కానున్నది. ఈ పరిస్థితుల్లో అమెరికాకు చెందిన అత్యంత కీలకమైన ఇ–3 అవాక్స్‌ను నాశనం చేశామని ఇరాన్ ప్రకటించడంతో యుద్ధంలో అమెరికాకు పరువునష్టంతోపాటు యుద్ధనష్టం వల్ల పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. వాస్తవానికి గడచిన శుక్రవారంనాడే సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై



ఇరాన్ చేసిన దాడుల్లో అమెరికాకు చెందిన అతిముఖ్యమైన బోయింగ్ ఇ–3 సెంట్రీ రాడార్ ఎయిర్ బోర్న్ ఎర్లీ వార్నింగ్

తరువాయి 2లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
30-03-2026
www.prajapaksham.in


# రండి.. రెడీగా ఉన్నాం

ట్రంప్ సైన్యానికి సవాల్
అవమానాన్ని ఇరాన్ సహించదు
నెలరోజుల యుద్ధంపై స్పీకర్ గాలిబాఫ్ ప్రకటన



**టెహ్రాన్:** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన 30 రోజులు పూర్తయిన సందర్భంగా ఇరాన్ పార్లమెంటు స్పీకర్, సీనియర్ నాయకుడు మహ్మద్ బాఘర్ గాలిబాఫ్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనను ఇరాన్ టీవీ సహా అన్ని వార్తాసంస్థలు విడుదల చేశాయి. అమెరికాకు చెందిన కీలక యుద్ధ నౌక ట్రిపోలీ పశ్చిమాసియా జలాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో ఆయన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రిపోలీ యుద్ధ నౌకలో 3,500 మంది అమెరికా ఉభయచర సైనికులు పశ్చిమాసియాకు చేరుకున్నారు. "అమెరికా బాహ్య ప్రపంచం దృష్టిలో చర్చలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తూ రహస్యంగా లోలోపల ఇరాన్‌ను ఆక్రమించేందుకు, విస్తారంగా భూతల దాడులు చేసేందుకు సన్నాహాలు చేస్తోందని గాలిబాఫ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అమెరికా సైన్యాన్ని ఆయన ఎండగట్టారు. అమెరికా సైనికులు ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించగానే వారిని ఉక్కిరిబిక్కిరిచేసే దాడులతో చావుదెబ్బ తీసేందుకు ఇరాన్ సైన్యం ఎదురుచూస్తోందని ఆయన హెచ్చరించారు. అవమానాన్ని ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదన్నారు.
ఇరాన్‌లో అత్యంత గౌరవనీయుడని పేర్కొంటున్న నాయకుడితో తాము చర్చలు జరుపుతున్నామని మార్చి 21,22 తేదీల్లో ఒక వార్తను విస్తారంగా ప్రచారంలోకి తెచ్చారు. ఆ గౌరవనీయమైన వ్యక్తి పార్లమెంటు స్పీకర్ గాలిబాఫ్ అని అమెరికా పత్రికలు ఊదరగొట్టి ప్రచారం చేశాయి. కానీ అవన్నీ నకిలీ వార్తలని ఎక్స్ వేదికగా ఆయన కొట్టిపారేశారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని ఈనాటికీ ట్రంప్ ఇంకా ప్రచారం చేస్తూనే ఉన్నారు. ఆ వార్తలను ఇరాన్‌లోని వివిధ స్థాయి నాయకులు ఖండిస్తూనే ఉన్నారు. అమెరికాతో ఎప్పటికీ చర్చల ప్రసక్తే లేదని, అంతకంత ప్రతీకారం తీర్చుకుంటామని, ఎవ్వరినీ వదిలిపెట్టబోమని ఇరాన్ హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. ఈ పూర్వరంగంలో ఇరాన్‌లో యుద్ధం నెలరోజులు పూర్తి చేసుకున్న సందర్భంలో గాలిబాఫ్ ప్రకటన వెలువడింది. "శత్రుదేశం బహిరంగంగా చర్చలకు సంకేతాలు ఇస్తూ, రహస్యంగా భూతల దాడులకు కుట్రలు పన్నుతోంది" అని పేర్కొన్నారు. 15 సూత్రాల ప్రణాళికలో అమెరికా ప్రతిపాదించిన అంశాలను సాధించలేక చివరకు యుద్ధ దాడుల ద్వారా ఆ కలలు సాకారం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.
ఫిబ్రవరి 28వ తేదీ నుండి కొనసాగుతున్న దాడుల్లో మూడు వంతుల ఇరాన్ నౌకాదళాన్ని తుడిచిపెట్టుకుపోయిందని అమెరికా బలంగా విశ్వసిస్తోంది. హతుడైన ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ కుమారుడు, కొత్తగా దేశ బాధ్యతలు తీసుకున్న మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకూ బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. ఆయన తీవ్రంగా గాయపడి శస్త్రచికిత్స కోసం రహస్యంగా రష్యా వెళ్లారని పాశ్చాత్య పత్రికలు వదంతులను వ్యాప్తిలోకి తెచ్చాయి. కానీ ఈలోపు ట్రంప్ యంత్రాంగం మాత్రం అసలు మొజ్తబా సజీవంగా ఉన్నారా లేరన్న సందేహాలు లేవదీసింది. ఇరాన్ తదుపరి నేతగా స్పీకర్ గాలిబాఫ్ బాధ్యతలు తీసుకుంటారని కూడా ఇప్పటికే పత్రికలు ప్రచారం చేశాయి.

**ఇరాన్‌లో ఇంటర్నెట్ బ్లాకేడ్ వాస్తవాలు తెలియని ప్రజలు?**

కానీ వాస్తవం ఏమిటంటే, గడచిన డిసెంబరు నెలాఖరు నుండి ఇరాన్‌లోని అనేక ప్రాంతాలలో ఇంటర్నెట్ బ్లాకేడ్ ఉంది. యుద్ధం మొదలైన తర్వాత దేశవ్యాప్తంగా గడచిన నాలుగు వారాలుగా ఇంటర్నెట్ ప్రజలెవ్వరికీ అందుబాటులో లేదు. స్టైన్ ఎలాన్ మస్క్‌కు చెందిన ఇంటర్నెట్ డైరెక్ట్‌లు, ఇతర పరికరాలు చాలా ఖరీదైన వ్యవహారంగా మారాయి. కేవలం ఒకశాతం ప్రజలు మాత్రమే ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. మరోవైపు ఇరాన్‌లో నాయకత్వం దాడుల్లో హతమైపోవడంతో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)లో మరింత మతఛాందసవాదం గల నాయకులు స్వచ్ఛందంగా నాయకత్వ బాధ్యతలు తీసుకోవడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఇరాన్‌లో అంతర్యుద్ధం వచ్చే పరిస్థితులు నెలకొంటాయని ఇరానియుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ప్రముఖ బ్రిటిష్ పత్రిక దుబాయ్ మహిళా కరస్పాండెంట్ ఆజాదేహ్ మొషిరి ఒక నివేదికలో పేర్కొన్నారు. టెహ్రాన్ నుండి ప్రజలు గ్రామీణ ప్రాంతాలకు పారిపోయారని, వారికి యుద్ధ వార్తలపై అవగాహన లేదని, అతిపెద్ద నమూనా లోపం పేర్కొందని, కేవలం ప్రభుత్వ టీవీని మాత్రమే వారు ఆధారపడటం వల్ల చాలా వాస్తవాలు తెలియనిస్థితిలో ప్రజలు బ్రతుకుతున్నారని పేర్కొన్నారు. చాలామంది ప్రభుత్వ అనుకూల శక్తులకు కూడా ఇప్పటికీ ఇంటర్నెట్ అందుబాటులో లేదు.

## అమెరికా, ఇజ్రాయెల్‌సహా యూరప్ నగరాల్లో
# కోటిమంది యుద్ధ వ్యతిరేక భారీ ప్రదర్శనలు

'నో కింగ్స్ ఇన్ అమెరికా'...
ట్రంప్, జె.డి.వాన్స్, ఇతర అధికారుల అరెస్టుకు డిమాండ్
వైట్‌హౌస్ దిగ్భ్రాంతి : రాజకీయ కుట్రగా అభివర్ణన
ఇజ్రాయెల్‌లో చరిత్రాత్మక ప్రదర్శన: అనేకమంది అరెస్టు




**వాషింగ్టన్/టెల్‌అవీవ్:** అమెరికా,ఇజ్రాయెల్ సహ నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానానికి నిలయమైన ద హేగ్‌తోపాటు యూరప్ నగరాలలో దాదాపు కోటి మంది ప్రజలు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. యూరప్‌లోని లండన్,పారిస్,రోమ్ తదితర నగరాల్లో, అమెరికాలోని 50రాష్ట్రాలలో వందల నగరాలు,పట్టణాలలో నభూతో అన్న రీతిలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ట్రంప్–నెతన్యాహూలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పశ్చిమాసియాకు అమెరికా కీలక దళాలు చేరుకున్న తరుణంలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. న్యూయార్క్, వాషింగ్టన్ డి.సి, బోస్టన్, మిన్నెసోటా, లాస్‌ఏంజెల్స్, హూస్టన్, లాస్‌విల్లే, చికాగో సహా అనేక ప్రధాన నగరాలలో పట్టణాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి. చిన్న చిన్న గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రజలు బృందాలుగా ఏర్పడి ప్రదర్శనలు జరిపారు. ప్రధానంగా పెరుగుతున్న జీవన వ్యయాలు, ట్రంప్ వలస విధానం,పశ్చిమాసియాలో యుద్ధ వైఖరులకు వ్యతిరేకంగా ఈ ప్రదర్శనలు జరిగాయి. వాషింగ్టన్ డి.సి అంతటా ఆదివారం మధ్యాహ్నం వరకూ అనేక వీధుల్లో ఈ ప్రదర్శనలు కొనసాగాయి. లింకన్ మెమోరియల్ వద్ద ప్రదర్శకులు మెట్లపై వరుగా ప్లకార్డులు పట్టుకుని నిలబడి ప్రదర్శన జరిపారు. నేషనల్ మాల్ పూర్తిగా ప్రదర్శకులతో కిటకిటలాడిపోయింది. యుద్ధానికి కారణమైన ట్రంప్,జెడి.వాన్స్,ఇతర అధికారులను అరెస్టు చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ఐఇసి అధికారుల చేతుల్లో రెనీ గుడ్, అలెక్స్ ప్రెట్టీ మరణించిన మిన్నెసోటాలో ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇక ట్రంప్ వలస మాయోపాయాలు చెల్లబోవని ప్రదర్శకులు నినాదాలు చేశారు. సెయింట్ పాల్‌లో స్టేట్ క్యాపిటల్ బిల్డింగ్ వెలుపల ఉన్నతశ్రేణి డెమోక్రటిక్ పార్టీ చట్టసభ్యులు కూడా వేలాదిమందితో కలిసి ప్రదర్శనలో పాల్గొన్నారు. మిన్నెపొలిస్ వీధుల్లో బ్రూక్ స్ప్రింగ్ స్టీన్ గొంతెత్తి తన నిరసన గీతంతో తీవ్ర ఉద్వేగం సృష్టించారు.
ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత "నో కింగ్స్" అనే నినాదంతో లక్షలమంది వీధుల్లో ప్రదర్శనలు జరపడం వరుసగా ఇది మూడోసారి. ఇక ఇజ్రాయెల్‌లో ప్రజలు లక్షలమంది చరిత్రాత్మకస్థాయిలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేయడంతో నెతన్యాహూ ప్రభుత్వం కంగు తింది. నెతన్యాహూ ఉద్దేశపూర్వకంగా అధికారంలో కొనసాగడంకోసం యుద్ధాన్ని సాగదీస్తున్నారని, తక్షణం యుద్ధం నిలిపివేయాలని ప్రజలు లక్షలమంది నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. హేగ్ నగరంలో కూడా ప్రజలు వేలాదిమంది వీధుల్లోకి వచ్చి ట్రంప్–నెతన్యాహులకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు. తక్షణం యుద్ధం నిలిపివేయాలని కోరారు. ఇజ్రాయెల్ వ్యాప్తంగా అనేక నగరాలలో ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా హింసాత్మకంగా ప్రవర్తించిన 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాజకీయ ప్రయోజనాలకోసమే నెతన్యాహూ యుద్ధాన్ని సాగదీస్తున్నారని ప్రదర్శకులు విమర్శించారు. యుద్ధం వద్దు, శాంతి సాధించాలి అని నినాదాలు చేశారు.
"నో కింగ్స్ ఇన్ అమెరికా....పరిపాలన మార్పు ఇరాన్‌లో కాదు, మొదట సొంత దేశం అమెరికా నుండే ప్రారంభం కావాలి, తక్షణం యుద్ధం ఆపేయాలి...." అంటూ అమెరికాలోని అనేక నగరాల్లో ప్రజలు ప్లకార్లులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. "ఇది అమెరికా, ఇక్కడ ప్రజలదే అధికారం, కానీ ట్రంప్ ఒక నిరంకుశ పాలకుడుగా పెత్తనం సాగించాలని చూస్తున్నారు, రాజులు కావాలనుకునేవారికోసమో,వారి బిలియనీర్ అనుచరులకోసమో అమెరికా అధికారం లేదు" అని ప్రదర్శనల నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
అమెరికా,యూరప్‌లలో ఎన్నడూలేనివిధంగా ట్రంప్ వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించడం వైట్‌హౌస్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించింది. కేవలం డబ్బులు తీసుకునే పాత్రికేయులు మాత్రమే ఈ ప్రదర్శనలను పట్టించుకుంటారని కొట్టిపారేసింది. అమెరికాలో రాబోయేకాలంలో, ఈ ఏడాది చివరిలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలతో భారీ మార్పులు సంభవిస్తాయని ఈ నిరసన ప్రదర్శనలు సంకేతాలు ఇచ్చాయి. అమెరికాలో రాజకీయ సమతుల్యాన్ని మార్చేస్తామని ప్రదర్శకులు హెచ్చరికలు చేశారు.
అమెరికాలో గతంలో ఎన్నడూలేనిరీతిలో గతంకంటే భిన్నంగా లెక్కలేనన్ని నగరాలు, పట్టణాలలో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు ప్రజలు నిర్వహించారు. అమెరికాలో రోజు రోజుకూ పెరుగుతున్న ధరలు, చమురు సంక్షోభం, పొంతనలేని దేశాధ్యక్షుడి ప్రకటనలు, నాటో మిత్రదేశాలు దూరంగా జరిగి ప్రేక్షకపాత్ర వహించడంతోపాటు ఏడాదిపైగా పాలనలో ట్రంప్ పాలనా తీరు, వలస విధానం, అధ్యక్షుడికి వ్యతిరేకంగా కోర్టు ఇచ్చిన తీర్పులు వంటి పరిణామాల పూర్వరంగంలో "నో కింగ్స్ ఇన్ డెమోక్రసీ" అని నినాదాలు చేస్తూ లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. టారిఫ్‌లపై ట్రంప్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజల్లో ఆయన రేటింగ్ గణనీయంగా పడిపోయింది. యుద్ధం మొదలైన తర్వాత వారాంతపు రేటింగ్‌లో మరింతగా క్షీణించి ఆయనకు మద్దతు అత్యంత కనిష్ఠస్థాయికి చేరింది.

## పశ్చిమాసియా యుద్ధ పరిష్కారంపై పాకిస్థాన్‌లో సౌదీ, టర్కీ, ఈజిప్టు సమావేశం

**ఇస్లామాబాద్:** పశ్చిమాసియాలో అమెరికా తరపున మధ్యవర్తిగా కొత్త అవతారం ఎత్తిన పాకిస్థాన్ మరోసారి ఇస్లామాబాద్ వేదికగా యుద్ధ నివారణ చర్యలు చేపట్టింది. సౌదీ అరేబియా, టర్కీ, ఈజిప్టు దేశాల విదేశీ మంత్రులు ఇస్లామాబాద్‌లో సమావేశమయ్యారు. పశ్చిమాసియాలో వైరివర్గాల సేనలను వెనక్కు మళ్ళించేందుకు గల అవకాశాలు, పరిస్థితులపై వారు చర్చించారు. పాకిస్థాన్ విదేశీమంత్రి, ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఈ నాయకులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఇషాక్ దార్ ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీతో టెలిఫోన్‌లో సంభాషించారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వాలను కాపాడే ప్రయత్నాలకు పాకిస్థాన్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని అరాఘ్చీతో ఆయన చెప్పారు. శాశ్వత శాంతికి దౌత్యం ఒక్కటే మార్గమని ఉద్ఘాటించారు.శాంతియుత సంబంధాలకు పాకిస్థాన్ కట్టుబడి ఉందని ఆయన చెబుతూ, అన్ని రకాల దాడులకు, శత్రుత్వాలకు ముగింపు పలకాలని కోరారు. ఈ సందర్భంగా హోర్ముజ్ జలసంధి ద్వారా 20పాకిస్థాన్ నౌకలను సురక్షితంగా బయటకు పంపించేందుకు అబ్బాస్ అరాఘ్చి ఆయనకు వాగ్దానం చేశారు. మరోవైపు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఇంతకుముందే ఫోన్ సంభాషణల్లో పశ్చిమాసియాలో పరిస్థితులను చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు రోజు రోజుకూ విషమిస్తున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి దౌత్యమార్గంలో కృషి జరగాలని సమావేశానికి ముందుగా మంత్రి ఇషాక్ దార్ చెప్పారు. టర్కీ విదేశీమంత్రి హాకన్ ఫిదాన్, ఈజిప్టు విదేశీమంత్రి, దౌత్యవేత్త బదర్ అబ్దెలట్టీ పాల్గొంటుండగా, సౌదీ అరేబియా విదేశీమంత్రి ఫైజల్ బిన్ అల్ ఫర్హాన్ కూడా ఈ సమావేశంలో జత కలిశారు. ఈజిప్టు, టర్కీ విదేశీమంత్రులు శనివారంనాడే ఇస్లామాబాద్‌కు చేరుకోగా, సౌదీ విదేశీమంత్రి ఫర్హాన్ ఆదివారం అక్కడికి చేరుకున్నారు.

# సమావేశాలకు అంతరాయం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాలకు అంతరాయం కలిగిస్తున్నందుకు శాసనసభ నుంచి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలను రెండు రోజుల పాటు (బడ్జెట్ సమావేశాల వరకు) సస్పెండ్ చేశారు. బిఆర్‌ఎస్ పక్ష ఉప నాయకులు తన్నీరు హరీశ్ రావు, సభ్యులు కె.టి.రామారావు, తలసాని శ్రీనివాస్‌రావు, జి.జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మహిపాల్ రెడ్డి, మాణిక్ రావు, టి.పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి రా జశేఖర రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సబితా ఇంద్రారెడ్డి, వి.సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.పి.వివేకానందను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి పట్ల అనుచితంగా ప్రవరించిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ పాడి కౌశిక్ రెడ్డిపై ప్రత్యేక చర్యలు తీసుకునే అంశాన్ని ఎథిక్స్ కమిటీకి నివేదిస్తూ శాసనసభ తీర్మానం చేసింది. శాసనసభ సమావేశాలు ఆదివారం ఉదయం ప్రారంభమైన కొద్దిసేపటికే బిఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. అక్రమ మైనింగ్ అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని, 'మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి'ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేసి విచారణ చేయించాలన్నారు. ఇందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని ఈ విషయంలో ఇదివరకే ముఖ్యమంత్రి సిబిసిఐడి విచారణకు ఆదేశించారని, రాష్ట్ర ప్రభుత్వంలోనే సిబిసిఐడి అనేది ప్రధాన విచారణ సంస్థ అని, దీనికి మించింది ఇంకా ప్రభుత్వంలో లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమైన ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం పర్యవేక్షణ బిల్లు, ముఖ్యమైన పద్దులపై చర్చలో పాల్గొనాలని బిఆర్‌ఎస్ సభ్యులను కోరారు. అయినా వారు తాము నిల్చున్న స్థానాల్లోనే నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే ఎటువంటి చర్చ లేకుండానే 'తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ 2026', పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులు సభ ఆమోదం పొందాయి. ఆ తర్వాత ఉద్యోగుల తల్లిదండ్రులకు సంబంధించిన బిల్లుపై జరిగే చర్చలో పాల్గొనాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ఆ తర్వాత బిఆర్‌ఎస్ సభ్యులు తమ స్థానాల నుంచి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో మార్షల్స్, బిఆర్‌ఎస్ సభ్యుల మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో బిఆర్‌ఎస్ సభ్యులు వెల్ వద్దనే కూర్చున్నారు అక్కడే చప్పట్లు కొడుతూ, పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పేపర్లను చింపేశారు. పలు సందర్భాల్లో మంత్రులు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విజ్ఞప్తి చేసినా బిఆర్‌ఎస్ సభ్యులు వెల్ వద్దనే బైఠాయించారు. అనంతరం సమావేశాలకు సహకరించాలని బిఆర్‌ఎస్ సభ్యులకు ముఖ్యమంత్రి కూడా సూచించారు. అయినప్పటికీ బిఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోనే కూర్చొని నినాదాలు చేశారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందిస్తూ పద్దులు, బిల్లులపై బిఆర్‌ఎస్ సభ్యులు చర్చలో పాల్గొనాలని, లేదా ఆ సభ్యులను బడ్జెట్ సమావేశాలు (రెండు రోజులు) ముగిసే వరకు సస్పెండ్ చేయాలని, అలాగే సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల బిఆర్‌ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించిన తీరుపై ప్రత్యేక చర్యలు తీసుకునేలా ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయాలని సూచించారు. దీంతో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని సభను సజావుగా సాగేందుకు సహకరించాలని బిఆర్‌ఎస్ సభ్యులను మరోసారి కోరారు. అయినా వారు వినకపోవడంతో బిఆర్‌ఎస్‌సభ్యులను రెండు రోజుల పాటు సస్పెండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. దీంతో వారిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన శైలిని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చే స్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది.

**ఇలా అల్లరి చేయడం న్యాయమా? : స్పీకర్**

వెల్ వద్ద భైటాయించిన బిఆర్‌ఎస్ సభ్యుల పట్ల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. 'సిబిసిఐడి విచారణకు సిఎం ఆదేశించిన తర్వాత కూడా హౌస్ కమిటీ కోరడంలో అర్థం ఉందా?, ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన సభలో ఈ రకమైన అల్లరి చేయడం మీకు న్యాయంగా అనిపిస్తోందా' అని బిఆర్‌ఎస్ సభ్యులను ఉద్దేశించి స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు. సుమారు మూడున్నర గంటల పాటు సభలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది.
ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల మాట్లాడుతూ సభలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉన్నదని, చాలా మంది సభ్యులు తమ నియోజకవర్గాలలో ప్రజల సమస్యలను ప్రస్తావించాలని ఎదురు చూస్తున్నారని, సభను ఆర్డర్‌లో పెట్టాలని స్పీకర్‌ను కోరారు.

**సభలో తమకు మాట్లాడే అవకాశాలు దెబ్బతింటున్నాయి: కూనంనేని సాంబశివరావు**

శాసనసభలో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాలు దెబ్బంతింటున్న నేపథ్యంలో సభ ఆర్డర్‌లో లేనప్పుడు సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య ప్రక్రియలో కొత్త ఏమీ కాదని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. సిబి సిఐడి విచారణ చేపట్టాలని సిఎం చెప్పినప్పటికీ బిఆర్‌ఎస్ సంతృప్తి చెందడంలేదని, సభలో ప్రభుత్వ నిర్ణయాన్ని పాటించాలని లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని బిఆర్‌ఎస్ సభ్యులకు సూచించారు. హౌజ్ కమిటీ అనేది ప్రతి సందర్భంలో సాధ్యం కాదని, గతంలో బయ్యారం విషయంలో కూడా హౌస్ కమిటీ అడిగినప్పటికీ సాధ్యం కాలేదని ఆయన గుర్తు చేశారు.

# బహుముఖ దళాలు

(మొదటి పేజీ తరువాయి)

కంట్రోల్ యుద్ధ విమానాన్ని ధ్వంసం చేసింది. దీంతోపాటు ఇతర విమనాలు, కీలక పరికాలు కూడా ధ్వంసమయ్యాయి. యుద్ధం మొదలై నెలరోజులు పూర్తికావడంతో ఈ సందర్భంగా దీనికి సంబంధించి ధ్వంసమైన ఇ–3 అవాక్స్ శకలాల చిత్రాలను ఆదివారం ఇరాన్ టీవీ విడుదల చేసింది. మరోవైపు అమెరికా నైపుణ్య దళాల రాకవల్ల బాహాబాహీ దాడులతో యుద్ధ ప్రమాద ఉగ్రరూపం, ప్రపంచంపై దాని తీవ్ర పర్యవసానాలు మరింత స్పష్టంగా బహిర్గతమయ్యే పరిస్థితులు ప్రారంభం కానున్నాయి. అణుక్షిపణి సామర్థ్యంగల మూడవ యుఎస్‌ఎస్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఆదివారం పశ్చిమాసియా జలాల్లో ప్రవేశించింది. ఈ నౌకలో 3,500మంది అమెరికా ఉభయచర సైనికులు సిద్ధంగా ఉన్నారు. హోర్ముజ్, ఖర్గ్ ద్వీపాలపై ఈ బలగాలు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. ఆదివారంనాటికి పశ్చిమాసియాలో యుద్ధం ముప్పైరోజులు పూర్తిచేసుకున్న తరుణంలో ఈ కొత్త పరిణామం సంభవించింది. పదాతి దళాలను పశ్చిమాసియాకు పంపాల్సిన అవసరం రాదని జి–7 సమావేశంలో నాటో మిత్రదేశాలను మభ్యపెట్టిన అమెరికా మరోవైపు చర్చలు జరుగుతున్నాయని మభ్యపెడుతూ సేనలను తరలించి అనేకవారాలపాటు పశ్చిమాసియాలో యుద్ధానికి సిద్ధపడుతుండగా, అమెరికా సైన్యాలను మట్టుపెట్టేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. ఇక బహ్రైన్‌లోని అల్బా అల్యూమినయం ఫ్యాక్టరీపై క్షిపణి దాడులు చేసింది. దుబాయ్‌లో ఎయిర్ డిఫెన్స్ డిపోను ఇరాన్ క్షిపణులు ధ్వంసం చేశాయి.ఇరాక్ భూభాగం నుండి వచ్చిన డ్రోన్ దాడులను సిరియా తిప్పికొట్టింది. దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా దాడుల్లో మరో ఇజ్రాయెల్ సైనికుడు మరణించగా అనేకమంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ దాడుల్లో తొమ్మిదిమంది పారామెడిక్స్ సిబ్బంది మరణించారు. మోసుల్‌లో పిఎంఎఫ్ సైట్‌పై జరిగిన దాడిలో ఇద్దరు ఇరాక్ పోలీసులు మరణించారు.
యుద్ధరంగంలోకి ప్రవేశించిన యెమెన్‌లోని హౌతీలు రెండో రోజు వరుసగా ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులతో దాడులు కొనసాగించారు. తమ లక్ష్యం పూర్తయ్యేవరకూ ఇజ్రాయెల్‌పై యుద్ధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో దాడులు మరింత ఉద్ధృతం చేస్తామని హౌతీల నాయకుడు నహ్యల్ సరీ ప్రకటించారు. ఇజ్రాయెల్ ఒక ప్రకటన చేస్తూ యెమెన్ నుండి వస్తున్న డ్రోన్లు, క్షిపణి దాడులను అడ్డుకుంటున్నట్లు ప్రకటించింది. దేశ ప్రజలకు అనేక ప్రాంతాలలో బంకర్లలో ఆశ్రయం కల్పించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియావ్యాప్తంగా ఉన్న అమెరికా విశ్వవిద్యాలయాలకు ఇరాన్ తుది హెచ్చరికలు చేసింది. వదిలివెళ్ళిపోవాలని,దాడుల్లో వాటిని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. గల్ఫ్ దేశాల్లో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా,ఖతార్ దేశాలలో మౌలిక సదుపాయాలపై తీవ్రస్థాయిలో ఇరాన్ ఉద్ధృత దాడులు కొనసాగించింది. దీంతో ఈ దేశాలు ఈ క్షిపణులను అడ్డుకుని కూల్చివేసే ఆత్మరక్షణ చర్యలు ప్రారంభించాయి. పశ్చిమాసియా జల్లాల్లోకి అమెరికా అణుటెహ్రాన్‌పై చేసిన దాడుల్లో తమ టెలివిజన్ నెట్‌వర్క్ కార్యాలయం ధ్వంసమైందని ఖతార్ టెలివిజన్ నెట్‌వర్క్ అల్ అరబీ తెలియజేసింది. తమ కార్యాలయం ధ్వంసమైన చిత్రాలు, వీడియోలను ఎక్స్ ఖాతా వేదికగా ఖతార్ నెట్‌వర్క్ అప్‌లోడ్ చేసింది. ఈ దాడులు ఎవరు చేశారనే వి షయం స్పష్టం కాలేదు. దీనిపైఇజ్రాయెల్ అధికారికంగా స్పందించలేదు. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులపై నిఘా పెట్టామని, గడచిన కొద్ది గంటలుగా 10 డ్రోన్లను కూల్చివేశామని సౌదీ అరేబియా రక్షణమంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ సహా పలు గల్ఫ్‌దేశాలలో ఆదివారం తెల్లవారకముందు వరకూ ఇవే పరిస్థితులు నెలకున్నాయి. గడచిన ఇరవైనాలుగు గంటల్లో ఈ ప్రాంతంలో ప్రధాన మౌలిక సదుపాయాలు సహా అనేక ప్రాంతాలపై తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

విధానంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నామని, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ పన్నులు రాబట్టుకుందని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకున్నదని వివరించారు. ఇంత పారదర్శకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభినందిస్తే తమ అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేసేవారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన నోటీసునే తీసుకొచ్చి బిఆర్‌ఎస్ ఏదో కనిపెట్టినట్టుగా మాట్లాడుతున్నారని, దీనిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని సిఎం ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మూడు హౌస్ కమిటీలు వేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డారని, కమిటీని ఆధారంగా చేసుకుని పలువురిని బెదిరించి వారి ఆస్తులను గుంజుకున్నారని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ లబ్ధి పొందారని ఆరోపించారు. హౌజ్ కమిటీ వేసినా ఆ కమిటీ స్పీకర్‌కు నివేదిక ఇస్తుందని, ఆ నివేదికను స్పీకర్ మళ్లీ విచారణ సంస్థకు ఇచ్చి విచారణ చేపట్టాల్సి ఉంటుందని సిఎం వివరించారు. అందుకే 2014 జూన్ నుంచి తమ రెండేళ్ల పాలన వరకు ఖనిజ సంపద, మైనింగ్ అంశాలపై సిబిసిఐడి విచారణకు ఆదేశించామని సిఎం సభకు వివరించారు. ఈ కేసుకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లేదా ఆయన కుటుంబ సభ్యులు ఏమైనా అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉంటే సిబిసిఐడి అధికారులకు అందించాలని బిఆర్‌ఎస్ సభ్యులు హరీష్ రావు, కెటిఆర్, ఇతర సభ్యులకు సిఎం సూచించారు. సంపూర్ణంగా విచారించి దోషులను శిక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

**కిషన్‌రెడ్డిని నమ్మి కాళేశ్వరం కేసు సిబిఐకి అప్పగిస్తే ఏం చేశారు?**

కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసును తమకు అప్పగిస్తే 48 గంటల్లో కెసిఆర్‌ను, ఆయన కుటుంబాన్ని జైలుకు పంపిస్తామని సాక్షాత్తు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని, ఆయన మాటలు నమ్మి తాము ఈ కేసును సిబిఐకి అప్పగించి నెలలు గడుస్తోందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటేనని, ఇది వరకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు సీట్లను ఓట్లను పంచుకున్నాయని విమర్శించారు. తమకు సలహాలు ఇచ్చే ముందు ఈ కేసు విషయంలో కేంద్రం చర్యలు తీసుకునేలా చూడాలని బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి సిఎం సూచించారు. శాసనసభలో ఆదివారం బిఆర్‌ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్న సందర్భంలో బిజెపి ఎంఎల్‌ఏ వెంకటరమణ రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. సిబిసిఐడి విచారణ చేపట్టడం అభినందనీయమేనని, కానీ బిఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నట్లు హౌజ్ కమిటీ వేయాలని సూచించారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ స భలో సూచనలు ఇచ్చి పారిపోవడం బిజెపి సభ్యులకు అలవాటుగా మారిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాటలు నమ్మి తాము కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగించామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్‌లో హరీశ్‌రావు బంధవులు హనుమంతరావు, సుమన్‌రావు, వందలాది ఎకరాలకు సెల్ డీడ్ లేకుండా తీసుకున్నారని, ఒక కంపెనీని బెదిరించి భూములు స్వాధీనం చేసుకున్నారని, అందుకే ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని చేసిన భూ దోపిడీ అక్రమాలపై హౌస్ కమిటీ వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, 'మీరు సిద్ధమా?'అని బిఆర్‌ఎస్‌సభ్యులు హరీశ్‌రావు, కెటిఆర్‌లకు సవాల్ విసిరారు.

## రాజీనామా చేయరు

**దళితులను అవమానించిన కెసిఆర్**

తెలంగాణ వస్తే తొలి ముఖ్యమంత్రి దళితుడిని చేస్తానని కెసిఆర్ ఇచ్చిన హామీని విస్మరించారని, దళితులకు పరిపాలన చేయరాదని, తానే సమస్యలను పరిష్కరిస్తానని దళితులను కెసిఆర్ అవమానించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దళితునికి ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు. 2018 ప్రభుత్వంలో కేవలం ఒక దళితుడు కొప్పుల ఈశ్వర్‌కే మంత్రివర్గంలో చోటిచ్చారన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దళితుడైన భట్టి విక్రమార్కను నియమిస్తే, ఆయనను ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా ఉండకుండా కాంగ్రెస్‌కు చెందిన ఎంఎల్‌ఎలను బిఆర్‌ఎస్‌లో చేర్చుకుని, ప్రధాన ప్రతిపక్ష నేత పదవి లేకుండా చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఒక దళితుడు ప్రశ్నించడాన్ని కెసిఆర్ ఓర్వలేకపోయారన్నారు. ప్రస్తుతం తమ ప్రజాప్రభుత్వంలో భట్టి ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, అందుకే ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అవమానించే విధంగా మాట్లాడుతున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మ ణ్, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్ ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు కల్పించామని, కానీ బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో హరీష్ రావు, కెటి.రామారావు, దయాకర్ రావు, వినోద్ రావు, సంతోష్ రావులే ఉన్నారన్నారు. దళితులను చిన్నచూపు చేసే కెసిఆర్‌కు కనువిప్పు కలిగి, 'మీ (స్పీకర్) ముందు' చేతులు కట్టుకుని నిలబడాలనే ఉద్దేశంతోనే స్పీకర్‌గా 'మీకు' (దళితునిగా) అవకాశం కల్పించామని సిఎం వివరించారు. దళితున్ని అధ్యక్షా.. అంటూ మైక్ అడగాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కెసిఆర్ సభకు రావడం లేదన్నారు. ఒక స్పీకర్‌గా దళితుడు ఉండవద్దనే బిఆర్‌ఎస్ పోడియం ముందుకు వచ్చి గొడవ చేస్తున్నారని, స్పీకర్ ఎంత సర్దుచెప్పినా మాట వినడంలేదని సిఎం అన్నారు. దళితులు మంత్రులుగా ఉండకూడదని కుట్రలకు పాల్పడుతూ కుల వివక్షను ప్రదర్శిస్తున్నారని బిఆర్‌ఎస్‌పై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గురివింద గింజలా మాట్లాడితే ఎలా?**

2014 లో పక్క పార్టీ నుంచి ఒక్కొక్కరిని తీసుకుని మంత్రులను చేశారని, పార్టీ వీడి వెళ్లిన వారే ఇవాళ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిని బిఆర్‌ఎస్‌లో చేర్చుకుని, మంత్రులను చేశారని, ఇప్పుడు మంత్రులుగా చేసిన వారే మంత్రి సీతక్కను అవమానించే విధంగా మాట్లాడారని అన్నారు. దుర్మార్గపు సంస్కృతికి చిహ్నంగా మారిన వారే ఇవాళ మాట్లాడుతున్నారని సిఎం అన్నారు.

## ప్రాణాలతో చెలగాటం (మొదటి పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. అద్దెకు గదులు దొరికేతే చాలు కొంతమంది హాస్టల్ అని ఓ బోర్డు పెట్టి దందా నడుపుతునట్లు తెలుస్తుంది. హాస్టల్ లో ఉంటున్న వారు ఎం చేస్తున్నారు? ఎలా ఉంటున్నారు? అనే కనీస పర్యవేక్షణ లేకుండా తమకు నెల నెల డబ్బులు కడితే చాలు అన్నట్లుగా కొన్ని హాస్టల్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. భోజనం విషయంలో సైతం ఎలాంటి శ్రద్ధ తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు భోజనము అందిస్తుండడంతో హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన సందర్భాలు లేకపోలేదు. తాజాగా హన్మకొండ భీమారం లోని శశాంక్ హాస్టల్ భోజనంలో బల్లి పడడం ఇందుకు ప్రత్యక్ష్య ఉదాహరణహాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఈ హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా గతంలో గంజాయి విషయంలో హాస్టల్‌లో ఉంటున్న కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇలా ఈ ఒక్క హాస్టలే కాకుండా మరికొన్ని హాస్టళ్లు ఇలాగే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. హాస్టల్ ఏర్పాటు చేయడం తప్ప అందులో ఉండే విద్యార్థుల బాగోగులు, భోజనం అందించడం లో నాణ్యత, సెక్యూరిటీ విషయంలో శ్రద్ధ ఏమాత్రం పెట్టడం లేదనే విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రతిరోజూ నాణ్యమైన భోజనము వండాల్సిన బాధ్యతను విస్మరించి ఫంక్షన్ హాళ్ల నుంచి మిగిలిన భోజనం పట్టుకొచ్చి విద్యార్థులకు పెడుతున్న ట్లు ఆరోపణలు ఉన్నాయి. ముందుగానే ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలతో మాట్లాడుకుని అక్కడ మిగిలిన భోజనాన్ని తరలించి హాస్టల్ లో ఉంటున్న వారికి వడ్డిస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవైపు నాణ్యత లేని భోజనము, మరోవైపు పరిశుభ్రత పాటించని వంటకాలతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుండి విద్య, ఇతర శిక్షణల కోసం వచ్చే యువత, విద్యార్థిని, విద్యార్థుల నుండి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. పెరిగిన పోటీ వాతావరణంలో పెంచిన ఫీజులను కూడా భరించినా విద్యార్థులకు నాణ్యత గల భోజనము, సౌకర్యాలు అందించలేక పోతున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు జిల్లా అధికారుల పర్యవేక్షణ, అటు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేవని విద్యార్థులు, యువకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేటు హాస్టళ్లలో పరిస్థితులపై పర్యవేక్షణ చేయాలని వారు కోరుతున్నారు.

STATE & REGIONAL NEWS
జనరల్
STATE & REGIONAL NEWS
హైదరాబాద్
సోమవారం
30-03-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## కౌశిక్‌రెడ్డి వైఖరి పట్ల శాసనసభలో దుమారం

ఎథిక్స్ కమిటీకి సిఫార్సు
భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉండాలి : సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల పాడి కౌశిక్ రెడ్డి వైఖరి పట్ల శాసనసభలో ఆదివారం దుమారం రేగింది. మహబూబ్‌నగర్‌లోని బాలానగర్ భూములపై హౌజ్ కమిటీ వేయాలనే సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అనుకూలంగా మాట్లాడారు. కడియం శ్రీహరి మాట్లాడే సమయంలో బిఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ వెల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే కడియం మాట్లాడుతుండగా బిఆర్‌ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మీరు ఏ పార్టీ'అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కడియం శ్రీహరి పట్ల బిఆర్‌ఎస్ సభ్యులు కౌశిక్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని ఆయనపై చర్యలు తీసుకోవాలని మంత్రులు, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు స్పీకర్‌ను కోరారు. 'గన్‌తో కాల్చి పడేస్తానంటూ' కౌశిక్ రెడ్డి కడియంను ఉద్దేశించి సైగలు చేశారని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనను ఎథిక్స్ కమిటీకి సిఫార్సుచేసి, భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉండేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఎం కోరారు.

**శ్రీహరికి జరిగినట్టే కెసిఆర్‌కు జరిగితే ఊరుకుంటారా..? : సిఎం**

సభలో సిఎంరేవంత్ రెడ్డి స్పందిస్తూ కడియం శ్రీహరికి జరిగినట్టుగానే కెసిఆర్‌కు జరిగితే కెటిఆర్, హరీశ్‌రవు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. తమ వైపు కూడా మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ లాంటి కండలు తిరిగిన ఎంఎల్‌ఎలు ఉన్నారని, కానీ ఇక్కడ (సభలో) కుస్తీలు పడేందుకు రాలేదని, విజ్ఞత, అవగాహనతో మాట్లాడటానికి వచ్చామన్నారు. ఆకారం ఉంది కదా అని కడియం లాంటి పెద్దమనిషిని అవమానించేలా వ్యవహరించిన కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిని ఇక్కడితో నివారించకపోతే సభలో కత్తిపోట్లు, కుస్తీలు జరుగుతాయన్నారు.

## వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణే లక్ష్యం

తల్లిదండ్రులను చూడకుంటే జీతంలో కోత
తెలంగాణ అసెంబ్లీలో కీలక బిల్లు ఆమోదం
భావోద్వేగపూరిత ప్రసంగం చేసిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో ఏ తల్లిదండ్రులూ అనాథలుగా మిగిలిపోకూడదనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక అడుగు వేసింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు భద్రత, గౌరవం కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026'కు శాసనసభ ఆమోదముద్ర వేసింది. శాసనసభలో ఆదివారం ఈ బిల్లును రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై చర్చ జరిగింది. ఈ బిల్లును బలపరుస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శాసనసభలో భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేకుండా ప్రవర్తించే వారిలో భయం కలిగించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని స్పష్టం చేశారు. మనిషి భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం పాకులాడుతూ కన్నవారిని, కడవరకు తోడుండాల్సిన పేగు బంధాలను విస్మరిస్తున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'బతికున్నప్పుడు గుప్పెడు మెతుకులు పెట్టని బిడ్డలు, తల్లిదండ్రులు చనిపోయాక ఆస్తుల కోసం కొట్లాడుకోవడం అత్యంత దురదృష్టకరం. కన్నవారి కన్నీళ్లు సమాజానికి క్షేమం కాదు' అని ఆయన అన్నారు. 2007లో వృద్ధుల కోసం కేంద్రం ఒక చట్టం తీసుకొచ్చిందని సిఎం తెలిపారు. కేంద్ర చట్టం ప్రకారం తల్లితండ్రులకు రూ.10వేలు చెల్లించే విధంగా నిబంధన పెట్టినట్లు తెలిపారు. ఈ బిల్లు కేవలం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు మాత్రమే పరిమితం కాదని, ప్రజాప్రతినిధులను కూడా దీని పరిధిలోకి చేర్చినట్లు సిఎం వెల్లడించారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ఉంటే అంగీకరించబోమని, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని సమాజం బహిష్కరించాలన్నారు.

**సింఘానియా ఉదంతం.. ఒక హెచ్చరిక**

ప్రముఖ వ్యాపారవేత్త, పద్మభూషణ్ గ్రహీత విజయ్ పథ్ సింఘానియా ఉదాహరణను సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. వేల కోట్ల ఆస్తిని కుమారుడికి ధారపోసిన తర్వాత, సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉండాల్సిన దయనీయ స్థితి ఆయనకు ఎదురైందని, ఆయన ఆత్మకథలో 'అన్ ఇన్‌కంప్లీట్ లైఫ్' లోని ఆవేదన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాలని అన్నారు. పిల్లలు తల్లిదండ్రులను చూసుకోవడం ఇకపై కేవలం నైతిక బాధ్యత మాత్రమే కాదని, చట్టబద్ధమైన జవాబుదారీతనమన్నారు. కుటుంబ నియంత్రణ వల్ల ఒక్కరిద్దరు పిల్లలే ఉన్న ప్రస్తుత కాలంలో వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న పోక్సో, నిర్భయ వంటి చట్టాల తరహాలోనే వృద్ధుల కోసం ఈ చట్టం పనిచేస్తుందని తెలిపారు. 'పురాణాల్లోని శ్రవణ కుమారుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుంటే ఇలాంటి చట్టాల అవసరమే ఉండదని సిఎం అన్నారు. ఈ బిల్లు వృద్ధ తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని నింపుతుందని ఆశిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలకు అతీతంగా సభ బయట ఉన్నవారు, సభలో ఉన్నవారు, ఈ బిల్లును సామాజిక బాధ్యతగా భావించి అన్ని పక్షాలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణను హరిత శక్తి సామర్థ్య రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మోడల్ సోలార్ విలేజ్' కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఈ మేరకు ఆదివారం అసెంబ్లీ హాల్‌లో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు ఆయన వ్యక్తిగతంగా లేఖలు అందజేశారు. ప్రతి ప్రజాప్రతినిధి తన సొంత గృహంలో 2 కిలోవాట్ గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ సిఎం సూచించారు. ప్రజల్లో సౌర విద్యుత్ పట్ల అవగాహన కల్పించాలంటే ముందుగా నాయకులే ఆదర్శంగా నిలవాలని, తద్వారా నివాస ప్రాంతాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చవచ్చని ఆయన ఆకాంక్షించారు. ఈ విధానం వల్ల గృహ విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా, రాష్ట్ర హరిత శక్తి గ్రిడ్‌కు గణనీయమైన సహకారం అందుతుందని వివరించారు. ఆసక్తి గల ప్రజాప్రతినిధులు తమ నివాస చిరునామా, తాజా విద్యుత్ బిల్లు ప్రతులను ఖైరతాబాద్‌లోని టిజి రెడ్‌కో కార్యాలయానికి అందజేయాలని కోరారు. వీటి ఆధారంగా సాంకేతిక బృందం సర్వే నిర్వహించి ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు. కార్బన్ న్యూట్రాలిటీ సాధనలో, శక్తి సమృద్ధ తెలంగాణ నిర్మాణంలో ఈ నిర్ణయం ఒక కీలక అడుగు అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి

ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం: కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని, దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం గన్‌పార్క్ వద్ద బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు శనివారం రాష్ట్ర ప్రభుత్వంలో నంబర్ 2గా ఉన్న ఒక మంత్రి స్కామ్‌ను ఆధారాలతో సహా బయటపెట్టారని, ఆ మంత్రి కుటుంబానికి చెందిన కంపెనీ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మైనింగ్‌కు పాల్పడిందని తెలిపారు. ఈ వివరాలు కూడా ప్రభుత్వమే ఇచ్చిన డాక్యుమెంట్ల ఆధారంగా బయటకు వచ్చాయని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి కంపెనీ కావడం వల్లనా, లేక ముఖ్యమంత్రి పాత్ర ఉండడం వల్లనా చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. అలాగే రాఘవ కన్‌స్ట్రక్షన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దూరపు బంధువులదని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. మైనింగ్ శాఖ మంత్రి అక్రమాన్ని కేవలం రూ.4 లక్షల వ్యవహారంగా చూపడం సిగ్గుచేటని అన్నారు. అధికారుల దాడిలో ఒకే రోజులో రూ.32 లక్షల విలువైన అక్రమాలు బయటపడిన నేపథ్యంలో రెండున్నరేళ్లలో జరిగిన అవినీతి పరిమాణాన్ని అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని, అవసరమైతే ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా తీసుకెళ్తామని కెటిఆర్ హెచ్చరించారు. ఇక హైదరాబాద్ మెట్రో అంశంపై కూడా కెటిఆర్ స్పందిస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో అనేక అసత్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.22 వేల కోట్ల ఆస్తిని రూ.15 వేల కోట్లకు కొనుగోలు చేశామని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు.

### మహాలక్ష్మి పథకం ద్వారా.. మహిళలు ఆదా చేసుకున్న

## రవాణా చార్జీల మొత్తం రూ.10వేల కోట్లు

మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల రవాణా చార్జీల మొత్తం రూ.10వేల కోట్ల మార్కును చేరుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.
2023 డిసెంబర్ 9న పథకం ప్రారంభమైన నాటి నుంచి మార్చి 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్లకు పైగా జీరో (ఉచిత ప్రయాణం) టికెట్లను మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నట్లు తెలిపారు.

**మహాలక్ష్మి సేవల సౌలభ్యం కోసం స్మార్ట్ కార్డుల జారీ..**

మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు, కచ్చితమైన గణాంకాల కోసం త్వరలో చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎండి నాగిరెడ్డి చెప్పారు. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండానే స్మార్ట్ కార్డులు ద్వారా మహిళల ఉచిత ప్రయాణం చేసేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడనుందని, పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెట్టడం జరుగుతోందని ఎండి స్పష్టం చేశారు.

## గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలి

గోదావరి పుష్కరాలపై సిఎం సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, ఇందుకు సంబంధించి శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల వారీగా పూర్తిచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి 15 నుంచి 20 రోజుల్లోగా నివేదికను అధికారుల కమిటీకి అందజేయాలని సూచించారు. 2027 జూన్‌లో గోదావరి పుష్కరాల నాటికి బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రధాన ఆలయాలు, పుష్కరఘాట్ల అభివృద్ధి ప్రణాళికలపై మంత్రివర్గ ఉప సంఘం, ఉన్నతాధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శాసనసభ ప్రాంగణంలోని హాల్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, ముథోల్ ఎంఎల్‌ఎ రామారావు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాస రాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డిజిపి శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలపై ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి పంపాలన్నారు. మంత్రివర్గ ఉప సంఘం ఆమోదం తర్వాత ప్రణాళికలకు సంబంధించిన నివేదికపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సిఎం ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, రోడ్లు, వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

## గోవుల సంరక్షణకు పక్కా ప్రణాళికలు

పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందంతో సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో కూడా గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. శాసనసభ సమావేశ హాల్‌లో ముఖ్యమంత్రితో ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందం భేటీ అయింది. సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియ వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకా గాంధీ బృందానికి తెలియజేశారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా మేనకా గాంధీ కొనియాడారు.



## రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును త్వరలో ఏర్పాటు చేస్తాం

రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో త్వరలో రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్, జెఎసి నేతలు ఎం.ఎ.సలీమ్, ఎస్.అశోక్, ఎం.కృష్ణ తదితరులు ఆదివారం అసెంబ్లీలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సహాయం అందించాలని, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వమే ఒక యాప్ ఏర్పాటు చేయాలని, ఎల్‌పిజి గ్యాస్ కొరతను నివారించాలని, జి.ఓ.నెంబర్ 263 ప్రకారం మిగిలిన ఆటో పర్మిట్లను వెంటనే జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మీటర్ రేట్ల పెంపును, రూ.12వేలు ఆర్థిక సహాయం వంటివి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యాప్ కోసం ప్రభుత్వం ఆలోచిస్తుందని, మిగిలిన ఆటో పర్మిట్లను విడుదలచేస్తామన్నారని నాయకులు వెల్లడించారు.

### మధ్యాహ్న భోజన పథకాన్ని

## ప్రైవేట్‌పరం చేస్తే సహించబోం



ఎఐటియుసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయరెడ్డి భవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ పావని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని ఉద్దేశించి బాలరాజు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులకు కేవలం రూ.600లు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తుంది అన్నారు, కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా, కోర్టు ధిక్కరణకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రూ.10వేల వేతనాల హామీని ఇప్పటికీ నెరవేర్చడం పోగా, వంట సరుకులు గ్యాస్‌తో సహా కోడిగుడ్లు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది అని చెప్పి, ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు.
మరోవైపు సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోని 'హరే రామ.. హరే కృష్ణ' అనే సంస్థకు మధ్యాహ్న భోజన పథకాన్ని కట్టబెట్టేందుకు యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతి నియోజకవర్గంలో కేటాయించిన స్థలాలను వెంటనే రద్దుచేసి, రాష్ట్రంలో ఉన్న 54,200 మంది వంట కార్మికులను రోడ్డున పడేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. అక్షయపాత్రకు అప్పజెప్పడం విరమించుకునే వరకు,కనీస వేతనాలు చెల్లించే వరకు, సరుకులు మొత్తం ప్రభుత్వం సరఫరా చేసే వరకు, వంట కార్మికులు ఎఐటియుసి నాయకత్వం సహకారంతో సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు కుంటాల రాములు, తోపునూరి చక్రపాణి, కార్యదర్శులు ధర్మల రామ్మూర్తి, మీసం లక్ష్మణ్, కోశాధికారి ఆది రంగారెడ్డి, పోలెపోలు వెంకటేష్, ముంతాజ్, సరస్వతి, సంగీత, వసంత, అంబవ్వ, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు నెలలుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, తక్షణమే బకాయిలను విడుదల చేయాలని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని రద్దు చేసి, ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా ఎన్‌హెచ్‌ఎంల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ అంజిరెడ్డికి జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇంటి అద్దె, కరెంటు బిల్లు, పిల్లల విద్య ఫీజులు, పాల బిల్లు, ఇఎమ్ఐలు, నిత్యవసర వస్తువులు కొనలేని దీనస్థితిలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉన్నారని తెలియజేశారు. కాబట్టి ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని, మహిళ ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, ఔట్‌సోర్సింగ్ యూనియన్ చైర్మన్ పులి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఎన్. శ్రీనివాస్, పరశురాం, గంగాధర్, జయమ్మతో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రుల సంరక్షణ పర్యవేక్షణ బిల్లు వృద్ధుల సంక్షేమానికి చరిత్రాత్మక నిర్ణయం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీలో ఆమోదం పొందిన తెలంగాణ ఉద్యోగుల బాధ్యత తల్లిదండ్రుల సంరక్షణ పర్యవేక్షణ బిల్లు 2026ను వృద్ధుల సంక్షేమానికి చరిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభివర్ణించారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉన్నతాధికారులు కలిసి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుచేసేలా ఈ చట్టం రూపొందించామని తెలిపారు. కుటుంబ విలువలు క్షీణిస్తున్న నేపథ్యంలో వాటికి చట్టబద్ధ బలం ఇవ్వడం అవసరమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, సామాజిక బాధ్యతతో ఈ బిల్లు సాధ్యమైందని కొనియాడారు. ఈ చట్టం అమలుతో వృద్ధులపై నిర్లక్ష్యానికి చెక్ పడటమే కాకుండా, వారి సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వృద్ధుల గౌరవాన్ని కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సమాజంలో బాధ్యతాయుత ధోరణిని పెంపొందించే దిశగా కీలకంగా నిలుస్తుందని అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## కేరళలో తదుపరి ప్రభుత్వం మాదే

### పాలక్కాడ్ ఎన్నికల ర్యాలీలో మోదీ ఆశాభావం

**పాలక్కాడ్ :** పది రోజుల తర్వాత కేరళలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాలక్కాడ్‌లో ఆదివారం ఉదయం జరిగిన భారీ ర్యాలీలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, కేరళలో ఉన్న వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన ప్రభుత్వంపైన, ప్రతిపక్ష యుడిఎఫ్ కూటమి పార్టీలపైన విమర్శలతో విరుచుకుపడ్డారు. వారంతా దోపిడీదారులని అన్నారు. ఏప్రిల్ తొమ్మిదో తేదీ తర్వాత కేరళలో బిజెపి నాయకత్వాన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. నాలుగు దశాబ్దాలక్రితం కాషాయపార్టీ ఆవిర్భావ సమయంలో కూడా తాము కేరళలో ఎన్నికలను ఎదుర్కొన్నామని గుర్తుచేసుకున్నారు. కేరళలో తదుపరి ప్రభుత్వం ఎన్‌డిఎదేనని ధీమా వ్యక్తం చేశారు.
''కేరళ ప్రజల ఆశీర్వాదాలతో కేరళలో బిజెపి,ఎన్‌డిఎ కూటమి తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది, మీ మద్దతుతోనే మా ప్రభుత్వం ఏర్పడుతుంది, ఆ తర్వాత ఇక కేరళకు సేవలు అందించడంలో మేం వెనుకంజ వేయం'' అన్నారు. కేరళలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తే, రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తామని, బిజెపి నాయకత్వాన ఎన్‌డిఎ కూటమికి రోజు రోజుకూ మద్దతు పెరుగుతోందని అన్నారు. కేరళలో యువకులు ఇప్పుడు బిజెపి, ఎన్‌డిఎ మీదే ఆశలు పెంచుకున్నారన్నారు. ఇప్పుడు కేరళ మహిళలు బిజెపివైపు ఆకర్షితులవుతున్నారనన్నారు. రైలు కూడా బిజెపినే ప్రేమిస్తున్నారన్నారు. కేరళలోని అధికార ప్రతిపక్ష కూటమి పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నడిపి జేబులు నింపుకుంటుందని, ఆ తర్వాత యుడిఎఫ్ అధికారంలోకి వచ్చి దోచుకోవడం ప్రారంభిస్తుందని అన్నారు. ఈ రెండు కూటముల మధ్య ఉన్న ఏర్పాటు వల్ల ప్రజలు నలిగిపోతున్నారన్నారు. ఈ దశలో బిజెపి బి–టీమ్‌పై రెండు కూటములు విమర్శల దాడులు చేస్తున్నాయన్నారు. దీని అర్థం ఏమిటంటే ఈ రెండూ కూటమి పార్టీలూ కేరళలో ఉన్నది కేవలం ఒకే ఒక్క ఎ–టీమ్ అనీ, అదే బిజెపి అనీ అంగీకరిస్తున్నారన్నారు. భయంతోనే కేరళలో ఉన్న రెండు రాజకీయ కూటములూ బిజెపిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయన్నారు. అంటే దాని అర్థం ఈ రెండు అవినీతి పార్టీలు ఎవరికైనా భయపడుతున్నాయంటే అది కేవలం బిజెపిని చూసి మాత్రమేనని అన్నారు. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ కూటమిలు రెండూ పెద్ద పెద్ద అవినీతి కేసుల్లో ఇరుక్కున్నాయని, కానీ ఈ రెండూ ఒకరిపై మరొకరు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయన్నారు.

## దశాబ్దకాలంగా ఆయుధాలు వీడిన 10 వేలమంది మావోయిస్టులు

### సమస్యాత్మక ప్రాంతాల్లో 15వేల కి.మీ రోడ్ల నిర్మాణం

**న్యూఢిల్లీ :** గడచిన పది సంవత్సరాలుగా 10 వేలమంది మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో చేరారని అధికారులు చెప్పారు. దేశంలో మావోయిస్టు తీవ్రవాదాన్ని 2026 మార్చి 31వ తేదీ నాటికి తుడిచిపెడతామని కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విధించిన గడువుతేదీ మరో 24 గంటల్లోముగియనున్నది. ఇప్పటివరకూ ఎంతో మంది మావోయిస్టు అగ్రనాయకులు,వారి కార్యకర్తలు పెద్దసంఖ్యలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయుధాలను అప్పగించి జనజీవన స్రవంతిలో చేరారు. ఒక్క 2025వ సంవత్సరంలోనే 2,300 మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలిపెట్టారు. 2026వ సంవత్సరం మొదటి మూడు నెలల్లో 630 మంది మావోయిస్టు కార్యకర్తలు ప్రధాన జనజీవన స్రవంతిని ఎంచుకున్నారు. గడచిన ప్రభుత్వాలు నక్సలిజంపట్ల అనుసరించిన చిన్నాభిన్నమైన వైఖరుల స్థానంలో 2014 నుండి మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక ఏకీకృత విధానాన్ని అనుసరించిందని, ఈ మేరకు ఒక నిర్ణయాత్మకమైన వ్యూహంతో బహుముఖ చర్యలు ప్రభుత్వం చేపట్టిందని అధికారులు చెప్పుకొచ్చారు. పసుపతి నుండి తిరుపతి వరకూ బీహార్,ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిసా,మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో విస్తరించి ఉన్న మావోయిస్టుల రెడకారిడార్ ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి కాంట్రాక్టర్లు తిరస్కరించారని, కానీ కీలకమైన ప్రాంతాలలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఉన్న ప్రాంతాలలో బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ రహదారుల నిర్మాణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుందని, నక్సల్స్ విధ్వంసం ఉండే ప్రాంతాలలో ఆరు కీలకమైన వంతెనలను, ఐదు కీలకమైన రహదారులను ప్రబుత్వం నిర్మింపజేసిందని అధికారులు చెప్పారు. మావోయిస్టుల ప్రభావం ఉన్న ప్రాంతాలలో 15,000 కి.మీ మేరకుపైగా రహదారులను ప్రభుత్వం నిర్మించిందని, గడచిన పది సంవత్సరాలలో 12,250 కి.మీ మేరకు రహదారుల నిర్మాణాలను ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఈ ప్రాంతాలలో కీలకమైన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, 2014 నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి గడచిన పదేళ్ళలో 586 పోలీస్ స్టేషన్లను నిర్మించామని, ఈ ప్రాంతాలన్నీ ఒకనాడు దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద సవాలుగా ఉండేవని అధికారులు చెప్పారు. అదనంగా మరో 361 కొత్త భద్రతా శిబిరాలను గడచన ఆరు సంవత్సరాలలో ప్రభుత్వం నిర్మిబంచిందని, 68 నైట్ ల్యాండింగ్ హెలికాప్టర్ హెలిప్యాడ్స్‌ను కూడా నిర్మించిందని చెప్పారు. 2013లో నక్సల్స్ సంచరించే 76 జిల్లాలలో 330 మావోయిస్టు కార్యకలాపాలు జరిగితే, 2025 జూన్ నాటికి 22 జిల్లాలలో 52 ఘటనలు మాత్రమే జరిగాయని చెప్పారు. భద్రత పెంచడం, పునరావాస చర్యలు తీసుకోవడంపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు.
ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2024 నాటికి 92,847 ఇళ్ళను మంజూరు చేస్తే, 2025 అక్టోబరు నాటికి ఈ సంఖ్య 2,54,045 కు చేరుకుందని అధికారులు చెప్పారు. అదే సమయంలో ఆధార్ నమోదులు కూడా 23.50 లక్షల నుండి 24.85 లక్షలకు పెరిగిందని చెప్పారు. అంతకుముందు 19.77 లక్షల ఆయుష్మాన్ కార్డులు మంజూరు చేస్తే ఆ సంఖ్య 21.44 లక్షలకు పెరిగిందని చెప్పారు.

# శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

### శాసనసభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో సభ్యులు సందేహాలను మంత్రి నివృత్తి చేశారు. రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుందని, ప్రస్తుతం 86 శాతం జనాభాకు (సుమారు 3 కోట్ల 36 లక్షల మందికి) సన్నబియ్యం అందజేస్తున్నామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు అందచేశామని, మిగిలిన దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాక ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో గృహ అవసరాల గ్యాస్ సిలిండర్‌ల కొరత ఏమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్‌ల విషయంలో కొంత ఇబ్బంది ఉందని, రానున్న కొద్ది రోజుల్లో ఆ కొరత కూడా తీరుతుందని హామీ ఇచ్చారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ మునుగోడు \ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ వచ్చే రెండేళ్లలో డిండి ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం సాగునీటి రంగంపై రూ.లక్ష 81 వేల కోట్లు ఖర్చు చేసినా, అది కేవలం కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకే పరిమితమైందన్నారు. పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకు కూడా కొత్తగా నీరు అందలేదని తెలిపారు. నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల భూసేకరణ కోసం ఈ బడ్జెట్‌లో రూ. 5,000 కోట్లు కేటాయించామన్నారు. ఏ నియోజకవర్గానికి అన్యాయం జరగదన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ఎమ్మెల్యేలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

**'నిధులన్నీ సిఎం, మంత్రుల నియోజకవర్గాలకేనా?' సొంత ప్రభుత్వంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేశారు. పద్దులపై జరిగిన చర్చలో మాట్లాడుతూ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపులో వివక్ష జరుగుతోందని వ్యాఖ్యలు చేశారు. మంత్రుల నియోజకవర్గాలకే ప్రాధాన్యత ఇస్తూ, సామాన్య ఎమ్మెల్యేలను విస్మరిస్తున్నారని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే నిధులు విడుదల చేస్తోందని, ఇతర ఎమ్మెల్యేల నియోజకవర్గాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం అంటే కేవలం మంత్రులు మాత్రమే కాదు, ఎమ్మెల్యేలందరం కలిస్తేనే ప్రభుత్వం అని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల కోసం, నిధుల కోసం ఎమ్మెల్యేలు నిరంతరం మంత్రులు, ముఖ్యమంత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాలా? అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపుల్లో కూడా మంత్రుల ఇలాకాలోని పనులకే మొగ్గు చూపుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏం చేసినా ఆ జిల్లాకే వెళ్తోందనే చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు. మధిర, హుజూర్ నగర్ వంటి నియోజకవర్గాలకే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను తరలిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ను ఏ విధంగా అభివృద్ధి చేసుకుంటున్నారో, తనకు కూడా తన మునుగోడు నియోజకవర్గాన్ని అలా తీర్చిదిద్దాలని ఉండదా అని అన్నారు. 'ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు నేను ఈ పదవిలో ఉండటానికి అనర్హుడిని. గత రెండున్నరేళ్లుగా మనోవేదనతో రగిలిపోతున్నాను. ప్రాంతాలు, నియోజకవర్గాల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపకూడదు.' అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ముందు ఇండిపెండెంట్ ఇంజనీర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో వేలకోట్లు దుర్వినియోగం అయ్యే పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు. గురుకుల హాస్టళ్లలో పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని, వాటి పరిస్థితులు మార్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

**నీటి ఎద్దడిపై చర్యలు తీసుకోవాలి : అహ్మద్ బిన్ బలాలా**

జలాశయాలల్లో నీటి వనరులు అడుఅట్టుతున్నాయని, ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించాలని ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బిన్ బలాలా అన్నారు. గత పదేళ్లలో ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసిందని, మిగిలిన దరఖాస్తుల పరిశీలన పూర్తి రేషన్ కార్డుల పంపిణి పూర్తి చేయాలని కోరారు. గ్యాస్ కొరతతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్యాస్ కొరత తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న స్కూళ్లు, కళాశాలకు సొంత భవనాలు, ఉర్దు ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వానికి సూచించారు.

**అధ్వాన్నంగా ఆసుపత్రులు : పైడి రాకేష్ రెడ్డి**


రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని బిజెపి సభ్యులు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. పాఠశాలల్లో టీచర్లు ఉంటారు కానీ విద్యార్థులు ఉండరని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు ఉంటారు కానీ వైద్యులు ఉండని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు లక్షలాది రూపాయాల బిల్లులతో సామాన్యులు చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషలిటి ఆసుపత్రుల నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. విద్య, వైద్యం కోసం బడ్జెట్ కేటాయింపులు నిరాశజనకంగా ఉన్నాయన్నారు. మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు.

**రంగారెడ్డికి నీళ్లు రాకుండా గత ప్రభుత్వం కుట్ర : రామ్మోహన్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లాకు తాగునీరు, సాగునీరు అందకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేసిందని కాంగ్రెస్ సభ్యులు రామ్మోహన్ రెడ్డి అన్నారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పేరు మార్చి తుమ్మడి హట్టి దగ్గర కట్టాల్సిన ప్రాజెక్టును దాని స్థానంలో కాళేశ్వరం పేరుతో మెడిగడ్డ దగ్గర నిర్మించారని అన్నారు. అంతర్‌రాష్ట్ర వివాద స్పందం అవుతుందని తెలిసినా కూడా శ్రీశైలం నుంచి నీరు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని అన్నారు. రంగారెడ్డి జిల్లాకు నీళ్లు రాకుండా కెసిఆర్ ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు. కాళేశ్వరంపై సిట్ విచారణ జరిపిస్తామని ప్రకటించిన బిజెపి కాళేశ్వరం సిబిఐ విచారణ జరపాలని కోరినా కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

## తల్లిదండ్రుల సంరక్షణ బిల్లు చరిత్రాత్మకం

### సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లిదండ్రుల సంరక్షణ బిల్లు' చరిత్రాత్మకమైనదని సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభలో ఆదివారం 'తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026'కు బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులకు ఈ బిల్లు కొండంత అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లు పరిమాణంలో చిన్నదైనప్పటికీ, దాని వెనుక ఉన్న లక్ష్యం, ఆర్ద్రత చాలా గొప్పవని పేర్కొన్నారు. ఇంతటి మానవీయ కోణంతో కూడిన బిల్లును తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేవలం చట్టాలు చేస్తేనే సరిపోదని, సమాజంలో నైతిక మార్పు కోసం కృషి చేయాలన్నారు. పాఠ్యాంశాల ద్వారా చిన్నప్పటి నుండే పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల బాధ్యతను, చైతన్యాన్ని నైతిక విద్యను తీసుకరావాలన్నారు. ప్రస్తుతం సమాజంపై అమెరికన్, యూరోపియన్ సంస్కృతి ప్రభావం ఎక్కువగా ఉందని, పెళ్లి కాగానే తల్లిదండ్రులను వదిలేసి కేవలం వ్యక్తిగత అభివృద్ధి, సంపాదనపైనే దృష్టి పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఉమ్మడి కుటుంబ భావన క్రమంగా కనుమరుగవుతోందని, దీనిని పునరుద్ధరించే దిశగా సమాజంలో మార్పు రావాలన్నారు. సింగరేణిలో పిల్లలకు ఉద్యోగం ఉంటే తల్లితండ్రులకు రేషన్ కార్డు తొలగిస్తున్నారని, పిల్లలు పట్టించుకోకపోతే వారి పరిస్థితి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ఆస్తులు లేని వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగులలోనే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరిలో మార్పు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**సమాజంలో మార్పు రావాలి : మంత్రి కొండా సురేఖ**

వృద్ధ తల్లితండ్రులను పట్టించుకోకపోవడంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సి వచ్చిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. తన నియోజకవర్గంలో ఒక వృద్ధ ముస్లిం మహిళా రోడ్డున ఉంటే తాను వృద్ధాశ్రమంలో చేర్పించానని తెలిపారు. తాను ఆమెను చేర్పించిన 14 రోజులకే మరణించిందని, తల్లితండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

**వేతనంలో 15 శాతం ఇస్తే బాగుంటుంది : పాయల్ శంకర్**

బిజెపి సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ తల్లితండ్రులను చూడని పిల్లల వేతనాల్లో 10 శాతం తీసుకునే విధంగా ప్రభుత్వం పొందుపర్చిందని, దానిని 15 శాతానికి పెంచాలని సూచించారు. ఒకప్పుడు దేశంలో, రాష్ట్రంలో వృద్ధాశ్రమాలు ఉండకపోతుండేనని, కానీ ఇప్పుడు చాలా చోట్ల వృద్ధాశ్రమాలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం గొప్పగా ఆలోచన చేసిన బిల్లు తీసుకొచ్చిందని అభినందించారు.

**ఈ బిల్లు ద్వారా తల్లితండ్రులకు సిఎం పెద్ద కొడుకు అయ్యాడు : ఆది నారాయణ**

పిల్లల నిరాదరణకు గురయ్యే తల్లితండ్రులకు సిఎం రేవంత్ రెడ్డి పెద్ద కొడుకు అయ్యాడని కాంగ్రెస్ సభ్యులు ఆది నారాయణ అన్నారు. తమ నియోజకవర్గంలో ఒక వృద్ధాశ్రమం నిర్మించేందుకు తాను స్థలం కేటాయింపునకు కృషి చేయడంతో పాటు తన ఎంఎల్‌ఎ నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఈ బిల్లు తీసుకొచ్చినందుకు ఆయన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు.

## పోలీస్ అధికారులకు మార్గదర్శి 'ఉమేష్ చంద్ర'

### డిజిపి బి.శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీస్ శాఖలో తోటి అధికారులకు ఒక మార్గదర్శిగా, బృంద స్ఫూర్తిని నింపే నాయకుడిగా గుర్తింపు పొందిన ఉమేష్ చంద్ర వృత్తిపరమైన వారసత్వం నేటి యువ అధికారులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. దివంగత ఐపిఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 60వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా బి.శివధర్‌రెడ్డి, ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపిన అసమాన ధైర్యసాహసాలను, నిబద్ధతను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఉమేష్ చంద్ర చేసిన సేవలపై రచించిన పుస్తకాన్ని డిజిపి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డిజిపి సి.హెచ్. ద్వారకా తిరుమలరావు, ఉమేష్ చంద్ర తండ్రి చదలవాడ వేణుగోపాలరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐపిఎస్ అధికారి ఉమేష్ చంద్ర తన వృత్తి జీవితమంతా చిత్తశుద్ధితో పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించారని డిజిపి పుస్తకం ముందుమాటలో పేర్కొన్నారు. ముఖ్యంగా తీవ్రవాద కార్యకలాపాలు అధికంగా ఉన్న క్లిష్ట సమయంలో ఆయన చూపిన దృఢ సంకల్పం ప్రజల భద్రత పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని డిజిపి కొనియాడారు. ఆయన అంకితభావాన్ని స్మరించుకుంటూ ఈ పుస్తకాన్ని వెలువరించడం ఆయనకు దక్కే నిజమైన నివాళి అని డిజిపి శివధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.



## న్యాయం చేయలేకపోయా.. క్షమించండి

### జాగృతి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం ఉండదు : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ హయాంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయానని, అందుకు తనను క్షమించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నాచౌక్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నిర్వహించిన ధర్నాకు ఆమె మద్దతు తెలిపి ప్రసంగించారు. తెలంగాణ వస్తే అసలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదని భావించామని, కానీ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్మినెంట్ ఉద్యోగాలనే ఔట్ సోర్సింగ్‌గా మార్చేశారని ఆవేదవ వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు విద్యుత్ ఆర్టిజన్లకు భరోసా కల్పించగలిగానని, మరికొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేశానని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదనే కాంగ్రెస్‌ను గెలిపిస్తే వాళ్లు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ లాంటి వాళ్లు చెబితేనే తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మద్దతు పలికారని చెప్పారు. ఇవాళ కోదండరాం, హరగోపాల్ లాంటి మేధావుల మౌనం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. జాగృతి అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే విధానాన్నే లేకుండా చేస్తామని ఆమె అన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థ మాత్రమే ఉండాలన్నది తమ విధానమని స్పష్టం చేశారు.

**కాంట్రాక్ట్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్**

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఏ విధంగా చేశామో, అలాగే హాఫ్ మిలియన్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్ వీధుల్లో మార్చ్ చేపట్టాలని పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే ఈ ప్రభుత్వం స్పందిస్తుందన్నారు.

## పత్రికా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్య మనుగడ




### ఐజెయు ప్లీనరీలో కేంద్ర మంత్రి పెమ్మసాని

### ప్రజాసమస్యల వెలికితీతలో జర్నలిస్టులదే అగ్రస్థానం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**అమరావతి :** జర్నలిజం ఒక వత్తి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచిన బాధ్యతని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) 11వ ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం దేశం నలుమూలల నుంచి విచ్చేసిన జర్నలిస్టులు, ఎడిటర్లు, మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో జర్నలిజం కీలకపాత్ర పోషించిందని, గాంధీజీ, తిలక్, నేతాజీ వంటి నాయకులు జర్నలిస్టులుగా పనిచేశారన్నారు. బ్రిటిష్ కాలంలో 'వెర్నాక్యులర్ ప్రెస్ యాక్ట్' వంటి ఆంక్షలను ఎదుర్కొన్నప్పటికీ జర్నలిస్టులు నిజం కోసం వెనక్కి తగ్గలేదన్నారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రెస్ స్వేచ్ఛపై వచ్చిన ఆంక్షలకు మీడియా ధైర్యంగా స్పందించిందని, ప్రస్తుతం డిజిటల్ యుగంలో ప్రతి వ్యక్తి సమాచారాన్ని పంచుకునే స్థాయికి చేరుకున్నా, జర్నలిజం బాధ్యత మరింత పెరిగిందన్నారు. వేగం కోసం నిజాన్ని పక్కన పెట్టడం, విభజనాత్మక ప్రచారం, ఆర్థిక అస్థిరత వంటి సవాళ్లు మీడియా రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. ఒక జర్నలిస్టు ఇప్పుడు రిపోర్టర్‌తో పాటు ఎడిటర్, వీడియోగ్రాఫర్, ఫ్యాక్ట్ చెకర్ పాత్రలు కూడా నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉందన్నారు. మీడియా మీద నమ్మకం నిలబడటం అత్యంత కీలకమని... నిజమైన సమాచారం, డేటా ఆధారిత జర్నలిజం, వార్త, అభిప్రాయం మధ్య స్పష్టత అవసరమని తెలిపారు. 'బ్రేకింగ్ న్యూస్' వంటి పదాలను బాధ్యతతో ఉపయోగించాలని, అధిక వాడకం విలువను తగ్గిస్తుందన్నారు. జర్నలిస్టులకు సరైన వేతనం, భద్రత, ఆరోగ్య సదుపాయాలు, పెన్షన్ వంటి అంశాలు అత్యవసరమని తెలిపారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా జర్నలిస్టులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ప్రెస్ స్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం నిలబడబోదని, అది కేవలం రూపకల్పన మాత్రమే అవుతుందని తెలిపారు. ప్రతి పట్టణంలో నిజం కోసం నిలబడే జర్నలిస్టు ప్రజాస్వామ్య బలానికి ప్రతీకని, జర్నలిస్టులు కేవలం వార్తలు చెప్పేవారు కాదు సమాజానికి స్వరం, ప్రజల మనసు అని పేర్కొన్నారు.

**సమాజాన్ని మార్చే శక్తి జర్నలిస్టులకే ఉంది ఈశ్వరయ్య :** సమాజాన్ని మార్చే శక్తి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే శక్తి ఒక్క జర్నలిస్టులకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఐజెయు ప్లీనరీలో ఆయన సందేశమిస్తూ... ఎంతో ధైర్యంతో సమాజ రక్షణకు కృషి చేసే జర్నలిస్టులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ప్రజాహితం కోసం నిరంతం కృషి చేసే జర్నలిస్టులకు ప్రజలంతా అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా సమస్యల్ని వెలికి తీయడంలో జర్నలిస్టులు అగ్ర భాగంలో నిలబడ్డారని పాత్ర ఎంతో విశిష్టమైనదని కొనియాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులకు సిపిఐ రాష్ట్ర సమితి తరపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల పక్షాన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం మరింత బలంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు పూర్వ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, నూతన అధ్యక్షుడు బల్విందర్ జమ్మూ, సెక్రటరీ జనరల్ డి.సోమ సుందర్, కార్యదర్శులు వై.నరేంద్రరెడ్డి, సుభాశ్, బల్బీర్ సింగ్, జయసింగ్ రావత్, ఉపాధ్యక్షుడు అమర్ మోహన్ ప్రసాద్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు, ఎపి సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్, ఐజెయు మాజీ అధ్యక్షులు ఎస్‌ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్ పాల్గొన్నారు.

## నక్సలిజం నిర్మూలనకు ప్రభుత్వ చర్యలపై

# నేడు లోక్‌సభలో చర్చ



**న్యూఢిల్లీ :** నక్సలిజం నిర్మూలనకు ప్రభుత్వం విధించిన గడువు ఈ నెల మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సోమవారం లోక్‌సభలో దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేసే ప్రయత్నాలపై చర్చ జరగనుంది. లోక్‌సభ సచివాలయం, రూల్ 193 కింద 'దేశాన్ని వామపక్ష తీవ్రవాదం నుండి విముక్తి చేసే ప్రయత్నాలు' అనే అంశంపై చర్చను సోమవారం నాడు నిర్వహించనుంది. ఈ రూల్ కింద జరిగే స్వల్పకాలిక చర్చలో ప్రభుత్వం స్పందించాల్సి ఉంటుంది. టిడిపి ఎంపి బైరెడ్డి శబరి, శివసేన సభ్యుడు శ్రీకాంత్ షిండే ఈ చర్చను ప్రారంభించనున్నారు. 2026, మార్చి 31 నాటికి నక్సల్స్ ముప్పును పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. నక్సల్ హింస ప్రభావిత ప్రాంతాలపై జరిపిన తాజా సమీక్షలో, దేశంలో వామపక్ష తీవ్రవాదం ప్రభావిత జిల్లాల సంఖ్య ఎనిమిది నుంచి ఏడుకు తగ్గింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 38 జిల్లాలతో కూడిన తొమ్మిది రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళికపై సమగ్ర సమీక్షను చేపట్టింది. ఈ రాష్ట్రాల జాబితాలో జార్ఖండ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ల గ్రిడ్‌లో మోహరించిన భద్రతా దళాలు, మార్చి 31 గడువుకు ముందే మిగిలి ఉన్న సాయుధ మావోయిస్టు కేడర్‌లను నిర్మూలించడానికి ఒక భారీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఈ ప్రాంతాల నుండి సుమారు ఐదు సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్) బెటాలియన్ల ఉపసంహరణ ప్రకటన, పలు సంక్షేమ పథకాల ప్రారంభం వంటివి చేర్చబడే అవకాశం ఉన్న ఒక 'ఆపరేషన్స్ అండ్ డెవలప్‌మెంట్' బ్లూప్రింట్‌ను కూడా కేంద్రం సిద్ధం చేస్తోందని అధికార వర్గాలు ఇంతకుముందు పిటిఐకి తెలిపాయి. 2004 నుండి ఈ ఏడాది మార్చి 26 మధ్య 16,496 మంది నక్సల్స్ లొంగిపోగా, గత ఏడాది అత్యధికంగా 2,337 మంది నక్సల్స్ ఆయుధాలు విడిచిపెట్టారు.

### ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశించిన మార్చి 31 గడువుకు రెండు రోజుల ముందు, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఆదివారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో రూ. 5 లక్షల రివార్డు ఉన్న నక్సలైట్ హతమయ్యాడని పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం మేరకు, రాష్ట్ర పోలీసులకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కోసం పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ కొండపైకి వెళ్లినప్పుడు ఈ కాల్పుల ఘటన జరిగిందని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్ తెలిపారు. కాల్పులు ఆగిపోయిన తర్వాత, ఘటనా స్థలం నుంచి ఒక నక్సలైట్ మృతదేహంతో పాటు ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. మృతుడు ముచాకి కైలాష్, మావోయిస్టుల ప్లాటూన్ నెం. 31కి సెక్షన్ కమాండర్‌గా ఉన్నాడని, అతనిపై రూ. 5 లక్షల రివార్డు ఉందని అధికారి తెలిపారు. పౌరుల హత్యలు, పేలుడు పదార్థాలను (ఐఇడిలు) అమర్చడం, పోలీసులపై దాడులు వంటి ఘటనల్లో కైలాష్ ప్రమేయం ఉందని ఆయన అన్నారు. దేశంలో సాయుధ నక్సలిజాన్ని నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశించిన మార్చి 31 గడువుకు కేవలం రెండు రోజుల ముందు ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టు కార్యకర్తలకు లొంగిపోయి, పునరావాసం పొందేందుకు ఉన్న అవకాశం ఇప్పుడు తుది దశకు చేరుకుందని, దానిని సద్వినియోగం చేసుకోవడానికి వారికి చాలా తక్కువ సమయం ఉందని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, హింసా మార్గాన్ని వీడి, శాంతియుత, సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించేందుకు సమాజ ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావాలని ఆయన మావోయిస్టు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనతో, ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటివరకు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. జనవరి 3న, ఏడు జిల్లాలున్న బస్తర్ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మరణించారు. గత సంవత్సరం, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు మొత్తం 285 మంది మావోయిస్టులను హతమార్చాయి.

## తమిళనాడులో అభ్యర్థులను ప్రకటించిన సిపిఐ

**చెన్నై :** అధికార డిఎంకె నేతృత్వంలోని కూటమిలో భాగస్వామి అయిన సిపిఐ, వచ్చే నెల జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం తమకు కేటాయించిన ఐదు స్థానాలకు పార్టీలోని సీనియర్ నాయకులను అభ్యర్థులుగా బరిలోకి దింపింది. దీనికి అనుగుణంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయిన 55 ఏళ్ల కె. మారిముత్తును, తిరుత్తురైపూండి అసెంబ్లీ నియోజకవర్గం నుండి రెండోసారి అభ్యర్థిగా నిలబెట్టింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. అదేవిధంగా, కృష్ణగిరి జిల్లాలోని తళ్ళి నియోజకవర్గం నుండి పార్టీ సీనియర్ నాయకుడు అయిన 58 ఏళ్ల టి. రామచంద్రన్‌ను బరిలోకి దింపింది. ఆయన 2006, 2011, 2021 ఎన్నికల్లో ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. రామచంద్రన్ సిపిఐ కృష్ణగిరి జిల్లా కార్యదర్శిగానూ, పార్టీ జాతీయ కమిటీ సభ్యుడిగానూ వ్యవహరిస్తున్నారు. తళ్ళి నియోజకవర్గం నుండి ఆయన పోటీ చేయడం ఇది ఐదోసారి అని పార్టీ తెలిపింది. ఇదిలా ఉండగా, భవానీసాగర్ అసెంబ్లీ నియోజకవర్గం కోసం 57 ఏళ్ల పి.ఎల్. సుందరాన్ని సిపిఐ అభ్యర్థిగా నామినేట్ చేసింది. 1989 నుండి పార్టీలో సుదీర్ఘకాలంగా సభ్యుడిగా ఉన్న సుందరం, 2016 ఎన్నికల్లో ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. అయితే 2021 ఎన్నికల్లో ఎఐఎడిఎంకె అభ్యర్థి ఎ. బన్నారి చేతిలో ఓటమి పాలై, ద్వితీయ స్థానంలో నిలిచారు. పార్టీ రాష్ట్ర ఉప కార్యదర్శి అయిన 69 ఏళ్ల రవి (అలియాస్ ఎం. సుబ్రమణియన్)ను తిరుప్పూర్ ఉత్తర నియోజకవర్గం నుండి కూడా పార్టీ బరిలోకి దింపింది. 1973 నుండి సిపిఐ సభ్యుడిగా ఉన్న ఈయన, తిరుప్పూర్ జిల్లా కార్యదర్శితో సహా పార్టీలో వివిధ కీలక పదవులను నిర్వహించారు. అలాగే 1986 నుండి 1991 వరకు మున్సిపల్ కౌన్సిలర్‌గానూ సేవలందించారు. శ్రీవిల్లిపుత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం కోసం, పార్టీ ఉప కార్యదర్శిగానూ, విరుదునగర్ జిల్లా కమిటీ సభ్యుడిగానూ వివిధ పదవులు నిర్వహించిన 52 ఏళ్ల బి. మహాలింగాన్ని సిపిఐ అభ్యర్థిగా నిలబెట్టింది. లౌకిక ప్రగతిశీల కూటమికి నేతృత్వం వహిస్తున్న డిఎంకె, తమిళనాడులో ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం, పలు దఫాల చర్చల అనంతరం సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలకు చెరో ఐదు స్థానాలను కేటాయించింది.

# మహిళా సంక్షేమం, అందరికీ ఆరోగ్య సంరక్షణ

### అసోంలో ఐదు హామీలను ప్రకటించిన కాంగ్రెస్

**నవోబైచా :** అసోంలో అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ హామీలు ప్రకటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఐదు హామీలను ప్రకటించారు. మహిళా సంక్షేమం, అందరికీ ఆరోగ్య సంరక్షణ, భూ హక్కులు, జుబీన్ గార్గ్ మరణ కేసులో న్యాయం కల్పించడం వంటి అంశాలపై ఈ హామీలు ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. రాష్ట్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ ప్రభుత్వం అంతులేని అవినీతికి పాల్పడుతోందని, కేవలం తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాలను నింపుకోవడం కోసమే పనిచేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం లఖింపూర్ జిల్లాలోని నవోబైచాలో జరిగిన ఒక బహిరంగ సభలో ఖర్గే ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఐదు హామీలను వివరించారు. అందులో మహిళలకు నెలవారీ నగదు బదిలీతో పాటు, సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే లేదా తమ వ్యాపారాన్ని విస్తరించాలనుకునే మహిళలకు అదనంగా రూ. 50,000 ఆర్థిక సహాయం అందించడం వంటి అంశాలు ఉన్నాయి. తమ పార్టీ ప్రకటించిన నగదు బదిలీ షరతులు లేనిదిగా ఉంటుందని, బిజెపి ప్రభుత్వం చేస్తున్నట్లుగా, మహిళలను తమ పార్టీలో సభ్యులుగా చేరమని అడిగే పద్ధతి తమది కాదన్నారు. ఎన్నికల వేళ అన్ని కుటుంబాలకు రూ. 25 లక్షల విలువైన నగదు రహిత ఆరోగ్య బీమాను, 10 లక్షల మంది స్థానిక ప్రజలకు శాశ్వత భూ పట్టాలను, రాష్ట్రంలోని వృద్ధులకు నెలకు రూ. 1,250 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ కాంగ్రెస్ ఇచ్చింది.

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, జుబీన్ గార్గ్ మరణ కేసులో 100 రోజుల్లోగా న్యాయం జరిగేలా చూస్తామని కూడా హామీ ఇస్తున్నాము' అని ఖర్గే పేర్కొన్నారు.

రాష్ట్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఆ పార్టీ నాయకుల కుటుంబ సభ్యులు కూడా ఇందులో భాగస్వాములయ్యారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. అసోంలో బిజెపి తన 'డబుల్ ఇంజిన్'ను కేవలం దోపిడీకి పాల్పడటానికి, ఢిల్లీలోని తమ నాయకుల ఖజానాలను నింపుకోవడానికి మాత్రమే వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మపై తీవ్ర స్థాయిలో మండిపడిన ఖర్గే, ఆయన ఒక 'నక్లీ' (నకిలీ) ముఖ్యమంత్రి' అని అభివర్ణించారు. 2021 ఎన్నికల్లో బిజెపి శరబానంద సోనోవాల్‌ను ముందుపెట్టి పోటీ చేసిందని ఆయన గుర్తుచేశారు. కానీ ఎన్నికల తర్వాత, అసోం ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోవడం కోసం శర్మ, గిరిజన నాయకుడైన సోనోవాల్‌ను పక్కకు తప్పించారని ఖర్గే ఆరోపించారు. శర్మ ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని, ప్రజల్లో ఒక రకమైన భయాందోళనలను సృష్టిస్తోందని, అలాగే రాష్ట్ర ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోందని కూడా ఖర్గే ఆరోపించారు.



### ప్రతీ అక్రమ వలసదారుడినీ

# తిరిగి వారి దేశానికి పంపాల్సిందే

**గత పదేళ్లలో అసోంలో చొరబాట్లను బిజెపి ప్రభుత్వం అరికట్టింది**

**చొరబాటుదారులను రక్షించేందుకు కాంగ్రెస్ 'సర్'ను వ్యతిరేకిస్తోంది : అమిత్ షా**

**ధేకియాజుల్లి :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం అసోంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో చొరబాట్లను బిజెపి ప్రభుత్వం అరికట్టిందని, అయితే ఇది 'సరిపోదని', ప్రతి అక్రమ వలసదారుడిని వారి దేశాలకు తిరిగి పంపించాల్సిందేనన్నారు. సోనిత్‌పూర్ జిల్లాలోని ధేకియాజులి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చొరబాటుదారులను రక్షించడం కోసమే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణను (సర్) వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. అసోం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గోగోయ్ చొరబాటుదారులను రక్షించాలని చూస్తున్నారని పేర్కొంటూ, ఈ విషయంపై ఆయన వైఖరిని స్పష్టం చేయాలని అమిత్ షా డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ తన పాలనలో దేశ భద్రతను తీవ్రంగా పరిగణించలేదని, పైగా మన దేశంలో ప్రజలను చంపడానికి పాకిస్థాన్ ఉగ్రవాదులను ప్రోత్సహించిందని ఆరోపించారు. ఉగ్రవాదులపై ప్రధాని నరేంద్ర మోదీ కఠిన వైఖరి తీసుకున్నారని షా తెలిపారు. బిజెపి ప్రభుత్వం అసోంలో చొరబాట్లను అరికట్టింది, కానీ ఇది సరిపోదు. ప్రతి అక్రమ వలసదారుడిని వెనక్కి పంపాలని షా అన్నారు. అసోంను చొరబాటు రహిత రాష్ట్రంగా మార్చి, శాంతి, అభివృద్ధిని నెలకొల్పేందుకు, హిమంత బిస్వా శర్మను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీకి ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. 126 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి, మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.



## అమిత్ షాపైనే చార్జిషీట్ వేయాలి

**బిజెపి అధికారంలోకి వస్తే 'లక్ష్మీర్ భండార్' పథకం నిలిపివేస్తది**

**బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**



**పురూలియా :** టిఎంసి ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజకీయ చార్జిషీట్ విడుదల చేయడంపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. అమిత్ షా గతంలో చేసిన పనులకు గాను ఆయనపై చార్జిషీట్ దాఖలు చేయాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. ఆదివారం పురూలియాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. బిజెపి అధికారంలోకి వస్తే మహిళల కోసం ఉద్దేశించిన 'లక్ష్మీర్ భండార్' పథకాన్ని నిలిపివేస్తుందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రజల ఆహారపు అలవాట్లపై ఆంక్షలు విధిస్తారన్నారు. ప్రజలు చేపలు, మాంసం, గుడ్లు తినలేరని, 'లక్ష్మీర్ భండార్' పథకాన్ని నిలిపివేస్తారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'సర్' ద్వారా 1.2 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించారని మమతా ఆరోపించారు.

### బిజెపి అధికారంలో ఉన్నంతకాలం

# రాజ్యాంగానికి ముప్పే...

- గత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామన్న వారు ఓడారు
- యుపిలో 2027 ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తూ ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ విమర్శలు



**నోయిడా :** రాజ్యాంగాన్ని మార్చడానికి 400 సీట్లు గెలుస్తామని మాట్లాడిన వారు ఓడిపోయారని, అయితే బిజెపి అధికారంలో ఉన్నంత కాలం ఆ ప్రమాదం పొంచి ఉంటుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన 2027లో జరిగే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికార పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దాద్రీలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలకు యాదవ్ దీటుగా బదులిచ్చారు. బిజెపి ప్రారంభించిన అనేక విమానాశ్రయాలు ప్రస్తుతం పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో కూడా వీరు విమానాశ్రయాలను ప్రారంభించారు, కానీ ఏడింటిలో ఆరు విమానాశ్రయాలు ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొన్నారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణకు సంబంధించి రైతులకు సరైన పరిహారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జేవార్‌లో విమానాశ్రయాన్ని ప్రారంభిస్తూ మోదీ సమాజ్‌వాదీ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయగా, యాదవ్ వాటికి ధీటుగా బదులిచ్చారు. ఎస్‌పి తన హయాంలో నోయిడాను దోపిడీకి ఎటిఎంగా మార్చివేసిందని మోదీ ఆరోపించారు. మూఢనమ్మకాల కారణంగా ప్రతిపక్ష నాయకులు గౌతమ బుద్ధనగర్‌ను సందర్శించకుండా దూరంగా ఉంటున్నారని ఆరోపిస్తూ, ఆయన ప్రతిపక్ష నాయకులపై పరోక్ష విమర్శలు కూడా చేశారు. దీనికి దీటుగా బదులిస్తూ యాదవ్ ఇలా అన్నారు: ' మేము నోయిడాను సందర్శించమని అన్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు (మోదీ, యోగి) కలిసి ఎన్ని కప్పుల టీ తాగారో, అంతకంటే ఎక్కువ సార్లు నేను ఇక్కడ నా పార్టీ కార్యకర్తల ఇళ్లను సందర్శించానని వారికి గుర్తుచేయాలనుకుంటున్నాను. ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధికి, ముఖ్యంగా ఢిల్లీ, నోయిడాను కలిపే మెట్రో అనుసంధానానికి తన పార్టీ నేతృత్వంలోని గత ప్రభుత్వమే కారణమని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అయిన యాదవ్ పేర్కొన్నారు. నోయిడా అభివృద్ధి కోసంతమ ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంది. వారికి చూపించడానికి ఏమీ లేదని, అందుకే వారు ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. జేవార్ విమానాశ్రయ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లభించడంలో ఎస్‌పి కీలక పాత్ర పోషించిందని కూడా ఆయన పేర్కొన్నారు. 'సమాజ్‌వాదీ సమతా భాయిచారా ర్యాలీ'గా పిలువబడిన ఈ ఎస్‌పి సభకు భారీ సంఖ్యలో మద్దతుదారులు తరలివచ్చారు; పార్టీ కార్యకర్తలు, ఎంపిలు, ఎమ్మెల్యేలు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో చక్రవర్తి మిహిర భోజుడికి యాదవ్ నివాళులర్పించారు. సామాజిక న్యాయం అనే అంశంపై దృష్టి సారిస్తూ, వెనుకబడిన తరగతులు (పిఛ్‌డే), దళితులు, అల్పసంఖ్యాక వర్గాలను (మైనారిటీలను) ఉద్దేశించి తమ పార్టీ 'పిడిఎ' నినాదాన్ని ఆయన పునరుద్ఘాటించారు. 'పిడిఎ' ఉద్యమం ఒకటి రెండు ఎన్నికల కోసం కాదు, చారిత్రక అన్యాయానికి వ్యతిరేకంగా చేసే సుదీర్ఘ పోరాటం' అని ఆయన అన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆరోపిస్తూ, 'రాజ్యాంగాన్ని మార్చడానికి 400 సీట్లు గెలుస్తామని మాట్లాడిన వారు ఓడిపోయారు, కానీ బిజెపి అధికారంలో ఉన్నంత కాలం ఈ ప్రమాదం ఉంటుంది' అని ఆయన అన్నారు. రాజకీయ మార్పు కోసం పిలుపునిస్తూ, ఈ ర్యాలీ కేవలం ఒక సమావేశం కాదని, రాష్ట్రంలో సామాజిక న్యాయం ఆధారంగా ప్రభుత్వాన్ని తీసుకురావడానికి చేస్తున్న పిలుపు అని యాదవ్ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 37 సీట్లు గెలుచుకుని యుపిలో ఏకైక అతిపెద్ద పార్టీగా ఎస్‌పి అవతరించింది.

# రెండు స్థానాల నుంచి విజయ్ పోటీ

**తమిళనాడులో 234 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టివికె**



**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఆయా పార్టీలు తన అభ్యర్థులను ప్రకటించాయి. తాజాగా తమిళనాడులో తొలిసారి ఎన్నికల బరిలోకి తిగిన నటుడు విజయ్ నేతృత్వంలోని టివికె మొత్తం 234 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ అధినేత విియ్ ఆదివారం పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. అధికార డిఎంకెకు కంచుకోటగా భావించే చెన్నై నగరంలోని పెరంబూరుతో సహా, రెండు స్థానాల నుండి తాను స్వయంగా పోటీ చేయడం ద్వారా విజయ్ తన ఎన్నికల అరంగేట్రం చేస్తున్నట్లు ప్రకటించారు. తన తొలి ఎన్నికల పోరులో విజయ్ తమిళనాడు మధ్య జిల్లాల్లోని తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి కూడా పోటీ చేయనున్నారు. పెరంబూరు నుండి డిఎంకె, ఆర్‌డి శేఖర్‌ను బరిలోకి దింపగా, తిరుచిరాపల్లి తూర్పులో ఇనిగో ఇరుదయరాజ్‌నే కొనసాగించింది. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో భారీ హర్షధ్వానాల మధ్య రెండు స్థానాల నుండి పోటీ చేస్తున్నట్లు సి. జోసెఫ్ విజయ్ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా మిగిలిన 232 స్థానాలకు తన పార్టీ అభ్యర్థుల పేర్లను ఆయన ప్రకటించి, వారిని పరిచయం చేశారు. ఈ అభ్యర్థులలో ఆయన ప్రధాన బృందానికి చెందిన వారు కూడా ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, విజయ్ అంతరంగిక బృంద సభ్యులైన ఎన్. ఆనంద్, అధవ్ అర్జున, పి. వెంకటరామనన్, ఆర్. అరుణ్‌రాజ్, సిటిఆర్ నిర్మల్ కుమార్, కెఎ సెంకోట్టయ్యన్‌లను టి. నగర్, విల్లివాక్కం, గోబిచెట్టిపాళయం, తిరుప్పరంకుండ్రంతో సహా పలు స్థానాలకు టివికె అభ్యర్థులుగా పార్టీ అధినేత ప్రకటించారు. ఈ ఏడాది ఆరంభంలోనే టివికెలో చేరిన మాజీ ఎఐఎడిఎంకెకు చెందిన మాజీ మంత్రి కు.ప. కృష్ణన్‌ను లాల్‌గుడి నియోజకవర్గం నుండి బరిలోకి దింపారు. అభ్యర్థుల జాబితాలో గత కొంతకాలంగా డిఎంకె, ఎఐఎడిఎంకె పార్టీల నుండి టివికెలో చేరిన కొందరు మాజీ నాయకులు కూడా ఉన్నారు. ఈ ఎన్నికల పోరు తన 'ప్రజా కూటమి అయిన టివికెకు, స్టాలిన్ కూటమికి మధ్య జరుగుతోందని పునరుద్ఘాటిస్తూ, అధికార డిఎంకె నేతృత్వంలోని కూటమిని ఆయన కేవలం ఒక తాత్కాలిక సర్దుబాటుగా అభివర్ణించి విమర్శించారు. తన పార్టీ అభ్యర్థుల గురించి ప్రస్తావిస్తూ, ప్రజల పక్షాన నిలబడే వారిని అభ్యర్థులుగా ఎంపిక చేశాను అని ఆయన పేర్కొన్నారు. వారు కేవలం అభ్యర్థులు మాత్రమే కాదని, ప్రజా రక్షకులు అని విజయ్ అభివర్ణించారు. వారికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యంగా 'జెన్ జెడ్'లు తన పార్టీ గుర్తు అయిన 'ఈల'కు భారీ సంఖ్యలో ఓటు వేయాలని, అలాగే తమ ఇళ్లలో ఉన్నవారిని కూడా ఎన్నికల బరిలో ఉన్న టివికె అభ్యర్థులకు మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించాలని ఆయన ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. 'ఇది ఒక తరం వారి ఎన్నికల పోరాటం, ఇది డిఎంకె, టివికెలకు మాత్రమే పరిమితమైందని, రేసులో మరెవరూ లేరని ఆయన పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేకు ఉండాల్సిన లక్షణాలను వివరిస్తూ, వారికి నిష్కళంకమైన వ్యక్తిగత నిజాయితీ ఉండాలని, ప్రజలను దోచుకోకూడదని విజయ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏప్రిల్ 23న ఎన్నికలు జరగనున్నాయి. యువత కోసం ఒక ఎజెండాను ఆవిష్కరిస్తూ, దానిని ఆయన 'హామీ'గా అభివర్ణించారు. విజయ్, ఇతర హామీలతో పాటు, తమిళనాడును మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు, 12వ తరగతి నుండి పిహెచ్‌డి వరకు రూ. 20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణ హామీ వంటివి ఇస్తామని వాగ్దానం చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థులను కూడా ఆయన పరిచయం చేశారు. ఆయన ఇప్పటికే అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు.

## బెంగాల్ ఎన్నికలకు ముందు...

# డార్జిలింగ్ హిల్స్‌లో 'కొత్త రాజకీయ' యుగం

- గోడలు, సైన్‌బోర్డులపై 'మాకు గోర్ఖాలాండ్ కావాలి' అనే రాతల జోరు
- ఈ ఎన్నికలు అధికార టిఎంసి, బిజిపిఎం కూటమి, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు మధ్య పోరుగా ఆవిష్కృతం

**డార్జిలింగ్ :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, కేంద్రంలో సారథ్యం వహిస్తున్న బిజెపి ప్రభుత్వానికి జరుగుతున్న రాజకీయ యుద్ధవాతావరణం వేడెక్కుతోన్న నేపథ్యంలో యావత్ దేశ ప్రజలు, రాజకీయ విశ్లేషకుల దృష్టి ఇప్పుడు పశ్చిమ బెంగాల్ ఎన్నికలపైనే కేంద్రీకరింపబడింది.ఈ నేపథ్యంలో డార్జిలింగ్‌లో మసకబారుతున్న 'మాకు గోర్ఖాలాండ్ కావాలి' అనే గ్రాఫిటీ ఇప్పుడు రోడ్లు, టూరిజం, సంక్షే పథకాల సైన్‌బోర్డులతో పాటు గోడలపై స్థానం సంపాదించుకుంది. రాష్ట్ర సాధన కల నుండి రోజువారీ పరిపాలన అవసరాల వైపు కొండ ప్రాంతాల రాజకీయాలు ఎలా మారుతున్నాయో చెప్పడానికి ఇది ఒక స్పష్టమైన నిదర్శనం. దశాబ్దాలుగా ఉత్తర బెంగాల్‌లోని డార్జిలింగ్ కాలింపాంగ్, కుర్సియోంగ్‌లలో రాజకీయాలు ఒకే ఒక్క భావోద్వేగభరితమైన వాగ్దానం 'ఒక ప్రత్యేక గోర్ఖాలాండ్ రాష్ట్రం' చుట్టూ తిరిగాయి. ఆ ఆకాంక్ష ఇప్పటికీ సజీవంగానే ఉంది. కానీ కొండ ప్రాంతాల రాజకీయాలలో అది ఇప్పుడు వాడుకలో లేదు. పశ్చిమబెంగాల్ ఎన్నికలకు ముందు డార్జిలింగ్ హిల్స్ ఒక లోతైన మార్పునకు సాక్ష్యమిస్తున్నాయి. రాజకీయ గుర్తింపునకు పాత ఆక్రందన స్థానంలో ఇప్పుడు శక్తివంతమైన డిమాండ్లు వినిపిస్తున్నాయి. రహదారులను ఎవరు బాగు చేస్తారు?, టూరిజాన్ని ఎవరు పునరుద్ధరిస్తారు?. తాగునీటిని ఎవరు అందిస్తారు?, పాఠశాలలు, ఆసుపత్రులను ఎవరు మెరుగుపరుస్తారు? తేయాకు తోటల కూలీలను ఎవరు పెంచుతారు? సంక్షేమ నిధులు అందేలా ఎవరు చూస్తారు? అనే బలమైన డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఇంతవరకూ చూడని అత్యంత సంక్లిష్టమైన పోటీ ఆవిష్కృతమైంది. గోర్ఖాలాండ్ స్వప్నానికి, దానిని సాధించే రాజకీయాలకు మధ్య నెలకొన్న ఘర్షణ ఇది. ఒక రకంగా చూస్తే ఈ ఎన్నికలు అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్, భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బిజిపిఎం) కూటమికి, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు మధ్య పోరుగా కనిపిస్తున్నది. తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ఉన్న అనిల్ థాపరే నేతృత్వంలోని భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా అంతులేని ఆందోళన శకం ముగిసిపోయిందని, ఇప్పుడు కొండ ప్రాంతాలకు అభివృద్ధి అవసరమని ఓటర్లను ఒప్పించేందుకు ప్రయత్నిస్తోంది.దీనికి విరుద్ధంగా బిజెపి 'మళ్లీ శాశ్వత రాజకీయ పరిష్కారం' అనే భావోద్వేగాన్ని రగిలించడానికి ప్రయత్నిస్తోంది.రోడ్లు, సంక్షేమం, టూరిజం ప్రాజెక్ట్ 'గోర్ఖా గుర్తింపు' అనే అపరిష్కృత సమస్యకు ప్రత్యామ్నాయం కాలేవని వాదిస్తోంది.'గతంలో ప్రజలు గోర్ఖాలాండ్ కల కోసం ఓటు వేశారు. ఇప్పుడు తమ గ్రామానికి వెళ్లే రహదారిని ఎవరు బాగుచేస్తారో తెలుసుకోవాలనుకుంటున్నారు' అని కురసియోంగ్‌లోని ఒక తేయాకు తోట కార్మికుడు చెప్పారు. హింసాత్మక గోర్ఖా లిబరేషన్ ఫ్రంట్ (జిఎన్‌ఎల్‌ఎఫ్) నుంచి 1980వ దశకంలోని ఆందోళన నుండి బిమల్ గురుంగ్ యొక్క గోర్ఖా జన ముక్తి మోర్చా (జిజెఎం) ఆవిర్భావం వరకూ కొండ ప్రాంతాల రాజకీయాలు చాలాకాలంగా నెరవేరని రాష్ట్ర హోదా వాగ్దానంపైన ఆధారపడి ఉన్నాయి. 2009 తర్వాత బిజెపి ఆ ప్రకృతి ఆ భూభాగంలోకి ప్రవేశించి, కొండ ప్రాంత పార్టీలతో శాశ్వతమైన కానీ లావాదేవీల కూటమిని ఏర్పాటు చేసుకుంది. ఎన్నికల తర్వాత ఎన్నికలలో శాశ్వత రాజకీయ పరిష్కారం ఇస్తామని వాగ్దానం చేస్తూ జిజెఎం ఆతర్వాత జిఎన్‌ఎల్‌ఎఫ్ మద్దతుతో డార్జిలింగ్ లోక్‌సభ స్థానాన్ని నిలబెట్టుకుంది, కానీ నెరవేర్చని పునరావృత వాగ్దానాలు అలసటను సృష్టించాయి. ఓటర్ల జాబితాలో సవరణ ప్రక్రియ దానికి మరో కోణాన్ని జోడించింది. డార్జిలింగ్ జిల్లాలో ప్రత్యేక ముమ్మర సవరణ కారణంగా 5 అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 1.22లక్షల పేర్లు తొలగించబడ్డాయి. వీటిలో డార్జిలింగ్‌లో దాదాపు 25.000, కుర్సియోంగ్‌లో 18,394, కాలింపాంగ్‌లో 17,000 పేర్లు తొలగించబడిన వాటిలో ఉన్నాయి. ఈ సంఖ్యలు రాజకీయంగా చాలా ముఖ్యమైనవే. ఎందుకంటే అవి 2021లో బిజెపి సాధించిన గెలుపు మెజారిటీలకు దగ్గరగా లేదా అంతకంటే ఎక్కువగానే ఉన్నాయి. డార్జిలింగ్‌లో సుమారు 21,000ఓట్లు, కుర్సియోంగ్‌లో 15,000ఓట్లు, కలింపాంగ్‌ను టిఎంసి మద్దతు ఉన్న బినయ్ తమంగ్ వర్గం 4,000ఓట్ల తేడాతో గెలుచుకుంది. బిజెపి గుర్ఖాల రాజకీయ గుర్తింపును కాపాడటంలో విఫలమైందని ఆరోపిస్తూ, ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియగా మార్చడానికి టిఎంసిబిజెపిఎం కూటమి ప్రయత్నిస్తుండటంతో ఇది కొండప్రాంతాల ఎన్నికల లెక్కల్లో కొత్త అనిశ్చితిని తెచ్చిపెట్టింది.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
30-03-2026
www.prajapaksham.in


# భావాలకు పెద్దపీట..



సాహిత్య చరిత్రలో కొన్ని ఉద్యమాలు ఒక ప్రత్యేక శైలి నిర్మాణాలకు పునాదులవుతాయి. మనిషి ఆలోచన విధానాన్ని మార్చే మలుపులుగా నిలుస్తాయి. అటువంటి కీలకమైన ఉద్యమాలలో ఒకటి 'సింబలిజం' (సింబాలిజం). ఇది పదాలతో నేరుగా చెప్పే సాహిత్యాని కి వ్యతిరేకంగా, సూచనల ద్వారా భావాన్ని అనుభూతి చేయించే ప్రయత్నంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమం ఫ్రాన్స్‌లో పదొమ్మిదో శతాబ్దం చివర్లో ప్రారంభమై, తరువాత చిత్రకళ, నాటకరంగం, యూరప్, అమెరికా సాహిత్యాలపై విస్తృత ప్రభావం చూపింది. రచయత ఒక భావాన్ని స్పష్టంగా చెప్పాలా, లేక పాఠకుడి మనసులో అది మెల్లగా రూపుదిద్దుకునేలా చేయాలా? అనే ప్రశ్నకు సమాధానంగా సింబలిస్టులు రెండో మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ ఉద్యమానికి పాల్ వెర్లైన్, స్టెఫెన్ మల్లామ్, ఆర్థర్ రింబౌండ్ వంటి కవులు ఆద్యులు. వీరి రచనల్లో భావం నేరుగా కనిపించదు. అది ఒక మబ్బుల్లా చుట్టూ తిరుగుతుంది. పాఠకుడు దానిని అనుభూతి చేయాలి. ఇది సాధారణ పాఠకుడికి సవాలుగా అనిపించవచ్చు. కానీ అదే ఈ ఉద్యమం యొక్క బలం కూడా. సింబలిజం పుట్టుక వెనుక ఒక తిరుగుబాటు ఉంది. అప్పటి ఫ్రెంచ్ కవిత్వం కట్టుదిట్టమైన నియమాలకు లోబడి ఉండేది. ప్రత్యేకంగా పార్నాసియన్ శైలి కవిత్వంలో నిర్మాణం, స్పష్టత, వర్ణన ప్రధానంగా ఉండేవి. కానీ ఈ కవులు ఆ నియమాలను తిరస్కరించారు. వారికి కవిత్వం ఒక ఉపన్యాసం కాదు.... ఒక అనుభూతి. ఒక క్షణిక భావోద్వేగాన్ని పట్టుకోవడం వారి లక్ష్యం. ఇది ఒక కీలక మార్పు. ఎందుకంటే ఇది కవిత్వాన్ని బాహ్య ప్రపంచం నుంచి అంతర్గత ప్రపంచం వైపు మళ్లించింది. ఈ ఉద్యమంపై చార్లెస్ బౌందెలైర్ ప్రభావం ఎక్కువ. ఆయన రచన 'లెస్ ఫ్లెయుర్స్ దుమాల్' సింబలిస్టులకు దిక్సూచి. బౌందెలైర్ ఇంద్రియాల మధ్య సంబంధాలు అనే భావనను ప్రతిపాదించాడు. అంటే, ఒక శబ్దం ఒక రంగును గుర్తు చేయవచ్చు, ఒక వాసన ఒక జ్ఞాపకాన్ని తెచ్చిపెట్టవచ్చు. ఈ భావనను సింబలిస్టులు మరింత అభివృద్ధి చేశారు. వారు కవిత్వాన్ని ఒక సంగీత అనుభూతిగా మార్చడానికి ప్రయత్నించారు. ఇక్కడ మరో ఆసక్తికరమైన ప్రభావం కనిపిస్తుంది. సంగీతకారుడు రిచర్డ్ వాగ్నర్ ఆలోచనలు. వాగ్నర్ కళల సమన్వయం అనే భావనను ప్రతిపాదించాడు. అంటే, సంగీతం, నాటకం, కవిత్వం వంటివి వాటిని కలకలిపి ఒక సమగ్ర అనుభూతిని సృష్టించాలి. సింబలిస్టులు ఈ భావనను కవిత్వంలో అనుసరించారు. పదాల శబ్దం, లయ, రిథమ్ కలిసి ఒక సంగీతాన్ని సృష్టించాలని వారు భావించారు. ఈ దృక్కోణంలో చూస్తే, కవిత్వం ఒక వాదన కాదు. అది ఒక అనుభూతి. ఇది ఒక కీలకమైన తత్త్వం. ఎందుకంటే ఇది సత్యాన్ని ఒకే విధంగా చెప్పలేమని సూచిస్తుంది. ప్రతి పాఠకుడు తన అనుభవం ఆధారంగా వేర్వేరు అర్థాలను తీసుకుంటాడు. ఇది ఒక బలం కూడా, ఒక బలహీనత కూడా. స్పష్టత లేకపోవడం వల్ల కొంతమంది పాఠకులు ఇలాంటి రచనలకు దూరంగా ఉండవచ్చు. సింబలిజంలోని కవిత్వంతోపాటు నవల, నాటకరంగంలో కూడా ప్రభావం చూపింది. జోరిస్‌కార్ల్ హ్యూస్మన్స్ రచించిన 'ద రిబోర్స్' ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ. ఇందులో ఒక వ్యక్తి తన జీవితాన్ని కళాత్మక అనుభూతుల ద్వారా నిర్మించుకునే ప్రయత్నం కనిపిస్తుంది. ఇది సాధారణ కథ కాదు. ఇది ఒక అంతర్గత ప్రయాణం. అలాగే నాటకరంగంలో మారిస్ మెటర్లింక్ రచనలు సింబలిజం ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తాయి. ఆయన నాటకాల్లో సంఘటనలు కంటే వాతావరణం ముఖ్యమవుతుంది. సింబలిజం ఉద్యమాన్ని అధికారికంగా ప్రకటించిన ఘతన మాత్రం జీన్ మోరాస్‌కు దక్కుతుంది. ఆయన 1886లో ప్రచురించిన మానిఫెస్టోలో ఈ ఉద్యమం లక్ష్యాలను వివరించాడు. వాస్తవికత, సహజత్వం వంటి శైలులను విమర్శిస్తూ, కవిత్వం మరింత వ్యక్తిగతంగా, సూచనాత్మకంగా ఉండాలని ఆయన ప్రతిపాదించాడు. ఈ ప్రకటనతో ఈ ఉద్యమం ఒక స్పష్టమైన దిశను పొందింది. ఈ ఉద్యమం తరువాత రష్యాలో కూడా విస్తరించింది. వాలెరీ బ్రైసొవ్, అలెక్సాండర్ బ్లోక్ వంటి కవులు ఈ శైలిని స్వీకరించారు. ప్రత్యేకంగా బ్లోక్ తన కవిత్వంలో మతం, విప్లవం, ఆధ్యాత్మికతను కలిపి ఒక ప్రత్యేకమైన దృక్కోణాన్ని అందించాడు. ఇది సింబలిజం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదని చూపిస్తుంది. ఇది ఆధునిక కవిత్వానికి మార్గం వేసింది. స్వేచ్ఛా వృత్తం, వ్యక్తిగత భావవ్యక్తీకరణ వంటి అంశాల వల్ల ఈ ఉద్యమం వల్ల బలపడింది. డబ్ల్యుబి ఈట్స్, టిఎస్ ఇలియట్ వంటి కవులపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే నవలల్లో జేమ్స్ జాయిస్, వర్జీనియా ఊల్ఫ్ రచనల్లో కూడా ఈ శైలి కనిపిస్తుంది. మరోవైపు చూస్తే, ఈ ఉద్యమం కొంత కాలానికే విమర్శలకు గురైంది. అస్పష్టత, అతిశయోక్తి, అధిక కళాత్మకత వంటి అంశాలు దీనిని సాధారణ పాఠకుల నుంచి దూరం చేశాయి. 'డెకడెంట్' అనే పదం ఒక సమయం లో గౌరవంగా ఉపయోగించినా, తరువాత అది 'క్షీణించిన' అనే విమర్శాత్మక అర్థాన్ని సంతరించుకుంది. అంటే, ఈ ఉద్యమం తన పరాకాష్టను చేరుకున్న వెంటనే క్షీణత దశలోకి వెళ్లింది. అయినా, దీని ప్రభావం తగ్గలేదు. ఆధునిక సాహిత్యంలో కనిపించే అనేక ప్రయోగాలకు ఇది పునాది వేసింది. పదాల కంటే వాటి మధ్య ఉన్న సంబంధాలు, చిత్రాల మధ్య ఉన్న అనుసంధానాలు, శబ్దాల లయ తదితరాలు ఆధునిక కవిత్వంలోనూ ముఖ్యమైన అంశాలుగా మారాయి. ఇది సింబలిజం స్థిరమైన వారసత్వం.




సింబలిజం లేకుండా సాహిత్యం ఉండదు. భాష కూడా ఉండదు. ఈ వాదన మొదట వినగానే అతిశయోక్తిగా అనిపించవచ్చు. కానీ దాన్ని లోతుగా పరిశీలిస్తే, ఒక గంభీరమైన తాత్త్విక సత్యం దాగి ఉంటుంది. మనం ఉపయోగించే ప్రతి పదం ఒక చిహ్నం. పదం అంటే అసలు వస్తువు అని కాదు.. అది ఆ వస్తువుకు ఇచ్చిన ఒక పేరు మాత్రమే. ఉదాహరణకు చెట్టు అనే పదం నిజమైన చెట్టు కాదు. అది కేవలం ఒక ధ్వని, ఒక గుర్తు. మనమందరం ఆ ధ్వనికి ఒక అర్థం ఇవ్వాలని అంగీకరించాం. అలాగే ఆ ధ్వనిని అక్షరాల రూపంలో కూడా ఒక విధంగా రాసుకుంటామని ఒప్పుకున్నాం. అంటే భాష మొత్తం ఒక ఒప్పందం మీద ఆధారపడి ఉంది. ఇది సహజమైన సంబంధం కాదు. మానవులు ఏర్పరచుకున్న ఒక వ్యవస్థ. ఈ దృష్టితో చూస్తే, ప్రతి పదం ఒక సింబల్ అవుతుంది. ఈ భావనను ఇంకా వెనక్కి తీసుకెళ్తే, మొదటి మనిషి ప్రపంచంలోని వస్తువులకు పేర్లు పెట్టినప్పుడే సింబలిజం ప్రారంభమైందని అనుకోవాలి. మనిషి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం అనేది నేరుగా కాకుండా, సంకేతాల ద్వారా జరుగుతుంది. సింబల్ అనేది వాస్తవాన్ని పూర్తిగా ప్రతిబింబించదు. అది కేవలం దగ్గరగా తీసుకెళ్లే ఒక సూచన మాత్రమే. మనం ఉపయోగించే పదాలు నిజాన్ని పూర్తిగా పట్టుకోలేవు. అవి కేవలం ఆ నిజాన్ని సూచిస్తాయి. ఈ పరిమితిని గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే చాలా సార్లు మనం పదాలను నిజం అనుకుంటాం. కానీ అవి నిజానికి కేవలం సూచనలు మాత్రమే. ప్రపంచ మేధావుల్లో ఒకడిగా గుర్తింపుపొందిన కోమ్ టేమ్ గోబ్లెటెడ్ అల్వియెల్లా చెప్పిన నిర్వచనాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. అతను సింబల్ అనేది ఒక ప్రతిరూపంకాదని, ఒక ప్రతినిధి మాత్రమేనని అంటాడు. అంటే అది అసలు వస్తువును కాపీ చేయదు.. అది దానికి ఒక గుర్తుగా పనిచేస్తుంది. ప్రాచీన గ్రీకు సంస్కృతిలో సింబల్ అనే పదం మొదటగా ఒక ఒప్పందానికి గుర్తుగా ఉపయోగించబడింది. ఇద్దరు వ్యక్తులు ఒక వస్తువును రెండు భాగాలుగా విభజించుకుని, ఒకరికి ఒక భాగం ఉంచుకునేవారు. తరువాత కలిసినప్పుడు ఆ రెండు భాగాలను కలిపి తమ గుర్తింపును నిర్ధారించుకునేవారు. ఈ భావన తరువాత విస్తరించి, పెద్దగా ఆలోచనలు ఒక రూపం ద్వారా వ్యక్తమయ్యే ప్రతీ విధానానికి వర్తించడం ఆరంభమైంది. ప్రముఖ స్కాటిష్ వ్యాసరచయిత, చరిత్రకారుడు థామస్ కార్లైల్ ప్రకారం, సింబల్‌లో ఒకేసారి దాచడం... చూపించడం అనే రెండు ప్రక్రియలు జరుగుతాయి. అంటే అది ఒకవైపు అర్థాన్ని కప్పిపుచ్చుతుంది. మరోవైపు అదే అర్థాన్ని సూచిస్తుంది. ఈ కారణంగా సింబల్‌కు నిజం రెండు స్థాయిల అర్థం ఉంటుంది. ఒకటి ప్రత్యక్షం, ఇంకొకటి అంతర్గతం. ఇంకా లోతుగా చూస్తే, కార్లైల్ చెప్పినట్టు నిజమైన సింబల్ అనేది పరిమితమైన రూపంలో అపరిమితమైన అర్థాన్ని కలిగిస్తుంది. అంటే ఒక చిన్న రూపంలో ఒక పెద్ద భావం దాగి ఉంటుంది. ఇది సాహిత్యానికి చాలా ముఖ్యమైన లక్షణం. మంచి కవిత్వం లేదా కథ ఎప్పుడూ ఒకే అర్థంతో పరిమితం కాదు. అది చదివే వ్యక్తి అనుభవానికి అనుగుణంగా కొత్త అర్థాలను సృష్టిస్తుంది. ఇప్పుడు రచయిత సింబలిజం అనే పదాన్ని ఒక ప్రత్యేక సాహిత్య ఉద్యమానికి ఉపయోగిస్తున్నప్పటి స్పష్ట ముఖ్యం. ఈ పదం చాలా సార్లు ఒక సరళమైన గుర్తుగా మాత్రమే ఉపయోగపడుతుంది. సాహిత్యం వంటి జీవంతమైన, మారుతూ ఉండే వ్యవస్థను ఒకే లేబుల్‌తో పూర్తిగా నిర్వచించడం అసాధ్యం. కాబట్టి సింబలిజం అనే పదం కూడా ఒక సింబల్ లాంటిదే. అది పూర్తిగా వివరణగా కాకుండా, కేవలం ఒక సూచనగానే ఉంటుంది.

– సత్య శ్రీ

'సింబలిజం అనేది కొత్తది కాదు. ప్రతి గొప్ప రచయిత తన రచనలో ఏదో రూపంలో సింబలిజాన్ని ఉపయోగించే ఉంటాడు' అనే ఒక ముఖ్యమైన వాదన తెరపైకి వస్తుంది. అయితే ఆధునిక కాలంలో సింబలిజం ప్రత్యేకత ఏమిటంటే, అది తన గురించి తానే అవగాహన పొందింది. అంటే ఇది ఒక చైతన్యపూర్వక ఉద్యమంగా మారింది. గతంలో ఇది సహజంగా ఉండేది. ఇప్పుడు ఇది ఒక సిద్ధాంతంగా మారింది. దీనికి ఉదాహరణగా జెరార్డ్ డి. నర్వాల్ వంటి రచయితలను పేర్కోవచ్చు. ఈ మార్పు ఎందుకు వచ్చింది? అనే ప్రశ్నకు అతను ఒక సామాజిక సమాధానం ఇస్తాడు. మనుషుల ఆలోచనలు మారుతాయి. వారు ప్రపంచాన్ని చూసే విధానం మారుతుంది. ఒక దశలో వారు భౌతిక ప్రపంచాన్ని మాత్రమే పరిశీలిస్తారు. శాస్త్రం, పదార్థం, ఖచ్చితత్వం ప్రధానంగా మారుతాయి. కానీ ఒక దశ తర్వాత ఆత్మ, అంతర్గత అనుభవం మళ్లీ ప్రాధాన్యం పొందుతుంది. ఈ మార్పుతో సాహిత్యం కూడా మారుతుంది. గతంలో మన కళ్లకు కనిపించే ప్రపంచమే నిజమని, కనిపించనిది కల అని భావించేవారు. కానీ ఇప్పుడు ఈ దృక్కోణం మారుతోంది. కనిపించే ప్రపంచం ఒక ఉపరితలంగా మారుతుంది. కనిపించని అంతర్గత ప్రపంచం అసలు నిజంగా భావించాల్సి వస్తున్నది. ఈ మార్పు సింబలిజం సాహిత్యానికి కేంద్రబిందువు. ఫ్రెంచ్ సాహిత్యంలో జరిగిన మార్పులను పరిశీలిస్తే, ఈ భావన మరింత స్పష్టమవుతుంది. రొమాంటిసిజం తర్వాత వచ్చిన ఒక దశలో శాస్త్రీయ దృష్టికోణం బలంగా ప్రభావం చూపింది. బోద్లేర్, ఫ్లోబేర్, జోలా వంటి రచయితలు ప్రపంచాన్ని చాలా ఖచ్చితంగా, స్పష్టంగా వర్ణించడానికి ప్రయత్నించారు. వారు చూసినదాన్ని అలాగే చెప్పాలని ప్రయత్నించారు. ఇది ఒక రకమైన వాస్తవికత. ఈ రచయితలందరిలో ఒక సామాన్య లక్షణం ఉంది. వారు సూచించడానికి కాకుండా చెప్పడానికి ప్రయత్నించారు. అంటే పాఠకుడు ఆలోచించడానికిగానీ, పరిశోధించడానికిగానీ ఏమీ మిగలకుండా పూర్తిగా వివరించాలనుకున్నారు. ఇది ఒక విధంగా సాహిత్యాన్ని పరిమితం చేస్తుంది. ఎందుకంటే పాఠకుడి ఊహకు స్థలం ఉండదు. జోలా వంటి రచయితలు ప్రపంచాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని ప్రయత్నించారు. మనసును కూడా ఒక భౌతిక పదార్థంగా చూడాలని ప్రయత్నించారు. ఇది ఒక పరిమిత దృక్కోణం. ఎందుకంటే మానవ అనుభవాన్ని పూర్తిగా శాస్త్రీయంగా వివరించడం సాధ్యం కాదు. ఫ్లోబేర్ మాత్రం కళను ఒక పరిపూర్ణ రూపంగా చూడాలని ప్రయత్నించాడు. అతనికి వాస్తవ ప్రపంచం ఒక భారంగా కనిపించింది. కళ ద్వారా మాత్రమే దానికి విముక్తి సాధ్యమని అతను భావించాడు. ఇది ఒక రకమైన పరిమిత విముక్తి. గోంకోర్ సోదరులు ప్రపంచాన్ని ఒక క్షణిక అనుభూతుల సమాహారంగా చూపించారు. వారు భావోద్వేగాలను, క్షణాలను పట్టుకోవడానికి ప్రయత్నించారు. కానీ అది కూడా ఉపరితల స్థాయిలోనే నిలిచిపోయింది. లెకోంట్ డి లిస్లే ప్రపంచాన్ని ఒక స్థిరమైన రూపంగా మార్చాడు. అతను బాధ నుంచి విముక్తి కోసం ఒక నిశ్శబ్ద స్థితిని ఊహించాడు. కానీ, అది కూడా ఒక తాత్కాలిక పరిష్కారం మాత్రమే. ఈ మొత్తం ఉద్యమం చివరికి ఒక ముగింపుకు వచ్చింది. రూపాన్ని అత్యంత ప్రాముఖ్యంగా చూసిన ఈ సాహిత్యం చివరికి తన పరిమితులను చేరుకుంది. అది చెప్పగలిగినదాన్ని పూర్తిగా చెప్పింది. ఇక చెప్పడానికి కొత్తదేమీ మిగలలేదు. ఈ పరిస్థితిలో సింబలిజం ఒక ప్రత్యామ్నాయంగా వచ్చింది. ఇది చెప్పడం కాకుండా సూచించడాన్ని ప్రాముఖ్యంగా చూసింది. ఇది ప్రత్యక్ష ప్రపంచాన్ని కాకుండా అంతర్గత అనుభవాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించింది. ఇది పదాలను కేవలం అర్థాల కోసం కాకుండా, ధ్వనులు, భావాలు, సూచనల కోసం ఉపయోగించింది. ఇక్కడ ఒక ముఖ్యమైన తాత్త్విక మార్పు కనిపిస్తుంది. సాహిత్యం ఒక వాస్తవాన్ని ప్రతిబింబించే సాధనం కాకుండా, ఒక అనుభవాన్ని సృష్టించే సాధనంగా మారింది. ఇది సింబలిజం యొక్క అసలు లక్షణం. మొత్తానికి ఈ పాఠ్యం ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతుంది. భాష, సాహిత్యం, ఆలోచన వంటివన్నీ సంకేతాల మీద ఆధారపడి ఉంటాయి. మనం ప్రపంచాన్ని నేరుగా చూడం. మనం దాన్ని సూచనల ద్వారా అర్థం చేసుకుంటాం. సింబలిజం ఈ సత్యాన్ని గుర్తించి, దానిని ఒక సాహిత్య విధానంగా మార్చింది. ఇది కేవలం ఒక శైలి కాదు. ఇది ప్రపంచాన్ని చూసే ఒక విధానం. కనిపించేదాని వెనుక కనిపించని దాన్ని గుర్తించే ప్రయత్నం. చెప్పలేనిదాన్ని సూచించే ప్రయ త్నం. ఇదే సింబలిజం గర్భితార్థం.

## సంగీత ఝురిలో ఓలలాడిన వెర్లైన్ రచనలు

పాల్ వెర్లైన్ అనే పేరు ఫ్రెంచ్ కవిత్వ చరిత్రలో ఒక మలుపు. ఆయన కవిత్వం భావాలను వ్యక్తం చేయడానికి పరిమితం కాలేదు. భావాలను సూచించే ఒక సంగీత అనుభూతిని కలిగిస్తుంది. పదాలతో సంగీతాన్ని సృష్టించడం అనే భావనను ఆయన అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాడు. పదాలు కేవలం అర్థాన్ని చెప్పే సాధనాలు మాత్రమే కాదని, అవి శబ్దం, లయ, మృదుత్వం, అస్పష్టతలతో కూడిన ఒక జీవ అనుభూతిని కల్పించేవిగా ఉండాలని భావించేవాడు. ఈ దృక్కోణం వల్లే ఆయన రచనలు రొమాంటిసిజం నుంచి ఆధునిక కవిత్వానికి మధ్య ఉన్న ఖాళీని పూరించాయి. ఆయన జననం ఫ్రాన్స్‌లోని మెట్జ్ పట్టణంలో జరిగింది. తరువాత కుటుంబం పారిస్‌కు మారడంతో, ఆయన బాల్యం నగర జీవనంలో గడిచింది. ఆర్థికంగా సౌకర్యవంతమైన వాతావరణంలో పెరిగినా, ఆయన అంతర్గత జీవితం మాత్రం ఎప్పుడూ అశాంతితో నిండిపోయి ఉండేది. ఈ అంతర్గత అస్థిరత తరువాత ఆయన కవిత్వంలో ప్రధానంగా ప్రతిఫలించింది. ప్రారంభంలో ఆయనపై 'పార్నాసియన్' ఉద్యమ ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆ ఉద్యమం కవిత్వంలో నిర్మాణం, కట్టుదిట్టమైన శైలి, స్పష్టమైన రూపకల్పనపై దృష్టి పెట్టింది. కానీ, త్వరలోనే వెర్లైన్ ఆ దిశను విడిచిపెట్టి, మరింత సున్నితమైన, సూచనాత్మకమైన కవిత్వాన్ని ఆశ్రయించాడు. కవిత్వం అంటే స్పష్టంగా చెప్పడమేనా? లేక పాఠకుడు అనుభూతి చెందేలా చేయడమేనా? అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. వెర్లైన్ రెండో దారిని ఎంచుకున్నాడు. ఆయన దృష్టిలో కవిత్వం ఒక సంగీతంలా ఉండాలి. ఆయన ప్రసిద్ధమైన వాక్యం 'డి లా మ్యుజిక్ అవాంట్ టౌట్ ఛోజ్' కూడా సాహిత్యానికి సంగీత ప్రాధాన్యం ఉండాలనే భావనను సూచిస్తుంది. అంటే, పదాల కంటే ముందుగా వాటి శబ్దం, లయ, భావోద్వేగ ప్రభావం ముఖ్యమైనవి. ఇది ఒక విప్లవాత్మక దృక్కోణం. ఎందుకంటే అప్పటి వరకు కవిత్వం ఎక్కువగా అర్థం మీద ఆధారపడి ఉండేది. ఆయన రచనల్లో స్పష్టత కంటే అస్పష్టతకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఒక భావాన్ని నేరుగా చెప్పకుండా, దాని చుట్టూ తిరుగుతూ, పాఠకుడి మనసులో ఒక అనుభూతిని సృష్టించడం ఆయన లక్ష్యం. ఈ విధానం 'సింబలిస్ట్' ఉద్యమానికి పునాది వేసింది. ఈ ఉద్యమం ప్రకారం, కవిత్వం వాస్తవాన్ని నేరుగా చూపించకూడదు. అది సూచించాలి. ఒక చిత్రం, ఒక శబ్దం, ఒక వాతావరణం ద్వారా భావాన్ని పాఠకుడికి అనుభూతి చేయించాలి. వెర్లైన్ మొదటి కవితా సంకలనం 'పోయెమ్స్ శాటుర్నియెమ్స్'. ఇందులో ఆయన అంతర్గత బాధ, నిరాశ, జీవనంపై ఉన్న ఆలోచనలు కనిపిస్తాయి. తరువాత వచ్చిన 'ఫిటెస్ గాలాంటెస్' మరింత సున్నితమైన, కళాత్మక ప్రపంచాన్ని నిర్మిస్తుంది. ఈ కవితల్లో ఒక రకమైన మృదుత్వం, అదే సమయంలో ఒక దుఃఖభరితమైన స్వరాన్ని గమనించవచ్చు. ఆయన అత్యుత్తమ రచనగా కీర్తించబడిన 'రొమాన్సెస్ శాన్స్ పరోలెస్'లో ఈ సంగీతాత్మకత అత్యున్నత స్థాయికి చేరుతుంది. ఇందులో పదాలు కంటే వాటి మధ్య ఉన్న నిశ్శబ్దం కూడా అర్థవంతంగా మారుతుంది. తరువాత వచ్చిన 'శాగెస్సె' ఆయన ఆధ్యాత్మిక మార్పును ప్రతిబింబిస్తుంది. ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఆయన కవిత్వంలాగే అశాంతితో నిండిపోయింది. మద్యపానం, ఆర్థిక సమస్యలు, అస్థిర సంబంధాలు వంటి ఎన్నో అంశాలు ఆయన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆర్థర్ రింబౌండ్‌తో ఉన్న సంబంధం ఆయన జీవితంలో కీలక మలుపు. ఈ సంబంధం ఆద్యంతం తీవ్ర భావోద్వేగాలతో, సంఘర్షణలతో నిండింది. చివరకు ఒక ఘర్షణలో ఆయన రింబౌండ్‌పై కాల్పులు జరపడం, తరువాత జైలుకు వెళ్లడం జరిగింది. ఈ సంఘటన ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చింది. జైలులో ఉన్న సమయంలో ఆయనలో ఒక ఆధ్యాత్మిక మార్పు జరిగింది. కాథలిక్ విశ్వాసం వైపు ఆయన మళ్లాడు. ఈ మార్పు ఆయన రచనల్లో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. కానీ ఇక్కడ ఒక విమర్శనాత్మక దృష్టి అవసరం. ఈ మార్పు నిజమైన అంతర్గత పరివర్తనా? లేక పరిస్థితుల వల్ల వచ్చిన ఒక తాత్కాలిక స్పందనా? ఆయన తరువాతి జీవితం చూస్తే, ఈ ప్రశ్నకు సరళమైన సమాధానం కనిపించదు. ఎందుకంటే జైలు నుండి బయటకు వచ్చిన తరువాత కూడా ఆయన జీవితం అస్థిరంగానే కొనసాగింది. వెర్లైన్ చివరి సంవత్సరాలు పేదరికంలో గడిచాయి. ఆసుపత్రులు, కేఫేలు మధ్య జీవితం సాగింది. అయినప్పటికీ, యువ కవులు ఆయనను గౌరవించారు. 1894లో ఆయనను 'కవుల యువరాజు'గా గుర్తించారు... కీర్తించారు. వ్యక్తిగతంగా విఫలమైన జీవితం, కానీ సాహిత్యంగా అత్యున్నత గౌరవం. ఇది ఒక ఆసక్తికరమైన వైరుధ్యం. వెర్లైన్ కవిత్వం చరిత్రలో ఒక ప్రత్యేకమైన స్థానం పొందడానికి మరో కారణం ఉంది. అదేమిటంటే, 'చాన్సన్ డిఆటొమ్నె' అనే కవిత రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఒక సంకేతంగా ఉపయోగపడింది. ఈ కవిత మొదటి పంక్తులు ఫ్రెంచ్ ప్రతిఘటన దళాలకు ఒక రహస్య సందేశంగా పనిచేశాయి. ఒక కవిత, ఒక సంగీతాత్మక భావన, ఒక యుద్ధ వ్యూహంగా మారడం ఒక ఆశ్చర్యకరమైన పరిణామం. ఆధునిక కవిత్వంలో కనిపించే స్వేచ్ఛ, లయ, అస్పష్టత వంటి వివిధ పోకడలతో కూడిన సాహిత్యానికి ఆయన మార్గదర్శి. 'ప్రతి విషయం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం లేదు. కొన్ని అనుభూతులు మాటలకంటే ఎక్కువగా ఉంటాయి' అనే సూత్రాన్ని వెర్లైన్ కవిత్వం మనకు నేర్పుతుంది. మొత్తంగా, వెర్లైన్ జీవితం, రచనలు ఒక విరుద్ధాల సమాహారం. వ్యక్తిగతంగా అశాంతి, కవిత్వంలో మృదుత్వం. జీవితంలో గందరగోళం, కానీ పదాల్లో సంగీతం. ఈ విరుద్ధతలే ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి.



నేడు జయంతి

## చదవాల్సిన పుస్తకం

# సింహాసేనాపతి



ప్రసిద్ధ హిందీ రచయిత, చరిత్ర పరిశోధకుడు, పర్యాటకుడు, 'మహాపండిత్' రాహుల్ సాంకృత్యాయన్ రచించిన 'సింహాసేనాపతి' భారతీయ చారిత్రక నవలలలో ప్రత్యేక స్థానం పొందిన గొప్ప నవల. బౌద్ధం, టిబెట్ అధ్యయనం, పురాతన భారత చరిత్రలపై విస్తృతమైన పాండిత్యం కలిగిన రచయితగా ఆయన ప్రసిద్ధి చెందారు. గద్దె లింగయ్య తెలుగులో అనువాదం చేసిన ఈ నవలలో ఆయన చరిత్రను కేవలం సంఘటనల వరుసగా కాకుండా జీవంతమైన కథగా మలిచారు. నాటి మహాజనపదాల్లో ఒకటైన వైశాలిలో ప్రజాతంత్ర విధానాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. అందుకే, ఈ నవల ప్రధానంగా ప్రాచీన భారతదేశంలోని సామాజికరాజకీయ పరిస్థితులను ప్రతిబింబించే సాహిత్యంలో ముందువరుస లో నిలుస్తుంది. ఈ చారిత్రక నవలలో సుమారు క్రీస్తు పూర్వం 500 సం వత్సరాల కాలంలోని భారతీయ సమాజం కళ్ల ముందు ఆవిష్కృతమవుతుంది. వైశాలి అప్పట్లో ఒక గణరాజ్యంగా ప్రసిద్ధి చెందింది. అంటే అక్కడ రాజు ఆధిపత్యం కాకుండా ప్రజాప్రతినిధులు కలిసి పాలన నిర్వహించే విధానం ఉండేది. ఈ గణరాజ్యాన్ని పాలించిన వంశాన్ని 'లిచ్చావి' వంశం అని పిలుస్తారు. ఈ నవలలో రచయిత ఆ గణరాజ్య పాలనా వ్యవస్థ ఎలా పనిచేసిందో వివరంగా చూపించారు. అందువల్ల వైశాలి నగరాన్ని కొన్ని చరిత్రకారులు ప్రపంచంలోని మొదటి గణతంత్ర వ్యవస్థలలో ఒకటిగా కూడా భావిస్తారు. కథలో ప్రధాన పాత్ర సింహా. అతను గణరాజ్యానికి చెందిన ఒక ధైర్యవంతమైన సైన్యాధిపతి. దేశాన్ని రక్షించడం, శత్రువులను ఎదుర్కోవడం అతని ప్రధాన బాధ్యత. సింహా పాత్ర ద్వారా రచయిత నాయకత్వం, ధైర్యం, దేశభక్తి వంటి విలువలను చూపించారు. గణరాజ్యాన్ని రక్షించడానికి అతను చేసే పోరాటాలు కథలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. ఈ నవలలో యుద్ధాలు మాత్రమే కాకుండా ప్రేమ, రాజకీయ కుట్రలు, సామాజిక సంబంధాలు కూడా ఉన్నాయి. గణరాజ్యంలోని రాజకీయ వ్యవస్థలో జరిగే చర్చలు, నిర్ణయాలు కథలో కీలకం గా కనిపిస్తాయి. ప్రజలు కలిసి తీసుకునే నిర్ణయాలు, నాయకుల మధ్య జరిగే వాదనలు గణతంత్ర పాలన యొక్క స్వభావాన్ని స్పష్టంగా చూపిస్తా యి. రచయిత ప్రాచీన భారతీయ సమాజాన్ని కూడా విపులంగా చిత్రించారు. ఆ కాలంలో ప్రజల జీవన విధానం, వారి ఆచారాలు, సంస్కృతి, సామాజిక విలువలు పాఠకులకు మరో ప్రపంచాన్ని చూపిస్తాయి. ము ఖ్యంగా మహిళలకు ఉన్న స్వేచ్ఛను రచయిత ప్రత్యేకంగా ప్రస్తావిస్తారు. ఇది ఆ కాలపు సమాజం చాలా పురోగమించినదని సూచిస్తుంది. ఈ నవలలో రచయిత ప్రధానంగా స్వేచ్ఛ, సమానత్వం వంటి భావాలను ప్రతిపాదించారు. గణరాజ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం, సమాజంలో స మానత్వ భావన కథలో ప్రధాన సందేశంగా కనిపిస్తుంది. దీనివల్ల రచయిత ప్రాచీన భారతదేశంలో కూడా ప్రజాస్వామ్య ఆలోచనలు ఉన్నాయ ని సూచిస్తారు. అందుకే, సింహాసేనాపతిని కేవలం ఒక చారిత్రక నవలగా మాత్రమే చూడడానికి వీల్లేదు. అది ప్రాచీన భారతదేశంలోని గణతంత్ర వ్యవస్థ, సామాజిక జీవితం, సంస్కృతి గురించి లోతైన అవగాహనను కలిగించే రచన. సింహా అనే సైన్యాధిపతి జీవితాన్ని ఆధారంగా తీసుకుని రచయిత ఒక పురోగమించిన ప్రాచీన సమాజాన్ని పాఠకుడి ముందుకు తీసుకువచ్చారు.



అందువల్ల ఈ నవల భారతీయ చారిత్రక సాహిత్యంలో ఒక ముఖ్యమైన స్థానం పొందింది. చారిత్రక ఆధారాలను ఆధారంగా చేసుకు ని సాంకృత్యాయన్ ఒక సృజనాత్మక కథను నిర్మించారు. కథలోని పాత్ర లు, సంఘటనలు పాఠకుడిని ఆనాటి కాలానికి తీసుకువెళ్తాయి. అందువ ల్ల ఈ నవల చరిత్రను చదివిన అనుభూతి మాత్రమే కాకుండా ఒక సాహసకథను చదివిన అనుభూతిని కూడా కలిగిస్తుంది. ఆ కాలపు రాజ్య వ్యవ స్థ, సైనిక వ్యవస్థ, సమాజంలోని వర్గ విభజనలను కూడా రచయిత ఇం దులో చూపిస్తారు. ఈ కథలో యుద్ధాలు, రాజకీయ వ్యూహాలు, రాజ్యాల మధ్య పోటీ వంటి అంశాలు ఉన్నప్పటికీ, రచయిత ప్రధానంగా మానవ విలువలను ప్రాధాన్యంగా చూపించారు. సాంకృత్యాయన్ స్వయంగా చె ప్పినట్టు ఈ నవలలో సమకాలిక సమాజాన్ని చిత్రీకరించడంలో చారిత్రక కర్తవ్యాన్ని, ఔచిత్యాన్ని సంపూర్ణంగా పాటించారు. పాలీ, టిబెట్, సంస్కృత సాహిత్యాల్లో, ముఖ్యంగా జైన సాహిత్యంలో ఆ కాలపు ప్రజాస్వామికాలకు సంబంధించిన వివరాలను సాధ్యమైనంత వరకూ అందించారు. ఈ నవల రాయడానికి ఆయన పడిన శ్రమ ఏమిటో ప్రతి అక్షరంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నవల గురించి ఎంత చెప్పినా తక్కువే. చరిత్ర పుటల్లోకి వెళ్లి, అప్పటి సమాజాన్ని వీక్షించాలంటే, ఈ నవలను తప్పక చదవాలి.

### పుస్తకం పేరు

**సింహాసేనాపతి**

**రచయిత : రాహుల్ సాంకృత్యాయన్**

**వెల: రూ. 180**

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

ఈ వారం కవితలు

## శిథిలమవుతున్న సౌధాలు రేపటి తరాలకు జ్ఞాపకాలా?

హార్ముజ్ జలసంధి జనానికి ఊపిరిగా మారింది.
జనం ఊపిరి ఇరాన్ చేతుల్లో ఉంటే,
నిలువెల్లా అహం నిండిన ట్రంప్, నెతన్యాహూలు
మారణహోమమే ధ్యేయంగా కదులుతుంటే,
ఐక్యరాజ్య సమితి మెదడు మొద్దు బారింది.

అహమనే అగ్నికి ఆజ్యం పోస్తే
టెహ్రాన్‌లో మంటలు చెలరేగాయి.
అమెరికా మంటలకు టెల్ అవీవ్
వాయువు తోడై ప్రపంచాన్ని
సంక్షోభంలోకి నెడుతుంటే,
జన జీవన చక్రం ఇంధనం లేక ఆగిపోయింది.

ప్రపంచ గతులు మారుతున్నాయి.
అగ్రదేశ హింస రచన ఇజ్రాయిల్ ధ్వంస వచన
ఇంధన వనరులపై విరుచుకుపడుతుంటే..

ఇన్నేళ్ళ ప్రగతి బూడిదలో కలసి పోతుంటే..
ఇగోల గోలలో ప్రపంచం స్తంభించి పోతుంటే.
విశాల ప్రపంచంలో అశేష జనావళి
ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి.

గెలుపు కోసం అమెరికా అహం తపిస్తుంటే...
గెలిచి తీరాలని రక్తం రుచి మరిగిన
ఇజ్రాయిల్ రెచ్చి పోతుంటే..
విజయమో,వీర మరణమో అంటూ ఇరాన్
వీర విహారం చేస్తుంటే మాకొద్దీ మారణహోమ
మంటూ జన ఘోష సప్త ఖండాల్లో
మారుమోగుతున్నది.

ఇరాన్ పుట్టలో వేలు పెట్టి ప్రపంచాన్ని
చమురు మంటల్లోకి తోసి, ట్రంప్ సాధించిందేమిటి?
బెంజిమన్ నెతన్యాహూ కరడు గట్టిన రాక్షసత్వం
గాజాను రక్తసిక్తం చేసింది.
అమెరికా అహం ఇరాన్‌ను మరో గాజాలా
మార్చేస్తుంటే... ఇందులో
విజయమెవరిది?... అపజయమెవరిది?
ఎవరు నాటిన యుద్ధోన్మాద బీజం మొలకెత్తి,
మహా యుద్ధంలా మారింది?

క్షిపణుల హోరులో, డ్రోన్ల జోరులో గల్ఫ్ రణరంగమైనది.
ఆకాశ హర్మ్యాలు నేల మట్టమైనాయి.
చదువుల నిలయంపై అమెరికా క్షిపణుల రాకాసి
రెక్కలు విరుచుకుపడి,చిన్నారుల ప్రాణాలు హరించాయి.
సౌత్ పార్స్ విధ్వంసమైతే రాస్ లఫాన్ భావితరాలకు
శిథిలమైన వారసత్వ సంపదగా మిగిలింది.
చిగురించిన చెట్ల ఆకులు ఎండి నేల రాలిపోతున్నాయి.
వికసించిన పూలన్నీ విద్వేషాగ్నిలో
మాడి మసై పోతున్నాయి. తడారిన గొంతులు తల్లడిల్లి
చుక్క నీటి బొట్టు కోసం ఎదురు చూస్తున్నాయి.
ఎండిన డొక్కలు అన్నార్తితో అలమటిస్తున్నాయి.

చిక్కిశల్యమైన శరీరాలు అస్తిపంజరాల్లా
అగుపిస్తున్నాయి. సాంకేతికత విశ్వరూపం ప్రదర్శించిందని గొంతు చించుకుని సంబరపడి,
సంబరాలు చేసుకుందామా?
మానవ నిర్మిత అద్భుతాలు మానవ అహంకార
మదానికి బూడిదగా మారుతున్నాయి.
జనం ఘోష ఆయుధాల ముందు
అరణ్య రోదనలా మారింది.

– సుంకవల్లి సత్తిరాజు, 9704903463

## ఊగిసలాటలు

ఉయ్యాల ఊగుచున్నది
బాల్యపు బంగారు జ్ఞాపకాలు
బాలల నవ్వుల్లా మెల్లమెల్లగా.
చెట్టు ఊగుచున్నది
గాలికి గీతాలాపన చేస్తూ
ఆకుల తాళాలతో ప్రకృతినృత్యంలా.

మనసు ఊగుచున్నది
ఆశల అంచులపై ఆగిపోని అలలై
ఆనందం– ఆవేదనల నడుమా.
చెయ్యి ఊగుచున్నది స్నేహాల సందేశమై
సంతోషాల సవ్వడిలా.

త్రాసు ఊగుచున్నది
న్యాయాన్యాయాల నడుమ
నిజాల నిటారుదారిలా.
తల ఊగుచున్నది
అంగీకారాల అక్షరమై
అభిప్రాయాల ఆత్మస్వరంలా.

కాలం ఊగుచున్నది
గతం–వర్తమానం మధ్య
జ్ఞాపకాల స్రవంతిలా
కలలు ఊగుచున్నవి
నిజాల నెరవేర్పు దారిలో
ఆశల ఊయలపై ఊపులా.
ఊగుతూ నేర్చుకునేదే జీవితము
సమతుల్యం సొంతం చేసుకునేదే
విజయము,అలలతో ఆడుకునేదే
ఆనందము

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## 7,624 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జాతీయ లోక్ అదాలత్ కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ,న్యాయ విభాగం ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 7,624 కేసులు విజయవంతంగా పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇందులో డిడి కేసులు 4,182,ఈపెట్టి కేసులు 2,512,ఐపీసీ కేసులు 886,ఎస్ఎల్ ఎల్ కేసులు 44 లు పరిష్కారమయ్యాయన్నారు.ఈ జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో,చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతోపాటు,ప్రజల సమయం,ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు.అదేవిధంగా ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఇసుక అక్రమ తరలింపు నిలిపివేయాలని తీర్మానం



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** ఆత్మకూర్(ఎస్) మండలంలోని రామన్నగూడెం గ్రామంలో భూగర్భ జలాలు అంతరించకుండా అక్రమ ఇసుక రవాణాను నివారించేందుకు గ్రామస్తులంతా ఏకమయ్యారు. గ్రామ సమీపంలో ఉన్న ఏటి నుండి కొందరు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని దీనికి కారణంగా పరిసర ప్రాంతాల్లో బోర్లు, బావులు ఎండిపోయి తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలంటూ తీర్మానం చేశారు. అక్రమంగా ఇసుక తరలించే వారికి ట్రాక్టర్‌కు రూ.50వేలు, సహకరించిన వారికి రూ.10వేల జరిమానా విధించి గ్రామ పంచాయితీ అభివృద్ధికి ఉపయోగించాలని, ఇసుక రవాణా సమాచారం ఇచ్చిన వారికి రూ.10వేలు పారితోషకం ఇవ్వాలని గ్రామంలోని అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి గ్రామ సర్పంచ్ బత్తుల రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. సోమవారం (నేడు) తీర్మానం ప్రకారం గ్రామ పంచాయితీలో వార్డు సభ్యులు తీర్మానం చేసి అధికారికంగా మండల స్థాయి అధికారులకు అందజేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో అఖిలపక్షాలు చేసిన ఈ తీర్మానం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## 3,890 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్అదాలత్ సందర్భంగా 3890 కేసులు పరిష్కరించబడ్డాయని జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీసు శాఖ, న్యాయ విభాగంతోపాటు సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించామని అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. ఇందులో ఎం.వి.యాక్ట్, డిడి కేసులు 184 5, ఈపెట్టి కేసులు 1463, ఐపిసి కేసులు 498, ఎస్ఎల్ఎల్ కేసులు 84 పరిష్కారమయ్యాయని వివరించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా ప్రజల సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయప్రక్రి యల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్అదాల త్ కార్యక్రమాలు కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వరి కొనుగోలులో రోజుకో విధానం పాటిస్తున్న మిల్లర్లు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆరుగాలం శ్రమించి పండించిన రైతుల వరి పంట కొనుగోలులో మిల్లర్లు రోజుకో విధానం పాటించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు ఆవేధన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పలు రైస్ మిల్లులను సందర్శించి ఆయన మాట్లాడారు. గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని మిల్లర్లు రూ.2730కు పైగా కొనుగోలు చేశారని, ప్రస్తుతం రూ.100 నుంచి రూ.150 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, ఇది రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించేదిగా ఉందన్నారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు కింద వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని మిల్లులకు వరి ధాన్యం అధికంగా రావడంతో ధర తగ్గించారన్నారు. కౌలు రైతుల పరిస్తితి మరింత దారుణంగా ఉందన్నారు. లేనట్లయితే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాగిరెడ్డి మంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో జారిపడి బాలుడు మృతి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని విద్యుత్ నగర్ కాలనీకి చెందిన పర్వతం కిరణ్ సాయి (12) అనే బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు.ఆదివారం తన స్నేహితుడు త్రివిక్రమ్‌తో కలిసి ఆడుకోవడానికి ఆర్జలబావి గ్రామ శివారులో ఉన్న ఎస్ఎల్‌బీసీ కాలువ వద్దకు వెళ్లిన కిరణ్ సాయి,ఆడుకుంటూ జారి కాలువలో పడిపోయి నీటిలో మునిగి మృతి చెందినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదబాబు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు,స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుని తండ్రి వేణుగోపాల చారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.

బాలుడు మృతికి నివాళి..కుటుంబానికి ధైర్యం చెప్పిన డీసీసీ అధ్యక్షుడు

పట్టణానికి చెందిన పర్వతం వేణుకుమారుడు కిరణ్ సాయి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన నేపథ్యంలోడీసీసీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.



# న్యాయ వ్యవస్థలో ప్రజాస్వరం సాముల రామిరెడ్డి

### అంచెలంచెలుగా ఎదిగిన ఆయన జీవితం యువతకు ఆదర్శం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజా పక్షం /హుజూర్ నగర్ :** న్యాయ వ్యవస్థలో ప్రజాస్వరం హైకోర్టు బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నికైన సాముల రామిరెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సూర్యపేట జిల్లా హుజూర్ నగర్ లో హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నికైన స్థానిక బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాముల రామిరెడ్డిని సిపిఐ కార్యాలయంలో శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా,అడ్వకేటుగా,బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామిరెడ్డి అంచెలంచెలుగా ఎదిగిన విధానం నేటి యువతకు ఆదర్శమన్నారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి మారుమూల కోర్టులో ప్రాక్టీస్ చేసి హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికవ్వడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో రామిరెడ్డి మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పుస్తక ఆవిష్కరణ...**

అలాగే సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి రాసుకున్న ప్రజలతోనే నా ప్రయాణం అనే జీవిత చరిత్ర పుస్తకాన్ని హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు సాముల రామిరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ దోపిడి కి వ్యతిరేకంగా ఎర్ర జెండాకు జీవం పోసిన మహానేత సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. సిపిఐ సిద్ధాంతాలకు ప్రతిరూపమే సురవరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,చెన్నగాని సైదులు, జడ శ్రీనివాస్,నంద్యాల రామ్ రెడ్డి, కాల్వ శ్రీనివాసరావు,కుక్కడపు బాలకృష్ణ,నట్టే సత్యనారాయణ, ఇందిరాల వెంకటేశ్వర్లు,మామిడి వెంకయ్య, జడ వెంకన్న,ఆర్ శ్రీనివాస్,కెవి సత్యనారాయణ, చక్రాల వెంకటేశ్వర్లు, యల్లావుల శివ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపి చామలను కలిసిన నాయకులు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని భువనగిరి మండలంలోని గౌస్ నగర్ గ్రామ సర్పంచ్ భూషబోయిన గీతా శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్ పేట్ క్యాంప్ ఆఫీసులో వారిని కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీ చామల కిరణ్ కుమారెడ్డిని శాలువాతో సన్మానించారు. మన గ్రామ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ఎంపీని నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. ఎంపీ ఈ విషయంపై సానుకూలంగా స్పందించి త్వరలో గ్రామంలో పర్యటిస్తానని తెలిపారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేయ డం తెలియజేశారు. ఉప సర్పంచ్ మధు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గడసందుల కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు గడసందుల రమేష్ పాల్గొని ఎంపీని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం

### రూ.281.46 కోట్లతో అభివృద్ధికి ప్రాధాన్యం

### మంత్రి ముందుచూపుతో నల్లగొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తాం

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కార్పొరేషన్ 2026/27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను నగరపాలక మండలి ఆమోదించింది. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సభ ముందు ప్రవేశపెట్టిన రూ.281 కోట్ల 46.74 లక్షల అంచనా బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈబడ్జెట్‌లో పన్ను రాబడిగా రూ.30.24 కోట్లు,పన్నేతర రాబడిగా రూ. 27.37 కోట్లు,అసైన్డ్ ఆదాయంగా రూ.12 కోట్లు, గత ఆర్థిక సంవత్సర మిగులు రూ.9.32 కోట్లు అంచనా వేశారు.తెలంగాణ పురపాలక సంఘ చట్టం2019 ప్రకారం తప్పనిసరి ఖర్చుల కింద ఉద్యోగుల జీతభత్యాలకు రూ.20.26 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.5.75 కోట్లు, విద్యుత్ బిల్లులకు రూ.7.02 కోట్లు, హరితహారం కార్యక్రమాలకు రూ.6.97 కోట్లు కేటాయించారు. మొత్తం తప్పనిసరి ఖర్చులు రూ.40 కోట్లుగా నిర్ధారించారు.విద్యుత్ బకాయిలు రూ.15 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా పరిపాలన,నిర్వహణ ఖర్చులకు రూ.9.85 కోట్లు కేటాయించగా,బలహీన వర్గాలు,మురికివాడలు శివారు ప్రాంతాల అభివృద్ధికి రూ.6.49 కోట్లు కేటాయించారు. పార్కులు, ప్రజా మరుగుదొడ్లు, మార్కెట్లు, డంప్ యార్డులు,ఇతర సౌకర్యాల అభివృద్ధికి రూ.2.35 కోట్లు, వివిధ డివిజన్ల అభివృద్ధి పనులకు మూలధన వ్యయంగా రూ.18.45 కోట్లు కేటాయించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా రూ.203 కోట్లు గ్రాంట్ల రూపంలో వచ్చే అవకాశముందని అంచనా వేశారు. ఇది లా ఉండగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషితో పానగల్ బ్రిడ్జ్ నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు రూ.14.40 కోట్లతో రోడ్ విస్తరణ పనులకు ఇటీవల ఆమోదం లభించినట్లు తెలిపారు.అలాగే హడ్కోతో కుదిరిన ఒప్పందం ద్వారా గృహ నిర్మాణం, డ్రైనేజీ,ఘన వ్యర్థాల నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు సమీకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ ఆమెర్,కమిషన్ శరత్‌చంద్ర, కార్పొరేటర్‌లు,అధికారులు ఉన్నారు.





## ఎమ్మెల్సీ సత్యంను కలిసిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు

### ఎమ్మెల్సీకి డైరీ బహుకరణ , శాలువాతో ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/చండూరు :** ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆదివారం చండూరుకు వచ్చిన సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రికిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు ఆయనను మర్యాదపూర్వరంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు టిఈఈ1104 యూనియన్ 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను బహుకరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలో కార్యికులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకుపోయారు. సానుకూలంగా స్పందిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విద్యుత్ రంగంలో గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే ఉద్యోగుల ,కార్మికుల సమస్యలును విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న , రిటైర్డ్ లైన్ ఇన్స్పెక్టర్ నిరంజన్ అలీ , తెలంగాణ ఎలక్ట్రికిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు షరీఫ్ , సజ్జు , చంద్రమౌళి , విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై చేరిక

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆత్మకూర్(ఎస్) మండలం హస్లాతండ గ్రామ సర్పంచ్ (బిఆర్ఎస్) వాంకుడోతు బుజ్జమ్మతోపాటు ఉపసర్పంచ్ రావత్ జీవన్, వార్డు సభ్యులు వాంకుడోతు శ్రీరాములు, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, హరి, దేవ్, మంగ్యా నాయక్, బిక్షంలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లతోపాటు మహిళలకు మహాలక్ష్మి పథకాలను తెచ్చాడన్నారు. బిఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందని, భవిష్యత్తులో రేవంత్ రెడ్డిని ఆదరించి మరోసారి అధికారంలోకి తేవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గ్రామాభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, ధర్మానాయక్, లింగానాయక్ పాల్గొన్నారు.

# గొలుసుకట్టు చెరువుల ద్వారా సాగునీరందించాలి

### రాచకొండలో రిజర్వాయర్ సాధనకై నేడు జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలని సిపిఐ చేపట్టిన ప్రచార జాత రెండోరోజు చేరుకుంది. రెండవ రోజు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని గిరిజన తండాలలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు తహసిల్దార్ కార్యాలయం ముందు నిర్వహించే బోయే మహా ధర్నా కార్యక్రమానికి రైతులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శివన్నగూడ ప్రాజెక్టు నుండి రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి నారాయణపురం మండలానికి నీటిని తరలించి గొలుసుకట్టు చెరువుల ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని అన్నారు. ఈ ప్రభుత్వమైనా చిత్తశుద్ధితో క్షామ పీడిత ప్రాంతమైన మునుగోడు నియోజకవర్గాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ జిల్లా మంత్రులు ప్రత్యేక దృష్టి సారించి శివన్నగూడ ప్రాజెక్టు నుండి డి పి ఆర్ చేయించి తద్వారా పనులు ప్రారంభించే విధంగా పనులు ప్రారంభించే విధంగా శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు బి.జగన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, సంజీవ, సిపిఐ నాయకులు పల్లె మల్లారెడ్డి, రమేష్, మల్లయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, గడ్డం యాదయ్య, లచ్చు నాయక్ పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులు ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి

### ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాప్రతినిధులు ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని జెకె బ్యాంకెట్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి అంజద్ అలీ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నుండి నూతనంగా కౌన్సిలర్లుగా ఎన్నికైన వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో సభ్యులు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోబోయే చర్యల గురించి ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. సూర్యాపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్న విషయం ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులతోపాటు ప్రజలకు వివరించాలన్నారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కార మార్గానికి ప్రయత్నించాలన్నారు. సభ్యులందరూ కలిసి కట్టుగా పట్టణ అభివృద్ధితోపాటు పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకం ఉంచి ప్రజాప్రతినిధిగా గెలిపించుకున్నందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవ చేసి గుర్తింపు పొందేందుకు కృషి చేస్తామన్నారు. సేవే లక్ష్యం గా ముందుకు సాగి వారి మన్ననలు పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిన్న జహీర్ పాల్గొన్నారు.



# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

### షార్ట్ సర్క్యూట్‌తో గృహిణి మృతి!!



**ప్రజాపక్షం/సూర్యాపేట :** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ గృహిణి మృతి చెందిన సంఘటన సూర్యాపేట నియోజక వర్గంలోని చివ్వెంల మండలం గుంజలూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ హృదయవిదారక సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుంకరి అంజమ్మ (70) ఉదయమే నిద్రలేచి తన ఇల్లును శుభ్రం చేసుకున్న తరువాత నల్లా నీటి సంపుకు ఉన్న విద్యుత్ మోటర్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్ళగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందింది. ఈమె మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు ఆరోపించడంతోపాటు జరిగిన సంఘటనను బట్టి స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటికైనా వీరు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే అనేక మందికి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉండడంతోపాటు అపారమైన ఆర్థిక నష్టాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. గుంజలూరు గ్రామంలోని పెరిక బజారులో పెద్దబాయి సమీపంలో ఉన్న 15కెవి ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువై విద్యుత్ హెచ్చుతగ్గులు వస్తుండడంతో దాని పరిధిలోని 200 నివాస కనెక్షన్లకు ఫ్యాన్లు, టివిలు, ఫ్రిజ్‌లు గత నెల రోజుల నుండి షార్ట్ సర్క్యూట్‌కు గురై తరుచూ కాలిపోతున్నాయి. అవి ముట్టుకున్న వారు షాక్‌కు గురైన సంఘటనలు కోకొల్లలు. ఇదిలా ఉంటే దీని పరిధిలోనే 40 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా మోటార్లు కాలి రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

**గోడలకు సైతం విద్యుత్ సరఫరా**

విద్యుత్ పరికరాలకే కాకుండా నివాస గృహంలోని గోడలకు సైతం విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు. ఎంత జాగ్రత్తగా ఉన్నా రోజు ఎవరికో ఒకరు విద్యుత్ షాక్‌కు గురవడంతోపాటు విద్యుత్ పరికరాలు సైతం కాలిపోతున్నాయి. ఇప్పటికే అపారమైన ఆర్థిక నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా జరిగింది. పెరిక బజారులో నివాసం ఉంటున్న వారు గత నెల రోజుల నుండి విద్యుత్ షాక్‌కు గురవుతూ విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోని పరిస్థితి ఉందని వాపోతున్నారు. గట్టిగా నిలదీయడంతో తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకొని వెళ్తూ తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటి కన్నా విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతోనే...**

ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటి కన్నా విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయని దీనివల్లే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తూ షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని లైన్‌మెన్ ఇ. నరేందర్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌పై ఓ నిండి ప్రాణం బలైన సంఘటన ఆయన దృష్టికి ప్రజాపక్షం తీసుకువెళ్ళగా ఇటీవల ఇలాంటి సమస్య తలెత్తుతే మరమ్మత్తులు చేశామని చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహిణి మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న తాము గ్రామానికి వెళ్ళి మరోమారు మరమ్మత్తులు చేశామన్నారు. మండల విద్యుత్ అధికారి మల్లయ్య దృష్టికి గతంలో ఈ విషయం తీసుకవెళ్ళామని 15కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను 25కెవి గా మార్చేందుకు ఎస్టిమేట్ వేయడం జరిగిందని త్వరలోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తామని చెప్పారు.

## టిడిపి ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/సికింద్రాబాద్: తెలుగుదేశంపార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. వారాసిగూడ కూడలిలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజక వర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ విచ్చేసి తెలుగుదేశం పార్టీ జెండాని ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ....తెలుగువారి కీర్తి ప్రతిష్టల్ని ప్రపంచం నలుమూలల చాటిచెప్పిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టిటిడిపి నేతలు పరిటాల విజయ్ కుమార్, వెంకటస్వామి, పొట్టి శీను, పిట్ల శంకర్ ముదిరాజ్, చిరంజీవిరాజు, శేషిరేఖ, జిఎం రమేష్, చంద్రమోహన్, మురళీకృష్ణ, నాయుడు, రాజు, టెంట్ హౌస్ శంకర్, జగదీష్, సుధాకర్, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి మోదీ ఆదర్శం



ప్రజాపక్షం/సికింద్రాబాద్: ప్రపంచానికి ప్రధానమంత్రి మోడీ ఆదర్శంగా నిలిచారని సికింద్రాబాద్ బిజెపి సీనియర్ నేత మేకల సారంగపాణి కొనియాడారు. ఈ మేరకు పార్సిగుట్ట, అశోక్ నగర్‌లలో బిజెపి నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ సాయి దత్తు నివాసంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించిన సారంగపాణి మాట్లాడుతూ.. దేశం కోసం, యువత కోసం, మహిళల కోసం భారత ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో చేసే అభివృద్ధి కార్యక్రమం.. ప్రజలు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యంపై నరేంద్ర మోడీ చక్కగా వివరించారని తెలిపారు. యువత, మహిళలు అనేక వర్గాల ప్రజలు తమ కాళ్లపై వారు నిలబడి వారి జీవనం కొనసాగించే విధంగా స్వయం సహాయ కార్యక్రమాలు వివరించడం జరిగిందన్నారు. మన్‌కి బాత్ విక్షించిన వారిలో బిజెపి నేతలు సాయి దత్తు, హనుమంతు ముదిరాజ్, మేకల కీర్తి హర్ష కిరణ్, బైరి అమరావతి, సురేష్, బిక్షపతి, శ్రీనివాస్‌రావు, రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం ఉత్సవం



ప్రజాపక్షం/కంటోన్మెంట్: మట్టల ఆదివారం ఉత్సవాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రెండో వార్డు పరిధి అన్నానగర్, ఇందిరమ్మనగర్, అర్జున్‌నగర్, రసూల్‌పురా ప్రాంతంలో సాంసంగ్ రాజు నేతృత్వంలో మట్టల ఆదివారం ఉత్సవాలను నిర్వహించగా.. ముఖ్యఅతిథులుగా మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి హాజరయ్యారు. ఈ ర్యాలీలో క్రైస్తవులు మట్టలను చేత బూని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రవీణ్ కుమార్, వనెహెమ్యా శ్రీనివాస్‌రావు, నాగేశ్వరరావు, పాస్టర్ ఎలీషా పాల్గొన్నారు.

## టిడిపి అణగారిన వర్గాల పెన్నిది



ప్రజాపక్షం/ముషీరాబాద్: అణగారిన వర్గాలకు గుర్తింపు తీసుకువచ్చింది.. అణగారిన వర్గాల పెన్నిది తెలుగుదేశం పార్టీ అని సికింద్రాబాద్ పార్లమెంటు నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్ కొనియాడారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దోమల్‌గూడలోని టిటిడిపి హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంటు నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ పతాక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి... కేక్ కట్ చేసి.. పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు, తెలుగువారి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన దివంగత ఎన్‌టీఆర్ ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడన్నారు. టిడిపి ఆవిర్భవించి 44 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా కార్యకర్తలందరికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుతమ్ముళ్లు శ్యామ్‌సుందర్, పరుశురామ్, కిరణ్, భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్ గౌడ్, నాయుడు, ఓ.వెంకటేష్ చౌదరి, వైఎల్.నర్సింహా గౌడ్, సత్యనారాయణ, ఆనంద్, శక్తి ప్రేమ్, సాయి, యాదగిరి, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

## కథా సంపుటి గగ్గమ్మ పుస్తకావిష్కరణ



ప్రజాపక్షం/చిక్కడపల్లి: తపస్వి మనోహరం అంతర్జాల మాస, వార పత్రిక, పబ్లికేషన్స్ సంస్థ ఐదవ వార్షికోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ రచయిత్రి, కవయిత్రి వ్యక్తిత్వ వికాస నిపుణులు, తపస్వి మనోహరిలో కాసేపు నాతో శీర్షిక కాలమిస్ట్ రమాదేవి కులకర్ణి కథల సంపుటి గగ్గమ్మ పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ విపులచతుర పూర్వ సంపాదకులు చంద్రప్రతాప్ కంతేటి, ప్రముఖ కవి సాదనాల వెంకటస్వామీనాయుడు,ప్రముఖ రచయిత చంద్రశేఖర ఆజాద్, సంస్థ సిఈఓ నిమ్మగడ్డ అవినాష్ కార్తిక్, డైరెక్టర్స్ అఖిల, బుజ్జమ్మ, విజయ తదితరులు పాల్గొని.. గగ్గమ్మ పుస్తకావిష్కరణ చేసి తొలి ప్రతి ప్రహర్షితా భరద్వాజ్‌కు అందజేశారు. రచయిత్రి వివిధ పోటీలలో ప్రథమ బహుమలు గెలుచుకున్న అద్భుతమైన ఇరవై రెండు కథల సమాహారం గగ్గమ్మ అని విశ్లేషించారు.

# నీటి కష్టాలకు చెక్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్ నగర్: మహబూబ్ నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో రూ.220 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చుతోంది. నగరాభివృద్ధిలో కీలక మలుపు తీసుకురాబోయే ఈ ప్రణాళిక భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందిచబడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 1860కిలో లీటర్ల సామర్థ్యంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 14 నూతన వాటర్ ట్యాంకులను నిర్మించనున్నారు. ఈ ట్యాంకులు నిర్మాణం పూర్తయ్యాక నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగి, నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా వ్యవస్థను బలోపేతం చేయానున్నారు. ఇందులో భాగంగా నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్వయంగా స్థల పరిశీలన నిర్వహించారు. ప్రగతి నగర్‌లో 18 లక్షల లీటర్లు, పద్మావతి కాలనీలో 15లక్షల లీటర్లు, సాంబశివుడు దేవాలయం కొండపై 20లక్షల లీటర్లు, తిరుమల హిల్స్‌లో 5లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరంలోని ఈ 14 వాటర్ ట్యాంకులు ఏర్పాటు పూర్తయ్యాక మహబూబ్ నగర్ ప్రజలకు ఇక పై తాగునీటి కొరత ఉండదని, ప్రతి ఇంటికి సమృద్ధిగా నీరు అందేలా శాశ్వత పరిష్కారం సిద్ధమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి సమస్యలను పూర్తిగా తొలగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే, ఈ పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం త్వరలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పనులు ప్రారంభమైన తర్వాత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు రమేష్ రెడ్డి, రఘు, కిషన్ నాయక్, జ్యోతి, రామస్వామి నాయకులు, లీడర్ రఘు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 1718 కేసులు పరిష్కారం : ఎస్‌పి సంగ్రామ్ సింగ్ జి.పాటిల్



ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ : రాజీ మార్గమే రాజ మార్గం అని జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భారీగా కేసులను పరిష్కరించుకున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 1718 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ 39 కేసుల్లో 8.25 లక్షల రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేశారని జిల్లా ఎస్పీ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన 1718 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 310, ఈ పెట్టి కేసులు 870, డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు 499 సైబర్ కేసులు 39 పరిష్కరించడం ద్వారా 825319/ రూపాయలు బాధితులకు అందజేశారని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గోవర్ధనగిరిలో నాటు బాంబు పేలుడు కలకలం

ఒకరికి తీవ్ర గాయాలు

మరో 8 నాటు బాంబులు చెరువులోకి విసిరివేత



ప్రజాపక్షం/వీపనగండ్ల: వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో నాటు బాంబు పేలుడు సంచలనం రేపింది. ఈ ఘనటలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన, ప్రమాదం నివారించాలనే ఉద్దేశంతో మరో ఎనిమిది నాటు బాంబులను చెరువులోకి విసిరివేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు కథనం ప్రకారం, గోరవ్ధనగిరి గ్రామానికి చెందిన పశువుల కాపరులు మేకల శేఖర్, రమణమోని మహేష్, ఎం.డి చాంద్ బాషా అనే ముగ్గురు వ్యక్తులు శనివారం పశువులను మేపేందుకు గ్రామ ఊరుచెరువు అలుగు సమీప ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో గోవర్ధనగిరి నుండి గోపాలదిన్నెకు వెళ్లే మార్గంలో ఉన్న పందుల షెడ్డు వద్ద చెట్టుపై అనుమానాస్పదంగా వేలాడుతున్నారు ఒక కవర్‌ను గమనించారు. ఆసక్తితో వారు ఆ కవర్‌ను కిందికి దించి తెరిచి చూడగా అందులో గుండ్రంగా బంతి ఆకారంలో ఉన్న ఐదు వస్తువులు కనిపించాయి. వాటి స్వరూపం తెలియపోవడంతో మేకల శేఖర్ వాటిలో ఒకదాన్ని రాతిపై పెట్టి కొట్టగా, అది ఆకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ పేలుడులో శేఖర్ ఎడమచేతికి తీవ్ర గాయాలు అయ్యి, అధిక రక్తస్త్రాం జరిగింది. వెంటనే గ్రామస్తులు అతడిని 108 అంబులెన్స్ ద్వారా వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, ఘటన స్థలానికి సమీపంలోని పందుల షెడ్డు యజమాని ఎరుకలి బిచ్చన్న అక్కడికి చేరుకొని, పేలని నాలుగు నాటు బాంబులతో పాటు, తన షెడ్డు వద్ద లభించిన రెండు బాంబులు, సమీప ప్రాంతంలో గుర్తించిన మరో రెండు బాంబులను కలిపి మొత్తం ఎనిమిది నాటు బాంబులను ప్రమాదం జరగకుండా చెరువులోకి విసిరివేసినట్లు తెలిపాడు. గ్రామస్తులు సమాచారం ప్రకారం, ఇటీవల ఇతర ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు అడవి పందుల వేట కోసం ఈ ప్రాంతానికి వస్తున్నట్లు తెలుస్తోంది. వారే ఈ నాటు బాంబులను తెచ్చి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుతున్న స్థానిక ఎస్సై నరేష్ ఆదివారం మధ్యాహ్నం తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. నాటు బాంబులు లభించిన విషయాన్ని పోలీసులకు తెలియజేయకుండా వాటిని చెరువులోకి విసిరి వేసిన బిచ్చన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో గ్రామంతో భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు పదార్థాలు అక్కడికి ఎలా చేరాయి అన్న అంశంపై అనుమానాలు వ్యక్తంమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాల్లో అనుమానాస్పద వస్తువులు కనిపించినట్లయితే వాటిని తాకకుండా వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## మైనర్ బాలికల ఘటనలో ఏడుగురు నిందితులు రిమాండ్

ఎస్‌పి వినీత్



ప్రజాపక్షం/నారాయణపేట్ : మద్దూరు మండలం మోమినపుర్ గ్రామలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో మైనర్ బాలికకు సంబంధించిన ఘటనలో మొత్తం 7 మంది నిందుతులను పోలీసులు రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎ1 చండేపల్లి స్వామి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పెదిరపాడు గ్రామానికి చెందిన ఇతను తన అధికారాన్ని దుర్వినియోగం చేసి బాలికతో అనుచితంగా ప్రవర్తించినట్లు సీసీ కెమెరాలలో నమోదు కాగా ఆ సీసీ కెమెరాలు ఎ2 గుర్నాథ్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఏర్పాటు చేసి ఆ వీడియోను ఎ3 కర్ని చెన్నకేశవులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాచిపెట్టి ఇతర నిందితులు ఎ4 గుల్ల రవికుమార్, ఎ5 బి.ఆనంద్, ఎ6 విజయ్ కుమార్, ఎ7 మేకల రవి, సాక్ష్యాలను దాచిపెట్టడం, వీడియోను అనధికారికంగా పంచుకోవడం అదే గ్రామంలో డబ్బులకు రాజీ ప్రయత్నాలు చేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసు విచారణ డీఎస్పీ నల్లపు లింగయ్య చేపట్టగా అట్టి మైనర్ బాలికపై ప్రధాన నిందితుడు పాలు మార్లు అత్యాచారానికి పాల్పడినాడని విచారణలో వెల్లడైంది. అతని పై, అతినికి సహకరించిన వ్యక్తుల పై పోక్సో, ఐటీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసులు నమోదు చేసి సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని మొత్తం 7 మందిని రిమాండ్ కు పంపడం జరిగిందని ఎస్పీ తెలిపారు. నారాయణపేట జిల్లాలో, విద్యాసంస్థల్లో విద్యార్థులు భద్రత అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్నామని, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా అత్యవసర సమయంలో డయల్ 100కి లేదా 112,1098కి తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమస్యలను చట్టపరంగా పరిష్కరించకుండా స్వయంగా రాజీ ప్రయత్నాలు చేయడం లేదా నేరాలను దాచిపెట్టడం వంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన నేరాలుగా పరిగణివంచి ఆ వ్యక్తుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# దళితులపై కొనసాగుతున్న దాడులు!

• దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక • పట్టించుకోని అధికారులు!

ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట జిల్లాలో దళితుల పై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ దాడులపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనపరుస్తూ సరైన చర్యలు తీసుకోకపోవడం ద్వారా జిల్లాలోని దళితులు తీవ్ర ఆందోళన గురవుతున్నారని దళిత ప్రజా సం ఘాల ఐక్యవేదిక ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసిం ది. ఈనెల 25న నారాయణపేట పట్టణంలో మోతే ఎర్ర కాశప్ప బుడగ జంగంపై కన్నా శివకుమార్ అతని అల్లు డు రవికుమార్లు కర్రలతో దాడి చేసి చంపడానికి ప్రయ త్నం చేశారు. తీవ్రరక్తస్రావమైన కాశప్పను ఆసుపత్రుల్లో చేర్పించారు. చావు బ్రతుకుల మధ్య ఉన్న కాశప్ప ఆదివారం వరకు కూడా ఐసియులో చికిత్స పొందుతున్నా డు. ఈ విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసు లు నిందితులెవరిని ఇప్పటివరకు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపలేదు. అమ్మిరెడ్డి పల్లెలో ఈనెల 27న రాముల వారి కల్యాణం సందర్భంగా దళిత దంపతులు లక్ష్మీ (గ్రామ సర్పంచ్) ఆంజనేయులు కల్యాణం నిర్వహణలో ఉండకూడదని, పూజల్లో కూర్చున్న సర్పంచ్ దంపతులను లేపి పంపి అవమానపరిచిన కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న వెంకట్రామరెడ్డిపై అతని అనుచరులపై కేసు నమోదు అయ్యింది. నిందితులను ఆదివారం వరకు రిమాండ్‌కు పంపలేదు. దానిలో సర్పంచ్ దంపతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కృ ష్ణ మండలం చేగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి లింగప్పపై గ్రామ సర్పంచ్ కుమారుడైన సంజీవరెడ్డి గౌ డ్, బసవరాజప్ప గౌడ్‌లు దాడి చేసి తలలు పగలగొట్టా రు. లింగప్ప ప్రాణ భయంతో ధావకానకు పోలీస్ స్టేషన్ కు కారు తీసుకుని వెళ్తుంటే కారును అడ్డగించి రాళ్లతో కారు అద్దాలు ధ్వంసం చేసి మోటార్ సైకిల్ పై పోలీస్ స్టేషన్ వరకు తరిమి తరిమి రాళ్లతో కొట్టడం జరిగింది. తలపగిన లింగప్ప, రక్తస్త్రావమైన ఆయన కొడుకు, దెబ్బ లు తిన్న ఆయన భార్య పోలీస్ సేషన్‌కు వెళ్లి న్యాయం కై దరఖాస్తు చేయడం జరిగింది. ఈ విషయంలో కేసు న మోదు అయినప్పటికీ నిందితులను ఎవరిని అరెస్టు చే య లేదు రిమాండ్‌కు పంపలేదు దీనితో గ్రామంలో బసవరాజప్ప గౌడ గుంపు సమావేశాలను ఏర్పాటు చేస్తూ రాజీ కాకుంటే దళితులపై దాడి చేయడానికి కుట్రలు పన్నుతున్నాడని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. మద్దూరు మండలంలోని మోమినాపూర్ గ్రామ దళిత బాలిక పట్ల అసభ్యంవగా ప్రవర్తించిన స్వామి అనే టీచర్‌పై, అసభ్యంగా ఉన్న వీడియోను కుట్రపూరితంగా వైరల్ చేసిన టీచర్ గుర్నాథ్ రెడ్డిపై, ఇతరులపై కేసు నమోదు అయ్యింది. కానీ నిందితులు ఎవరిని ఇప్పటివరకు రిమాండ్‌కు పంపలేదు. పై సంఘటనల్లో ఒక్కరిని కూడా ఇప్పటివరకు రిమాండ్‌కు పంపలేదు. అంతేకాక ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం దళితులకు అవమానం జరిగిన సందర్భంలో, తహసిల్దార్ గ్రామాన్ని సందర్శించి వి చారణ జరిపి నిందితులను రిమాండ్ చేయుటకు చర్య లు తీసుకోవాలని ఉంది. పై ఒక్క సంఘటనలో కూడా మెజిషియల్ పవర్ కలిగిన అధికారులు ఎవరూ కూడా సందర్శించలేకపోవడం ద్వారా అధికారుల నిర్లక్ష్యం బయటపడుతుందని వారు ఆరోపించారు. అధికారులు దళితులపై జరుగుతున్న దాడుల విషయంలో నిందితుల పట్ల ఉదాసీన వైఖరి అవలంబించడం జరుగుతున్నదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా దళితులపై జరిగిన దాడుల విషయంలో నిందితులందరిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపి సమగ్ర విచారణ జరిపి దళితులకు న్యాయం జరిగేఆ చూడాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,416 పరిష్కారం : ఎస్‌పి జానకి

సైబర్ బాధితులకు రూ.42,97,445 నగదు అందజేత

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారంలో విశేష ఫలితాలు సాధింబడినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టల పరిధిలో ఉన్న మొత్తం 3,416 కేసులు పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. వాటిలో ఐపీసీ కేసులు 524, డీడీ కేసులు 794 ఈ పెట్టీ ఈ పిఈటిటివై కేసులు 1,979 సైబర్ క్రైమ్ కేసులు 119 ఈ కేసుల పరిష్కారంతో బాధితులకు తక్షణ న్యాయం అందించడంతో పాటు కోర్టులపై ఉన్న భారం కూడా తగ్గినట్లు ఎస్పీ వెల్లడించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వివాదాలను స్నేహపూర్వకంగా, వేగవంతంగా పరిష్కరించుకోవడం వల్ల ప్రజలకు సమయం, ధనం ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలు ఈ విధమైన అవకాశాలను వినియోగించకోవాలని కోరారు.

# డిఎంకె వరాల జల్లు

మహిళలకు నెలకు రూ.2 వేలు

టివి, ఫ్రిజ్ కొనుక్కునేందుకు మరో రూ.8వేలు!

చెన్నై : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు ప్రజలకు అధికార డిఎంకె పార్టీ వరాల జల్లు కురిపించింది. తమిళనాడులో మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు అందుతున్న నెలవారీ గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి 2 వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సిఎం స్టాలిన్ విడుదల చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులే లక్ష్యంగా పలు పథకాలను ప్రకటించిన స్టాలిన్, ఇల్లత్తరసి పథకం కింద ప్రతి గృహిణికి 8 వేల రూపాయల విలువైన కూపన్లను అందజేస్తామని స్టాలిన్ తెలిపారు. ఈ కూపన్లను ఉపయోగించి మహిళలు తమకు టివి, మిక్సీ, గ్రైండర్ వంటి వస్తువులను కొనుగోలు చేయవచ్చని వెల్లడించారు. అదే కూపన్లతో పాత వస్తువులను మార్చుకోవచ్చని స్టాలిన్ స్పష్టం చేశారు.



### ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు పిల్లలకు అల్పాహార పథకం

పాఠశాలల్లో అమలవుతున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఉచిత విద్యుత్ పథకం కింద రైతులకు ఎలాంటి మీటర్లు లేని ఆధునిక పంపుసెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల కొత్త ఇళ్లను నిర్మించి పేద వాళ్లకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఇచ్చే నెలవారీ ప్రోత్సాహకాన్ని వెయ్యి రూపాయల నుంచి 15 వందల రూపాయలకు పెంచుతామని తెలిపారు.

### వైద్య బీమా మొత్తం 10 లక్షల రూపాయలకు పెంపు

ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా పథకం కింద వార్షిక ఆదాయ పరిమితిని 5 లక్షలకు పెంచి వైద్య బీమా మొత్తాన్ని 10 లక్షల రూపాయలకు పెంచుతామని స్టాలిన్ వెల్లడించారు. వరి మద్దతు ధర క్వింటాలుకు 3 వేల 500 రూపాయలు, చెరకు మద్దతు ధర టన్నుకు 4 వేల 500 రూపాయలకు పెంచుతామని స్టాలిన్ స్పష్టం చేశారు. వృద్ధులకు ఇచ్చే నెలవారి పింఛను 2 వేల రూపాయలకు పెంచుతామని స్టాలిన్ స్పష్టం చేశారు.

ఈసారి మేనిఫెస్టో మాత్రం 'సూపర్ స్టార్' సాధారణంగా డిఎంకె మేనిఫెస్టో అంటే తమిళ నాడు రాజకీయాల్లో ఒక 'హీరో' లాంటిదని, కానీ ఈసారి మేనిఫెస్టో మాత్రం 'సూపర్ స్టార్' అని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను, ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ మేనిఫెస్టోను రూపొందించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు 35 లక్షల ఉచిత ల్యాప్‌టాప్‌లు 5 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణతో పాటు రూ.1,500 స్టైఫండ్ ఇస్తామని ప్రకటించారు. రూ.18లక్షల కోట్ల పెట్టుబడులు, 50 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంకా విద్యార్థులకు 35 లక్షల ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించనున్నట్లు వివరించారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం మే 10తో ముగియనుంది.

## 'సబ్సిడీ నిత్యావసరాలకు బ్రాహ్మణులు వివరాలివ్వండి'



ప్రజాపక్షం / సోమాజిగూడ:రాష్ట్రంలోని మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో నిత్యావసర సరుకులను సబ్సిడీల రూపంలో అందజేస్తున్నట్టు 'గిరిప్రసాద్ శర్మాస్ బి మార్ట్' వ్యవస్థాపక అధ్యక్షులు గిరిప్రసాద్ శర్మ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మార్ట్ సరఫరాల అధికారిణి వేదాంతి పాండేతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి మండలకేంద్రాల్లో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొన్నబ్రాహ్మణులకు కందిపప్పు, చక్కెర, గోల్డ్ డ్రాప్, సన్‌ఫ్లవర్ ఆయిల్, గోధుమపిండి వంటి ప్రధాన అవసరాల సరుకులు తక్కువ ధరల్లో అందిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు అవసరమైన బ్రాహ్మణులు సెల్ నంబర్ 9701609689 వాట్సాప్ మెసేజ్ చేసి లేదా https:indianbrahmins.com లింకు ద్వారా పిన్‌కోడ్ నంబర్‌తో సహా వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

# మురిసిన ముంబై!

## రోహిత్, రికెల్టన్ అర్ధశతకాల హోరు..


ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌ను ముంబై ఇండియన్స్ విజయంతో ఆరంభించింది. ఆరంభ మ్యాచ్ ఫోబియాను అధిగమిస్తూ రికార్డు విజయంతో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ముంబై చెక్ పెట్టింది. 221 పరుగుల భారీ ఛేదనలో ఓపెనర్లు రోహిత్ శర్మ(78), రియాన్ రికెల్టన్(81) అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడ్డారు. పవర్ ప్లేలో 80 పరుగులతో గట్టి పునాది వేసిన ఈ ద్వయం మ్యాచ్‌ను ముంబైవైపు తిప్పింది. వీరిద్దరు ఔటైనా కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 నాటౌట్), తిలక్ వర్మ(20)లు ఆడుతూపాడుతూ లాంఛనం పూర్తి చేశారు. పంతొమ్మిదో సీజన్ రెండో మ్యాచ్‌లోనూ రెండొందల లక్ష్యం సరిపోలేదు. వాంఖడేలోనూ బ్యాటర్ల విధ్వంసానికి బౌలర్లు తేలిపోగా ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్దేశించిన 221 పరుగుల భారీ ఛేదనలో ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ(78), రియాన్ రికెల్టన్(81) బౌండరీలతో రెచ్చిపోయారు. ఫుల్ షాట్లతో హిట్‌మ్యాన్, స్టన్నింగ్ షాట్లతో రికెల్టన్ అలరించగా పవర్ ప్లేలోనే 80 పరుగులు దాటిన ముంబై స్కోర్ బోర్డు ఆ తర్వాతా పరుగులు పెట్టింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఓవర్లో దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపిన రోహిత్ బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. కాసేపటికే 24 బంతుల్లో రికెల్టన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా కొండంత లక్ష్యం కాస్త మంచు ముక్కలా కరిగిపోయింది. అనుకుల్ రాయ్ డైవింగ్ క్యాచ్‌తో రోహిత్ ఔటైనా ఇంప్యాక్ట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్(16) ఉన్నంత సుపు ధనాధన్ ఆడాడు. ఫిఫ్టీతో చెలరేగిన రికెల్టన్ మెరుపు త్రోకు రనటవ్వగా.. అప్పటికే ముంబై గెలుపువాకిట నిలిచింది. 37 పరుగులు అవసరమైన వేళ తిలక్ వర్మ(20)తో కలిసి కెప్టెన్ హార్దిక్ పాండ్యా() లాంఛనం పూర్తి చేశారు. వికెట్ల తేడాతో గెలుపొందిన ముంబై రెండు పాయింట్లు దక్కించుకుంది.



### రహానే, రఘువంశీ దూకుడు

మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ స్కోర్‌తో ముంబై ఇండియన్స్‌కు సవాల్ విసిరింది. ముంబై కంచుకోట వాంఖడేలో ఓపెనర్లు అజింక్యా రహానే(67), ఫిన్ అలెన్(37)లు శుభారంభంతో కోల్‌కతా ఇన్నింగ్స్‌కు ఊపపునిచ్చారు. డేంజరస్ ఓపెనర్ అలెన్ ఔటైనా.. అర్ధ శతకంతో రెచ్చిపోయిన రహానేకు అంగ్‌క్రిష్ రఘువంశీ(51) మెరుపులు తోడవ్వగా ముంబై బౌలర్లు డీలా పడ్డారు. డెత్ ఓవర్లలో వైస్ కెప్టెన్ రింకూ సింగ్(33 నాటౌట్) తన స్టయిల్ విధ్వంసంతో కోల్‌కతా నాలుగు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

# కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. అనుష్క ఫ్లయింగ్ కిస్..



ఐపిఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే అటు బ్యాటింగ్‌తోనూ, ఇటు తన రొమాంటిక్ స్టైల్‌తోనూ కింగ్ కోహ్లీ మరోసారి అందరి మనసులను దోచుకున్నాడు. శనివారం జరిగిన హోరాహోరీ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు, కెప్టెన్ ఇషాన్ కిషన్ 80 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉండటంతో ఆర్‌సిబి చాలా సులువుగా ఊదేసింది. కేవలం 15.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఆర్‌సిబి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగి కేవలం 38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, అతనికి తోడుగా దేవదత్ పడిక్కల్ కూడా 61 పరుగులతో అద్భుతంగా రాణించాడు. మ్యాచ్‌లో ఆర్‌సిబి విజయం ఖరారు కాగానే స్టేడియంలో అందరినీ ఆకట్టుకునేలా ఒక క్యూట్ 'విరుష్క' మూమెంట్ చోటుచేసుకుంది. గెలుపు ఆనందంలో విరాట్ కోహ్లీ తన హెల్మెట్ తీసి, స్టాండ్స్‌లో తన కోసం ఉత్సాహంగా చీర్ చేస్తున్న భార్య అనుష్క శర్మ వైపు చూస్తూ ముద్దుగా 'ఫ్లయింగ్ కిస్' ఇచ్చాడు. దానికి స్పందనగా అనుష్క కూడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా అంతే ప్రేమగా కోహ్లీకి రిటర్న్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చింది. ఈ దృశ్యాన్ని అక్కడే మ్యాచ్ చూస్తున్న ఆర్‌సిబి మహిళల జట్టు క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ నవ్వుతూ ఆశ్చర్యంగా చూశారు. ఈ అందమైన క్షణంతో చిన్నస్వామి స్టేడియం ఒక్కసారిగా అభిమానుల అరుపులతో హోరెత్తిపోయింది.


## వారిపై రెండేళ్ల నిషేధం సరిపోదు..

విదేశీ ఆటగాళ్లు ప్లేట్ ఫిరాయించడం పరిపాటి అయింది. నిరుడు హ్యారీ బ్రూక్, ఇప్పుడేమే బెన్ డకెట్.. ఇద్దరూ ఇంగ్లండ్ ఆటగాళ్లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆఖరి నిమిషంలో హ్యాండిచ్చారు. జట్టు కూర్పు దాదాపు ఖరారైన సమయంలో క్రికెటర్లు 'మేము వైదొలుగుతున్నాం' అని చెప్పడాన్ని ఇక ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అంటున్నాడు. ఐపిఎల్ సీజన్ ప్రారంభానికి ముందు ఏదో కారణంతో వైదొలిగే ఆటగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని గవాస్కర్ అభిప్రాయ పడుతున్నాడు. ప్రస్తుతం అమలులో ఉన్న శిక్ష వ్యవస్థను సమీక్షించాలని బిసిసిఐకి అతడు సూచించాడు. ఐపిఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాళ్లు ఆఖరి నిమిషంలో వైదొలిగితే వారిపై రెండేళ్ల నిషేధం విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని గవాస్కర్ డిమాండ్ చేశాడు. మరొకరు ఇలాంటి పొరపాటు చేయకుండా చూసేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంద న్నాడు.'యాషెస్ సిరీస్‌లో బెన్ డకెట్ బాగా ఆడాడు. ది హండ్రెడ్ వేలంలో అతడికి ఆశించినంత ధర దక్కలేదంటే పరిస్థితి వేరేలా ఉండేది. కానీ, అతడికి మంచి ధర వచ్చింది. అప్పుడు అతడు దేశం తరపున ఆడడంపై దృష్టి సారించాలని ఫ్రాంచైజీకి చెప్పి ఉండాల్సింది. కానీ, మనోడు అలా చేయలేదు. ఇప్పుడు ఐపిఎల్ ఆడేందుకు దేశం కోసం ఆడాలని ఉందనే సాకు చూపించాడు.

# ఆరోగ్యం


## శుక్లాలకు చుక్కల మందు!

కంటి శుక్లాల (కాటరాక్ట్) చికిత్సలో కొత్త ఆశగా 'విపి1001' నిలుస్తోంది. ప్రస్తుతం కాటరాక్ట్‌కు ప్రధాన చికిత్స శస్త్రచికిత్స మాత్రమే అయినప్పటికీ, ఈ కొత్త కంటి చుక్కల చికిత్స భవిష్యత్తులో వైద్యరంగంలో పెద్ద మార్పుకు దారి తీసే అవకాశముంది. కాటరాక్ట్ అంటే కంటి లెన్స్‌లోని ప్రోటీన్లు గడ్డకట్టడం వల్ల లెన్స్ పారదర్శకత తగ్గిపోవడం. దీని కారణంగా కాంతి సరిగా ప్రసారం కాక చూపు మసకబారుతుంది. సాధారణంగా వయస్సు పెరగడం, ఆక్సిడేటివ్ దెబ్బలు, జీవక్రియ మార్పులు వంటి కారణాలతో లెన్స్‌లోని ప్రోటీన్లు కలిసిపోతాయి. ఇప్పటి వరకు దీనికి సమర్థవంతమైన పరిష్కారం మబ్బుగా మారిన లెన్స్‌ను తొలగించి కృత్రిమ లెన్స్ అమ ర్చే శస్త్రచికిత్స మాత్రమే. ఈ పరిస్థితిని మార్చే ప్రయత్నంగా 'వ్యూపాయింట్ థెరప్యుటిక్స్' అనే సంస్థ విపి 1001 అనే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఇది ఆక్సిస్టెరాల్ వర్గానికి చెందిన రసాయన సంయోగం. ఈ ఔషధం కంటి లెన్స్‌లో కీలకమైన 'అల్ఫాక్రిస్టిలిన్' అనే ప్రోటీన్‌పై పని చేస్తుంది. లెన్స్‌లో గడ్డకట్టిన ప్రోటీన్లను మళ్లీ కరిగించి వాటిని సహజ స్థితికి తీసుకువచ్చేలా ఇది సహాయపడుతుంది. దీని ఫలితంగా లెన్స్ పారదర్శకత తిరిగి మెరుగుపడే అవకాశం ఉంటుంది. ఈ ఔషధం మూలంగా ఉపయోగించిన సహజ పదార్థం 'లనోస్టెరాల్'. ఇది లెన్స్‌లోని ప్రోటీన్ గడ్డలను తగ్గించగల సామర్థ్యం ఉందని గత పరిశోధనల్లో సూచించారు. ప్రాణులపై జరిగిన ప్రయోగాల్లో ఈ చికిత్స ఆశాజనక ఫలితాలు చూపింది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో రోజుకు మూడు సార్లు రెండు వారాల పాటు ఈ కంటి చుక్కలు ఉపయోగించినపుడు లెన్స్ మసక తగ్గి పారదర్శకత మెరుగుపడింది. కొన్ని అధ్యయనాల్లో సుమారు 61 శాతం లెన్స్‌లలో కాంతి ప్రతిఫలన మెరుగుపడగా, దాదాపు 46 శాతం లెన్స్‌లలో మబ్బు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఔషధాన్ని మానవులపై ఉపయోగించే దిశగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రారంభ దశ పరీక్షల్లో కంటి కార్నియాపై విప్రభావం కనిపించలేదని పరిశోధకులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇది పూర్తి గా విజయవంతమైతే, శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా కేవలం కంటి చుక్కలతోనే కాటరాక్ట్‌ను నియంత్రించే అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా శస్త్రచికిత్స సదుపాయా లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ఈ చికిత్స లక్షలాది మందికి దృష్టిని తిరిగి పొందే అవకాశం కల్పించవచ్చు. రోజుకు కొన్ని చుక్కలతోనే చూపు ను మెరుగుపరచగల చికిత్సగా ఇది నిలిస్తే, కంటి సంరక్షణ వైద్యరంగంలో ఇది ఒక ముఖ్యమైన మార్పుగా చరిత్ర సృష్టిస్తుంది.




## అవగాహనతోనే ఉపశమనం !

చిత్త వైకల్యం, అల్జీమర్స్ లేదా డెమెన్షియా అనబడేది బహు వ్యాధి లక్షణం. డెమెన్షియాలో దాదాపు 70 శాతం వరకు అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులే ఉన్నారు. మనకు తెలియకుండానే శరీరంలోని మెదడు కణజాలం క్షీణించడం, వయస్సుతో పాటు క్రమంగా నెమ్మదిగా పెరగడంతో ప్రమాదకర పరిస్థితులు వస్తాయి. ప్రపంచవ్యాప్తంగా 55 మిలియన్లకు పైగా ప్రజలు ఏదో ఒక రకమైన చిత్త వైకల్యంతో బాధ పడడం, సాలీనా 10 మిలియన్ల కొత్త కేసులు కూడా బయటపడుతున్నారు. చైనా, అమెరికా తర్వాత అత్యధికంగా 4 మిలియన్ల అల్జీమర్స్ కేసులతో భారత్ మూడవ స్థానంలో ఉన్నది. ఇలాగే కొనసాగితే 2050 నాటికి 150 మిలియన్ల డెమెన్షియా వ్యాధిగ్రస్తులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. 65ఏళ్లు దాటిన వారిలో ప్రతి ఐదేళ్లకు రెట్టింపు ప్రభావాన్ని చూపుతున్నది. వయస్సుతో పాటు మెదడు కణజాలం క్షీణించడం, చిత్త వైకల్య వ్యాధి పెరగడంతో ఈప్రమాదకర వ్యాధి పట్ల ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం అనివార్యం అవుతున్నది. అల్జీమర్స్ రుగ్మత కుటుంబ సమస్యలను, అశాంతిని రెట్టింపు చేస్తుంది, పేదరికాన్ని పెంచి పోషిస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, పోషకాహారం అందించడం, సాచురేటెడ్ నూనెలు అందించడం, ఆదరణ చూపడం, వారి పనులు వారు చేసుకునే విధంగా చూడడం, నిపుణులు సూచించిన వ్యాయామాలు చేయడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, బిపీ,షుగర్‌లను నియంత్రించడం, అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగతాగడాన్ని మానేయడం లాంటి జాగ్రత్తలతో ప్రభావం తగ్గుతుంది.



## ప్రాణాంతక వ్యాధి మెనింగోకోకల్ ఇన్‌ఫెక్షన్

మెనింగోకోకల్ ఇన్‌ఫెక్షన్ భయాందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవల మేఘాలయ ప్రభుత్వం ప్రజలకు ప్రత్యేక ఆరోగ్య సూచనలు జారీ చేసింది. గుంపులుగా కూడే ప్రదేశాలను తాత్కాలికంగా నివారించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలిలని పేర్కొంది. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సంఘటన మెనింగోకోకల్ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన అవసరాన్ని మళ్లీ గుర్తు చేసింది. ఎందుకంటే ఇది వేగంగా వ్యాపించి, ప్రాణాంతకంగా మారే ప్రమాదకర అంటువ్యాధి. మెనింగోకోకల్ సంక్రమణ అనేది 'నీసెరియా మెనిగిటిడిస్' అనే బ్యాక్టీరియా వల్ల కలిగే తీవ్రమైన వ్యాధి. ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన తర్వాత చాలా వేగంగా పెరిగి మెదడు మరియు వెన్నుపాము చుట్టూ ఉన్న పొరలను ప్రభావితం చేస్తుంది. ఈ పొరలను 'మెనింజిస్' అంటారు. అవి ఇన్‌ఫెక్షన్‌కు గురైనప్పుడు 'మెనింజైటిస్' అనే ప్రమాదకర స్థితి ఏర్పడుతుంది. కొన్నిసార్లు బ్యాక్టీరియా రక్తంలోకి ప్రవేశించి 'మెనింగోకోసీమియా' అనే రక్తవిషబాధను కలిగిస్తుంది. ఈ వ్యాధి వ్యాప్తి ప్రధానంగా శ్వాస సంబంధిత స్రావాల ద్వారా జరుగుతుంది. దగ్గు, తుమ్ము సమయంలో విడుదలయ్యే లాలాజలం లేదా నోటి స్రావాలను పంచుకోవడం వల్ల బ్యాక్టీరియా ఒక వ్యక్తి నుంచి మరొకరికి చేరుతుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చేయడానికి. లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా త్వరగా వైద్య సహాయం పొందడం, పరిశుభ్రత పాటించడం, ఆరోగ్య సూచనలను అనుసరించడం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. వేగవంతమైన వైద్యసేవలే నియంత్రించడానికి ప్రభావవంతమైన మార్గాలు.



# అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు పేదలకు పంచుతాం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకు పంచుతామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బాషబోయిన సంతోష్ అధ్యక్షతన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా చట్టవిరుద్ధంగా రెవెన్యూ అధికారుల అండదండలతో పేదల అసైన్డ్ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని, వాటిని అధికారులు రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహించి పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాంటి పేదల కాలనీలలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుని ప్రజల మద్దతు పొందిందని, ఈ క్రమంలో ఏప్రిల్ 1 వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతి పరులు, ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మండ సదాల, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.ఎ.స్టాలిన్, కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, యేషబోయిన శ్రీనివాస్, నకీర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టు పనులు పూర్తిచేసి..

# రైతులకు నీరు ఇవ్వాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి డిమాండ్

**ప్రజాపక్షం/నాంపల్లి :** డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఆలస్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పనులను వేగవంతంగా పూర్తి చేసి నీరివ్వాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. డిండి ప్రాజెక్టును పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి డిండి ప్రాజెక్టుకు నీరు తరలించే కెనాల్ స్థాయిల్లో తేడాలు ఉన్నాయని, 440 స్థాయికి బదులుగా 436.7 వద్ద కెనాల్ ఉండటం వల్ల సుమారు 11 అడుగుల వ్యత్యాసం ఏర్పడుతుందన్నారు. దీని వల్ల డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. కాబట్టి ఎలాంటి స్థాయి వ్యత్యాసం లేకుండా సమాంతరంగా పనులు పూర్తి చేసి రైతులకు నిరంతర సాగునీరు అందించాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, కార్యవర్గ సభ్యులు కోరె సత్తయ్య, ఊరిపాక వెంకటయ్య, దండిగా వెంకటయ్య, నాయకులు గిరిస్వామి, బుషిపాక యాదయ్య, ఉపసర్పంచ్ అగ్గిరాజు, దామెర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



### సిపిఐలో చేరికలు

మండల పరిధిలోని రాందాస్ తండా గ్రామపంచాయతీకి చెందిన రాయి కుంట తండాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మెగావత్ బీముడు, గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు వడ్త్యా బాలాజీ, మెగావత్ సందీప్, మెగావత్ పవణ్, మెగావత్ బీమా, కొర్ర మున్నాతో పాటు పలువురు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ చేరికలతో మండలంలో సిపిఐ మరింత బలపడుతుందని నెల్లికంటి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి




### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** గిట్టుబాటు ధర లేక మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరిచి మార్క్‌ఫెడ్ ద్వారా మద్ధతు ధర రూ.2,400 చొప్పున కొనుగోలు చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి సమావేశం ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జాగర్లముడి రంజిత్ అధ్యక్షతన రెండవ రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ గతేడాది మొక్కజొన్న లాభసాటిగా ఉండడంతో ఖమ్మం జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని ఆయన తెలిపారు. యాసంగి కోతలు కూడా ప్రారంభమయ్యాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎటువంటి కొర్రీలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని సురేష్ కోరారు. అనేక పంటలు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో వివిధ దశలలో ఉన్నందున ఏప్రిల్ 30 వరకు నీటిని విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంతో ముందుకు వెళ్తామని పార్టీజిల్లా కార్యదర్శి ఎస్ఎండిఫయాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుండి 10 వరకు జరిగే ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ఇంటింటికి సిపిఐలో భాగంగా పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 1 వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతి పరులు, ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్‌జి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, మారేడు శివశంకర్, బండి లక్ష్మీపతి, పట్టణ నాయకులు గోపి చారి, కొత్త రామస్వామి, శేఖర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యా వ్యవస్థను బలహీనపరిచే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి




### ఎస్‌టియు అధ్యక్షుడు సదానందంగౌడ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యా వ్యవస్థను బలహీనపరిచే ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌టియు టిఎస్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ నివేదికలోని పలు అంశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హెడ్మాస్టర్ల పదోన్నతుల్లో 50 శాతం ప్రమోషన్లు, 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానం, అనంతరం ఐదేళ్లకు పూర్తిగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్న ప్రతిపాదనలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తాయని విమర్శించారు. జీఓఎంఎస్ 25 ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు నిబంధనను సవరించాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, 30మంది విద్యార్థులకు ముగ్గురు, 50 మందికి ఐదుగురు ఉపాధ్యాయులు నియమించాల్సిందిగా సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని, పర్యవేక్షణ కోసం రెగ్యులర్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తందు భానుప్రకాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందిమళ్ల నరేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు కె.దత్తేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉదయరాణి, బాణావత్ సైదా నాయక్, మునుగోడు మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, తిప్పర్తి మండల అధ్యక్షుడు కె.పర్వతాలు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
30-03-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

# గ్యాస్ వాలా..దివాలా

బతుకు బండి నడిచేది కొద్ది గంటలే
గంటల తరబడి క్యూలోనే
సగానికి తగ్గిన సంపాదన - పూట గడవక ఆవేదన
దయనీయంగా ఇఎంఐ చెల్లించేవారి పరిస్థితి



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** గ్యాస్‌తో నడిచే ఆటోవాలాల పరిస్థితి గత కొన్ని రోజులుగా దివాలా తీసింది. డీజిల్, పెట్రోల్ లభ్యత సాధారణ స్థితికి చేరుకున్నప్పటికి ఎల్‌పిజి, సిఎన్‌జిలతో నడిచే ఆటోలు, ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి క్యాబ్‌లు నడుపుకుంటూ ఉపాధి పొందుతున్న వారి పరిస్థితి మాత్రం మారలేదు. గ్యాస్ కొరత కొనసాగుతుండడంతో వారి పరిస్థితి కడు దయనీయంగా మారింది. గ్యాస్ నింపుకోవడం కోసం గంటల తరబడి స్టేషన్ల వద్ద వారు పడిగాపులు పడుతున్నారు. ఒక్కో సారి ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా వేచి ఉన్నా గ్యాస్ నింపించుకోలేకపోతున్నారు. దీంతో ఒక్క రోజు నడిపి సంపాదించే సొమ్ముకోసం రెండు రోజులు సమయం పడుతోంది. ఒక్కో రోజు కొన్ని గంటల్లో గ్యాస్ నింపించుకున్నప్పటికి రోజులో సగం సమయం మాత్రమే ఆటోలు, క్యాబ్‌లు నడిపించుకోవాల్సిన పరిస్థితి. అంటే రోజుకు వీరి బతుకు బండి కొద్ది గంటలే నడుస్తోంది. మిగతా సమయం అంతా గ్యాస్ కోసం బంకుల వద్ద పడిగాపులు పడాల్సివస్తోంది. దీంతో మూడు పూటల ఆహారం దొరకక తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటాలించాల్సి వస్తోందని గ్యాస్ వాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణంపై తీసుకున్న ఆటో, క్యాబ్‌కు ఇంకా ఇఎంఐలు చెల్లిస్తున్న వారి పరిస్థితి కడుదయనీయంగా మారింది. మరో మూడు నాలుగు రోజుల్లో ఇఎంఐ చెల్లించే తేది రానుంది. ప్రస్తుతం సగానికి పైగా తగ్గిన సంపాదనతో ఇంటి అవసరాలు మాత్రమే పూర్తిగా తీరడం లేదు. ఇక ఇఎంఐ చెల్లించడం ఎలా అనే ఆందోళన వారిలో మొదలై కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

### బ్లాక్‌లో ఎల్‌పిజి అయినా మారని పరిస్థితి

ఎల్‌పిజి పై నడిచే ఆటోలు,క్యాబ్‌ల వారికి బ్లాక్‌లో ఈ గ్యాస్ దొరుకుతోంది. అయితే అసలు ధర కంటే రెండు నుంచి మూడు రెట్లు ధర అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అయినా సరే బ్లాక్‌లో కొని నడిపించుకుందామన్న ఆ పరిస్థితి గత వారం రోజులుగా లేకుండా పోయింది. కారణం పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితి గతంలో మాదిరిగానే యథా స్థితి చేరుకోవడంతో వాటి ద్వారా నడిచే ఆటోలు, క్యాబ్‌లు ఎప్పటి వలే పాత ధరలతోనే నడిపిస్తున్నారు. ఎల్‌పిజిని రెండుమూడు రెట్ల అధిక రేటుకు కొని ప్రయాణీకులను చేరవేయాలంటే పాత రేట్లకు నడిపే పరిస్తితి వీరికి లేకుండా పోయింది. దీంతో వారి బతుకు బండి పరిస్థితిలో మార్పులేదు. హైదరాబాద్ జిల్లాలో సిఎన్‌జి స్టేషన్లు దాదాపు 50 వరకు ఉన్నాయి. ఒక్కో సిఎన్‌జి వాహనానికి రోజుకు నాలుగు కిలోలు గ్యాస్ అవసరం అవుతుంది. క్యూలో ఛాన్స్ వచ్చినప్పుడు ఒకే సారి నింపించుకునే అవకాశం కూడా వారికి లేదు. అంటే ఏరోజుకారోజు క్యూలో ఉండి నింపించుకోవాల్సి రావడంతో రోజులో కనీసం అయిదు నుంచి ఆరు గంటలు స్టేషన్ల వద్దే పడిగాపులు పడాల్సి వస్తోంది. అంటే పూర్తి స్థాయిలో సంపాదించుకునే అవకాశం వారికి లేకుండా పోయింది.

జిల్లాలో సిఎన్‌జితో నడిచే ఆటోలు, క్యాబ్‌లు కలిపి మొత్తం లక్షన్నరకు పైగా ఉన్నాయి. వీటికి రోజుకు దాదాపు రెండున్నర లక్షల కిలోల సిఎన్‌జి అవసరం. దీనిలో సుమారు లక్షన్నర కిలోల గ్యాస్ మాత్రమే సరఫరా అవుతోంది. ఆటోలు, క్యాబ్‌ల గిరాకీ ఎక్కువగా ఉండే పంజాగుట్ట, అమీర్‌పేట, కూకట్ పల్లి,ఉప్పల్, మియాపూర్, లక్డీకాపూల్ వంటి ప్రాంతాలలో ఉన్న సిఎన్‌జి స్టేషన్లలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడ గ్యాస్ నింపించుకోవడానికి ఒక్కో సారి ఒక రోజు పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

---

## సైబర్ నేరాల బాధితులకు
# రూ.24.91 కోట్ల రీఫండ్

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తెలంగాణ పోలీసులు భారీ ఊరటనిచ్చారు. 2026 సంవత్సరపు జాతీయ అదాలత్ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న బాధితులకు వారి సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఘన విజయం సాధించారు. ఈ మెగా లోక్ అదాలత్ ద్వారా మొత్తం 4,627 మంది బాధితులకు రూ. 24.91 కోట్ల నగదును రీఫండ్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, వివిధ బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుని, అన్ని కమిషనరేట్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లతో కలిసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు సైబర్ జాగ్రత్తలు పాటించాలని శిఖా గోయల్ విజ్ఞప్తి చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటిపిలు, పిన్ నంబర్లు, బ్యాంకింగ్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే కస్టమర్ కేర్ నంబర్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఒకవేళ మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. నేరం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్) స్పందిస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, తెలంగాణను సైబర్ సురక్షిత రాష్ట్రంగా మార్చేందుకు తమ బ్యూరో నిరంతరం శ్రమిస్తుందని శిఖాగోయల్ పునరుద్ఘాటించారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం
# వేసవి ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. చెన్నై సెంట్రల్ సంత్రాగచి మధ్య 06077/06078 నంబర్లతో 10 సర్వీసులు, అలాగే తిరువానంతపురం నార్త్ సంత్రాగచి మధ్య 06081/06082 నంబర్లతో 10 సర్వీసులు ఏప్రిల్ నుంచి జూన్ వరకు నడపనున్నారు. ఈ రైళ్లు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, భువనేశ్వర్, ఖరగ్పూర్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## విజయవంతంగా టిఎస్‌టి పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాఫిక్‌సూపర్వైజర్ ట్రెయినీ (టిఎస్‌టి), మెకానికల్ సూపర్వైజర్ ట్రెయినీ (ఎంఎస్‌టి) రాత పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించగా టిఎస్‌టికు 78.48 శాతం, ఎంఎస్‌టికు 82.13శాతం మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు, ప్రిలిమినరీ కీ త్వరలో విడుదల చేస్తామని, అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు సమర్పించవచ్చని బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు వెల్లడించారు.

---

# హనీ బ్యాడ్జర్ దత్తత తీసుకున్న మెడికో

**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** అదరుదైన వివిధ రకాల జంతువులు, పక్షులు, కీటకాలు, సరీసృపాలు, మొసళ్లు... ఎన్నో జీవజాతులకు జూపార్క్ నిలయంగా మారింది. ఇక జంతువులు, వన్యప్రాణుల సంరక్షణ.. వాటి సంక్షేమం కోసం జూపార్క్ నిర్వాహకులు ప్రజలను కూడా భాగస్వాములను చేస్తున్నారు. ఇందులో భాగంగానే జంతువులను దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వందల సంఖ్యలో జంవుతులను దత్తత ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలోనే గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జె.రెహాన్ ప్రకాష్ తన 20వ పుట్టినరోజు సందర్భంగా హనీ బ్యాడ్జర్‌ను ఆరు నెలల పాటు దత్తత తీసుకున్నాడు. రెహాన్ ప్రకాష్ తన తల్లిదండ్రులు మురళీధర్, జ్యోతి, స్నేహితులతో కలిసి జంతు ప్రదర్శనశాలను సందర్శించి ఒక హనీ బ్యాడ్జర్‌ను ఆరు నెలల పాటు పోషించే ఖర్చుల కోసం రూ.50 వేల చెక్కును అధికారులకు అందించారు. ఈ సందర్భంగా రెహాన్ ప్రకాష్ మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ, సంక్షేమంలో పాలుపంచుకునేందుకు సహకరించిన తన తండ్రి (ఒక అటవీ అధికారి) నుంచి ప్రేరణ, స్ఫూర్తి పొందానని తెలిపారు. సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలలో వన్యప్రాణులను, వాటి సంక్షేమాన్ని చూసుకోవడం చాలా పెద్ద సవాలుతో కూడిన పని అన్నారు. అభ్యర్థనను అంగీకరించి, తేనె పంది పోషణ, నిర్వహణ కోసం నిధుల రూపంలో ఒక మొత్తాన్ని అందించి, దాని సంరక్షణకు అవకాశం కల్పించినందుకు ఆయన జూపార్క్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ హైదరాబాద్ జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్ మాట్లాడుతూ, ఆరు నెలల కాలానికి తేనె పందిని దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన రెహాన్ ప్రకాష్, అతని స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. ఒక తేనె పందిని దత్తత తీసుకోవడం ఇదే మొదటిసారి అని.. తేనె పందిని రాటెల్ అని కూడా పిలుస్తారని వివరించారు.




**జూపార్క్ కిటకిట...** జూపార్క్‌లో ఎప్పటికప్పుడు కొత్త జంతువులను తీసుకొస్తుండటంతో సందర్శకులతో కిటకిటలాడుతోంది. ముఖ్యంగా వారాంతపు సెలవులు, హాలీడేస్‌లో సందర్శకుల సంఖ్య భారీగా ఉంటుంది. ఇక ఇక్కడి జంతువుల్ని ఇతర రాష్ట్రాలకు.. అలాగే అక్కడి అరుదైన జంతువుల్ని మన రాష్ట్రానికి తరలిస్తూ.. ఎక్స్ఛేంజ్ విధానంలో అరుదైన జంతుజాతులు జూపార్క్‌కు వస్తున్నాయి. తాజాగా రెండు మగ మాండ్రిల్స్(కోతి జాతి జంతువులు) వచ్చి చేరాయి. ఈ అరుదైన కోతుల వయసు ప్రస్తుతం 23 నెలలు ఉంది. వీటిని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వినయ్ కుమార్, సంరక్షకురాలు వసంత కలిసి సందర్శకుల కోసం ఎన్ క్లోజర్ లోకి విడుదల చేశారు. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా వీటిని జంషెడ్పూర్ జూ నుంచి తీసుకొచ్చారు. ఇక వీటికి బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఒక జత ఆఫ్రికన్ సింహాలను అక్కడికి పంపించారు. ఈ మాండ్రిల్స్ కోతులు గత నెలలోనే జూకు చేరుకున్నాయి. అయితే రూల్స్ ప్రకారం ఈ జంతువులను 45 రోజులపాటు క్వారెంటైన్‌లో ఉంచారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాక ఈ వానరాలను ప్రజల సందర్శన కోసం అనుమతించారు. జూపార్క్‌లోని ఒక్కోవిభాగం వద్ద సెక్యూరిటీ గార్డులను మోహరించి పర్యటకులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నారు.

## జాతర ఉత్సవాలు
## సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక

ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** జాతర ఉత్సవాలు మన సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీక అని శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ గ్రామ శివారులో నెలకొన్న శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర ఉత్సవాలను మరువకూడదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో జాతర ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు ఐక్యతతో ఉండి జాతర ఉత్సవాలను శాంతియుతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కాగా బుల్కాపురం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మాన్న గారి వెంకటరెడ్డి. కౌన్సిలర్లు భానూరి కృష్ణ, మణికొండ లలిత మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ జూలకంటి లక్ష్మమ్మ రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



---

## అంబేద్కర్, జగ్జీవన్‌రామ్
## అశయసాధనకు కృషిచేయాలి

మంద కృష్ణ మాదిగ..



**ప్రజాపక్షం/యాచారం :** అంబేద్కర్, జగీవన్‌రామ్ అశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. అదివారం యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో నూతనంగా ఎర్పాటు చేసిన డాక్టర్ బిఅర్ అంబేద్కరు, జగ్జివన్‌రామ్ విగ్రహలను జాతియ దళిత సంఘాల నాయకులు జెబి రాజుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అంబేద్కరు రాసిన రాజ్యాంగ ఫలాలతో నేడు అనేక పదవుల్లో ఉన్నామనే విషయాన్ని ఎప్పుడు మర్చి పోవద్దని తెలిపారు. మహనీయులను అదర్శంగా తీసుకోని ముందుకు సాగాలన్నారు. జగ్జావన్ రామ్ దేశం కోసం ఎంతగానో పోరాటం నిర్వహించారని గుర్తు చేశారు. గ్రామాల్లో అమహనీయుల విగ్రహలు ఎర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. అనంతరం మాల్ గ్రామంలో చనిపోయిన మంద లింగం కుటుంభాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో నాయకులు బిలకంటి శేఖర్‌రెడ్డి, జుట్టు శ్రీశైలం,నవిన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాజు. వేంకట నర్సింహ్మారెడ్డి, నడికుడి కృష్ణ,సర్పంచ్‌లు అనిత శరణం, తోట్ల రమేశ్, క్రిష్ణ, అశోక్ యాదవ్, బండిమిది కృష్ణ, కాళ్ళ జంగయ్య, సిద్దాపురం శ్రీకాంత్, రాములు, విష్టు, అంబేద్కరు యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను
## సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహింపట్నం నియోజకవర్గం జిహెచ్‌ఎంసి ఆదిబట్ల సర్కిల్ లోని పరిధిలోని ఆదిబాట్ల డివిజన్‌లో మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్యామ్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌ను మర్రి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. క్యాంప్‌లో ప్రముఖ జనరల్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్యామ్ తమ వైద్యబృందంతో పాల్గొన్నారు. డాక్టర్ రంగరాజ్ , డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాఘవేంద్ర వంటి ఆర్థోపెడిక్స్, కార్డియాలజీలో నిష్ణాతులైన వైద్యులు సేవలు అందించారు. ఈసీజీ, 2డి ఎకో టెక్నీషియన్లు,వివిధ రకాల బ్లడ్ టెస్టులు నిర్వహించిన వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు. ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌లో సుమారు 240 మంది ఆదిబట్ల గ్రామస్తులు వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని,డాక్టర్ల సూచనల మేరకు వారికి శ్యామ్ హాస్పిటల్ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూపతిగల్ల మహిపాల్, కోరె కలమ్మ, కౌన్సిలర్‌లు లావణ్య పాండురంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జమ్మ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమమే
## ప్రభుత్వ విధానం : మధుయాష్కీ



**ప్రజాపక్షం/హయత్‌నగర్;** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం అని మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ అన్నారు. ఆదివారం హయత్‌నగర్‌లో లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపిమధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు తమ ఆర్థిక ఇబ్బందుల రిత్యా మధుయాష్కీని సంప్రదించగా.. స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. 23 మందికి మొత్తం రూ. 17,20,000 ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు సిఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, చెన్నగోని రవీందర్ గౌడ్, బుడ్డ సత్యానారాయణ, కుట్ల నర్సింహ యాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, గణేష్ నాయక్, దేవాలయ కమిటీల డైరెక్టర్లు కంచర్ల కవిత, భవాని శంకర్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, షరీఫ్, పార్వతి గణేష్ రెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, కోటగిరి శ్రీనివాస్, గుర్రం చంద్రశేఖర్, వినయ్ పటేల్, కొండోజు శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

---

## పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రవీంద్ర చారి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో మనసురాబాద్ డివిజన్ సిపిఐ ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ సమావేశం ఎస్ఏ డాంగే భవన్‌లో జరిగింది. గంగాధర్ శీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రవీంద్ర చారి, రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు కందుల సుధాకర్ హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతోనే పార్టీ బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు గంగాధర్, శీను, జి శోభ, లింగస్వామి, గద్దపాటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు మాజీ ఎమ్మెల్యే
## కొండిగారి రాములు సంతాప సభ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఈ నెల 31న జరిగే మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాపసభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కొండిగారి రాములు సంతాపసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా, శ్రీహరి, మల్లేష్, రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుర్మిద్ధ గ్రామంలో
## దొడ్ల పాల డెయిరీ చిల్లింగ్ ప్లాంటు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని కుర్మిద్ధ గ్రామంలో దొడ్ల పాలడెయిరీ చిల్లింగ్ ప్లాంటు ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్యరాములు తెలిపారు. అదివారం గ్రామంలో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈసంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు, గ్రామస్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన వార్డుమెంబర్ నీలం విజయమ్మ వీరాంజనేయులు ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రీజినల్ మేనేజర్ అంజిరెడ్డి, హెడ్ హెచ్ అర్ మధుసూధన్‌రెడ్డి, అసిస్టేంట్ మేనేజర్ బ్రహ్మనందరెడ్డి, గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ అనమోని రవింధర్, వార్డు సభ్యులు జంగిలి రమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

## అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి : ఎంఇఒ




**ప్రజాపక్షం/యాచారం :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్ష్యరాస్యులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని యాచారం మండల విధ్యాధికారి పాండురంగారెడ్డి అన్నారు. అదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అమ్మకు అక్షర పరీక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో తిరిగి పరిశీలించారు. ఐకెపి ద్వారా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉల్లాస్ పరీక్షలు ఉత్సాహంగా సాగాయి. చదువు మానేసిన వారికి అక్షర వెలుగులు నింపడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రవింధర్, సర్పంచ్‌లు కిషన్‌నాయక్, రాజు, సిసిలు గణేశ్, జయ, లలిత, విఓఎలు సురేశ్, చంద్రకళ, శోభ, రమాదేవి, స్వప్న, సాబెరా, శేఖర్. తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఉచిత వైద్యశిబిరం




**ప్రజాపక్షం/యాచారం :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలు ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకొవాలని సహదేవ్ హోమియో అసుపత్రి వైద్యురాలు పోద్దుటూరి రాధిక ప్రసన్నకుమార్ అన్నారు. అదివారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పిఅర్‌జి ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఎర్పాటు చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉప సర్పంచ్ దెంది మదుకర్‌రెడ్డి, పిఅర్‌జి పౌండేషన్ అధ్యక్షులు రవీందర్‌గుప్త, అర్యవైశ్య సంఘ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త, పిఅర్‌జి ఫౌండేషన్ సభ్యులు సురేంధర్ గుప్త, అడాల గణేశ్,బెత జంగయ్య, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.



ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయిన వై.నరేందర్‌రెడ్డిని టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాల్ రాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, శివకుమార్, నాగేంద్రచారి తదితరులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు బల్విందర్ సింగ్ జమ్మూ, సోమసుందర్‌లకు, ఇసి సభ్యులుగా ఎన్నికైన సత్యనారాయణ, శేఖర్, అజిత, శ్రీనివాస్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

మాజీ చైర్‌పర్సన్ పావనిజంగయ్య యాదవ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పేదల సొంతింటి కలను నేరవేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్ అన్నారు.ఆదివారం జిహెచ్‌ఎంసి సర్కిల్ 6వ డివిజన్ అంబేద్కర్ నగర్,గుంటిగూడ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి పొందిన వారి ఇంటి భూమి పూజ కార్యక్రమానికి మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్‌లు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కదుపొల్ల మల్లేష్, యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, మైనార్టీ నాయకులు మమ్మద్ ఖయ్యూం, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి మేకల సునీల్, మద్దూరి యాదగిరి, కదుపొల్ల రాజు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాక్స్ వసూలుపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణ రెడ్డి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ టాక్స్ ఇన్స్‌పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లను మరింత మెరుగుపరచడం, గరిష్ట స్థాయిలో వసూళ్లు సాధించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించా రు. అలాగే, బకాయి పన్నులపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ వసూళ్లు చేపట్టాలని, అవసరమైతే కఠిన చర్యలు కూడా తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేసి, 2025–26 ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో వసూళ్లు సాధించాలని పేర్కొన్నారు.

## ఎఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలింకు గద్దర్ అవార్డు రావడంపై అభినందన సభ



**ప్రజాపక్షం/చర్లపల్లి :** మహా మనిషి డాక్టర్ ఎఎస్ రావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ ఎఎస్ రావు నగర్ హౌసింగ్ సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జ్ ఈశ్వరయ్య,దాశరధి థియేటర్ అధ్యక్షులు ఎస్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలింకు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా ఎఎస్ రావు నగర్‌లోని డాక్టర్ హోమిజే బాబా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అభినందన సభకు మారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ ఎఎస్ రావు ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు.ఆయన గొప్ప తనాన్ని ప్రపంచానికి చాటాలనే లక్ష్యంతో ఆయన నిజ జీవితాన్ని డాక్యుమెంటరీగా సినిమాను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఫిలింకు రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గద్దర్ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు నగరంలో ఇసిఐఎల్ కంపెనీని స్థాపించి వేల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించారన్నారు.యూనిట్ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు భూపతి వెంకటేశ్వర్లు,పిబిచారి,వికె ప్రేమ్,ఫిలిం డైరెక్టర్ రఘురామచంద్ర,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** తెలుగువారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడాన్ని సహించలేక నాడు తెలుగుదేశం పార్టీని ఎన్‌టి రామారావు స్థాపించారని టిడిపి ఫౌండర్ సభ్యులు, చర్లపల్లి కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్ అన్నారు.తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో రుద్రగోని రాంచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు.ఈ కార్యక్రమంలో కీసర ప్రేమ్‌గౌడ్,రాగీరు నాధం గౌడ్,క్యాత కృష్ణారావు, బింగి బిక్షపతిగౌడ్,సత్యంయాదవ్,సురేష్‌గుప్తా,ఉతిష్ఠ,గడ్డం కృష్ణ,ఆటో గిరి, బాలకృష్ణగౌడ్,పరమేశ్,జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### నాగారంలో...



దేశ రాజకీయాల్లో పచ్చ జెండా కొత్త ఒరవడికి నాంది పలికిందని మేడ్చల్ పార్లమెంట్ ఆడ్‌హక్ కమిటీ సభ్యులు కొండ జంగారెడ్డి అన్నారు. డిపి 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగారం డివిజన్ టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహనికి పూలమాల వేసి జెండా ఎగరవేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకర వెంకటేష్,కాంటెస్టెంట్ కౌన్సిలర్ కొండ సుజాత,ఎన్ కృష్ణారావు,ఉమాశంకర్ గౌడ్,ఎం యాదిరెడ్డి,రంగారావు,బ్రహ్మంచౌదరి,సదా,రాజేశ్,ఉతిష్ఠ,భాస్కర్ రావు,శ్రీనివాస్,బార్కీ,రాంబాబు,వాసు,ఆంజనేయులు,శ్రీను,వెంకటేష్ గౌడ్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివా స్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం శామీర్‌పేటలో నిర్వహించిన మున్నూరుకాపుల ఆ త్మీయ సమ్మేళనానికి మున్నూరుకాపు రాష్ట్ర సం ఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు విచ్చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు, కోశాధికారిగా రాజులు ఎన్నుకున్నారు.



# జాతీయ లోక్ అదాలత్‌లో.. రికార్డు స్థాయిలో 1,44,251 కేసుల పరిష్కారం

### సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజీ పడదగ్గ నేరారోపణలు, సివిల్ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నాడు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో 1,44,251 కేసులు పరిష్కారం కావడం విశేషమని ఆమె వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు తొలుత మార్చి 14న జరగాల్సిన ఈ అదాలత్, మార్చి 28వ తేదీకి రీషెడ్యూల్ జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన లోక్ అదాలత్ కంటే ఈసారి 37.14 శాతం అధికంగా కేసులు పరిష్కారమయ్యాయని, అంటే దాదాపు 39,069 కేసులు అదనంగా పరిష్కారం అయ్యాయని ఆమె వివరించారు. ఈసారి లోక్ అదాలత్‌లో కేవలం సాధారణ కేసులే కా కుండా, సైబర్ నేరాల బాధితులకు సైతం పెద్దపీట వేశామని చారు సిన్హా తెలిపారు. మొ త్తం 4,635 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, బాధితులకు సుమారు రూ.24.95 కోట్ల నగదును తిరిగి అందజేయగలిగామని ఆమె హర్షం వ్యక్తం చేశారు. వీటితో పాటు 21,388 రా జీ పడదగ్గ ఎఫ్‌ఐఆర్ కేసులు, 57,343 ఈ పెట్టీ కేసులు, 60,094 మోటార్ వాహన చట్టం ఉల్లంఘన కేసులతో పాటు 791 విపత్తు నిర్వహణ సంబంధిత కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రతువులో హై దరాబాద్ యూనిట్ 15,719 కేసుల పరిష్కారంతో అగ్రస్థానంలో నిలవగా, ఆతర్వాతి స్థానాల్లో మల్కాజిగిరి, సిద్దిపేట, రామగుండం, నల్గొండ జిల్లాలు నిలిచాయని ఆమె వెల్లడించారు.

## సింగరేణిని ఉన్నతస్థాయిలో నిలిపిన గొప్ప వ్యక్తి బలరామ్

### పౌర సన్మాన సభలో మాజీ సిఎస్ కాకి మాధవరావు



**ప్రజాపక్షం / సోమాజిగూడ :** సింగరేణి సంస్థను ఉన్నతస్థాయిలో నిలిపిన గొప్ప వ్యక్తి ఎన్.బలరామ్ అని విశ్రాంత ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కాకి మాధవరావు కొనియాడారు. బలరామ్ గొప్పస్థాయికి వెళ్లినా మూలాలను మరవకుండా సమాజానికి, పేదలకు సేవలందించారన్నారు. ఆయన తనకెంతో ఆదర్శప్రాయుడు అని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి ఎంప్లాయీస్ అండ్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సింగరేణి మాజీ సిఎండి ఎన్.బలరామ్ వీడ్కోలు, పౌర సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా కాకి మాధవరావు మాట్లాడుతూ అత్యున్నతస్థాయిలో ఉన్న వారు తమ గతాన్ని మరిచిపోకుండా సమాజానికి, జాతికి సేవ చేయడానికి ముందుకురాఆల్సిన అవసరం ఉన్నదన్నారు. బలరామ్ లాంటి వ్యక్తులు మరింత మంది సమాజంలో ఉండాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఐఎస్ అధికారి జె.బి.రాజు మాట్లాడుతూ బలరామ్ సింగరేణికి చేసే సేవలకుగాను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సముచితంగా సన్మానించాలని కోరారు. బలరామ్ మాట్లాడుతూ 137 ఏళ్ల సింగరేణికి సేవలందించేందుకు అకాశం కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి ఉంటేనే ఎన్నో తరాలకు ఉపాధి లభిస్తుందని, అందుకే సింగరేణిని విశ్వవ్యాప్తం చేయాలన్న లక్ష్యంతో పనిచేశానన్నారు. అనంతరం బలరామ్ పర్యావరణ పరిరక్షణకు చేసిన సేవలపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి భరత్ భూషణ్, రిటైర్డ్ ఐఎఎస్ జి.డి.అరుణ, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, సింగరేణి అధికారులు గోల్ల రమేశ్, భూక్యా కృష్ణమూర్తి, యూనియన్ నేత గొల్లపల్లి దయానంద్ , తెలంగాణ ఉద్యమకారుల జెఎసి అధ్యక్షులు ప్రఫుల్ రాంరెడ్డి, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ చొప్పర బాలకృష్ణ, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పవన్‌కుమార్, సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్, డిఎస్‌పి రాధ తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్ చెరువు ప్లాట్ల బాధితులకు న్యాయం చేస్తా

### మీడియాతో ఎంఎల్‌సి అంజిరెడ్డి

**ప్రజాపక్షం / సోమాజిగూడ :** అమీన్‌పూర్ పెద్ద చెరువు పట్టా భూముల ప్లాట్ల ముంపు బాధితులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని ఎంఎల్‌సి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్లాట్ల బాధితులు విష్ణుప్రియ నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షులు సాంబయ్య, ఉపాధ్యక్షులు మాధవరావు, జనరల్ సెక్రటరీ ప్రమీల, స్వర్ణశ్రీలతో కలిసి ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా అమీన్‌పూర్ పెద్ద చెరువు 93 ఎకరాలు ఉన్నదన్నారు. 1998లో అమీన్‌పూర్ చెరువు పరిసరాల్లో రిటైర్డ్ ఉద్యోగులు 3వేల ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. దీంతో చెరువులో పరిశ్రమలు, ఇళ్ల డ్రైనేజీ నీళ్లతో చెరువు నిండిపోయిందని, తూములు, అలుగులు మూసుకోవడంతో విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ముందుగా చెరువు శిఖం ఎంత ఉందో దాన్ని ఫిక్స్ చేయాలన్నారు. 2000 సంవత్సరం గత కాంగ్రెస్ హయాం టిడిఆర్ స్కీం తీసుకొచ్చారని, దీనిద్వారా ప్లాట్లు కోల్పోయిన బాధితులకు మూడుసార్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరువులోకి డ్రైనేజీ ప్రవాహాన్ని అరికట్టి, తూములు, అవుట్‌ఫ్లో మార్గాలను పునరుద్ధరించి నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని స్వర్ణశ్రీ కోరారు. ప్లాట్లు కోల్పోయిన యజమానులకు చుట్టుపక్కల ప్లాట్లు ఇవ్వాలని లేదా మూడుసార్లు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.




## దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యులుగా కంకల ఎల్లెందర్, మరాటి మల్లేష్





**ప్రజాపక్షం/బోడుప్పల్ :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో యాదాద్రి జిల్లా మూటకొండూర్ మండలానికి చెందిన కంకల ఏలేందర్ కురుమను, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్‌కు దేవేందర్ నగర్ కాలనీకి చెందిన మరాటి మల్లే ష్ కురుమను సభ్యులుగా నియమించింది. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగస్ఫూర్తిని యువతకు పరిచయం చేయడం, పోరాట చరిత్రను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్ప డం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుందని అధికారులు తెలిపారు. కంకల ఏలేందర్ కురుమను, మరాటి మల్లేష్ కురుమను కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, కురుమ సంఘం నాయకులు,సామాజిక వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వాహనదారుల భద్రతే ప్రధాన లక్ష్యం

### ఉచిత కంటి వైద్యశిబిరంలో ఎస్‌పి స్నేహ మెహ్రా



**ప్రజాపక్షం/ మోమిన్‌పేట్ :** ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏజెఆర్ గార్డెన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను జరగకుండా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఆరైన్ అలైన్ కార్యక్రమంలోలో భాగంగా జిల్లాలో మూడవ విడుతలో ఉచిత వైద్యశిబిరాంలో నిపుణులైన వైద్యులు వాహనదాలరులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలు ఉన్నావారిని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅదనపు ఎస్‌పి రాములు నాయక్ , డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి , సిఐలు, వెంకట్ , రఘురాములు ,ఎస్‌ఐలు పాల్గోన్నారు.

## ఇంటికి వెలుగు ఇల్లాలి చదువు : సురేష్ కుమార్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళలను విద్యావంతులుగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంగా భాగంగా ఆదివా రం జిహెచ్ఎంసి కాప్రా, నాచారం సర్కిళ్ల పరిధిలో మధ్య లో చదువు మానేసిన మహిళలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. దీని కోసం ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాల్లో 500 మంది మహిళలు హాజరు కావల్సి ఉండగా 353 మంది మాత్రమే హాజరయ్యారని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. మహిళలు విద్యావంతులవటం ద్వారా వారి కు టుంబాలు ప్రగతి పథంలోకి వెళ్లి సమాజ ప్రగతికి దోహదపడుతాయన్నారు. ఇంటికి వెలుగు ఇల్లాలి చదువు అని ఆయన అన్నారు. ప్రతి మహిళా విద్యావంతురాలై మహి ళా పొదుపు సంఘాలలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా, నాచారం సర్కిళ్ల కార్యాలయాల ఆర్గనైజర్లు శ్రీనివాసరెడ్డి, గోపాల్, స్వామిదాస్, ఎం. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారెగూడ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా!

### గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపికాదశరథ్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నారేగూడ గ్రామ అభివృద్ధి నాలక్ష్యం అని ఆదివారం గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్ తెలిపారు. నవాబుపేట మండలంలోని నారేగూడ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పాలక వర్గంతో సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరత్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ వార్డు సభ్యులతో, కలిసి నారేగూడ గ్రామంలో స్టేట్ ఫండ్ రూ.10 లక్షలతో, ఎంపి నిధులు రూ.5 లక్షలతో గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్ మాట్లాడుతూ, నారెగుడా గ్రామని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని గ్రామ అభివృద్ధి కోసం రుణపడి ఉన్నానన్నారు. గ్రామ మౌళిక సదుపాయాల కల్పన నీటి సమస్యను గుర్తించి బోర్లను మరమ్మతు పనులు చేసి పంపు మోటార్లను బిగిస్తానని అన్నారు. రాబోయే వేసవికాలంలో నారేగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఏ కాలనీ కూడా నీటి కొరతతో ఇబ్బందులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచ్ అన్నారు. గ్రామ ప్రజల మౌలిక వసతులు కల్పించడం వాటి పరిష్కరించడమే తన ముందున్న లక్ష్యమని విజన్‌తో పని చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చడమే నా ముందున్న మొదటి కర్తవ్యం గా భావించి గ్రామ అభివృద్ధిలో అనునిత్యం శ్రమిస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడమే జరుగుతుందని దీపిక దశరథ్ పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రూపమ్మ, సుమలత, అమృతమ్మ, సమీనా బేగం, రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ జెరూసలేం మినిస్ట్రీస్ చర్చిలో ఘనంగా మట్టల ఆదివారం

**ప్రజాపక్షం / బోడుప్పల్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ, న్యూ జెరూసలేం మినిస్ట్రీస్ చర్చిలో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ శశి కిరణ్ బైబిల్‌లో తెలిపిన ప్రకారం ఖర్జురపు మట్టలకు పువ్వులతో ముస్తాబు చేసి పురవీధులలో యేసుప్రభును గాడిద పై ఊరేగించి యూదుల రాజుకు జై అంటూ ఉత్సాహగాణాలు చేశారాని, ఆ రోజు ఈ మట్టల ఆదివారం అని, మనం కూడా అదే విధంగా ఆయనను ఘనపరచాలని సువార్త ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు విజయ బాబు, జాషువా, క్రిష్ణ, ఉదయ్ బాబులు అందరికీ మట్టల ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దళితులపై కుల వివక్షత ఆగేది ఎప్పుడు?

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసమ్మ

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 371వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం అంబేద్కర్ ఆశ సాధన సంఘం సభ్యులు కీర్తిశేషులు ఈతకోట గోపాలకృష్ణ 2వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈతకోట గోపాలకృష్ణ అంబేద్కర్ సిద్ధాంతాల కోసం, ఆశయ సాధన సంఘం కోసం ఆయనచేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ, 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా కుల వివక్ష కోరలు చాచుతుందని, అగ్రకుల నేతలు కొందరు దళితులను ఆలయ ప్రవేశం లేకుండా అవమాన పరుస్తున్నారని శ్రీరామనవ ఉత్సవాల సందర్భంగా శామీర్‌పేట్ మండలం ఆదాష్ పల్లెలో దళితులను శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొన్నారు.





## లక్ష్మాపూర్‌లో ముగిసిన బ్రహ్మోత్సవాలు


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శ్రీరామ నవమిని పురస్కరించుకుని మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లోని రాములగుట్టలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీ సీతారామ చంద్రస్వామి విగ్రహాలను కొట్యాల సమీపంలోని చెలిమిలో వేద పండితుడు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షుడిగా బీమానాయక్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాలిటి బిజెపి ఎస్‌టి మోర్చ అధ్యక్షునిగా తుర్కపల్లి గ్రామానికి చెందిన దీరావత్ బీమా నాయక్ ఆదివారం నియామక పత్ర అందుకున్నారు. బిజెపి శామీర్‌పేట అధ్యక్షుడు కోరివి కృష్ణ ముదిరాజ్ బీమానాయక్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్‌టి మోర్చ అధ్యక్ష పదవి బాధ్యతలను అప్పగించిన మండల అధ్యక్షుడు కోరివి కృష్ణ ముదిరాజ్‌కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నీరుడి అశోక్‌కుమార్, మాజి ప్రధాన కార్యదర్శి కీసరి నర్సింగరావు, జివికే యాదవ్, సత్యనారాయణ, గ్రామాధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్లియర్ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ లోకల్ నుండి పిఎస్‌కి వచ్చే రోడ్డు మార్గంలో ఉన్న రైల్వేగేట్ దగ్గర రైలు వచ్చే సమయంలో వెహికిల్స్ ట్రాఫిక్ జామ్‌అయి, ట్రైన్ వెళ్లిపోయిన తర్వాత ట్రాఫిక్ క్లియర్ కావడం కోసం చాలా సమయం పడుతుంది. ట్రాఫిక్ క్లియర్ కోసం బొల్లార్డ్స్ ఏర్పాటు చేసి సిసి కెమెరాలు, మైక్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కెమెరాలు పోలీస్ స్టేషన్ నుండి అనౌన్స్‌మెంట్ చేస్తే అక్కడ ట్రాఫిక్ క్లియర్ అయ్యేవిధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరు కూడా ట్రైన్ వచ్చిన సమయంలో బొల్లార్డ్స్ ఓవర్టెక్ చేసి ట్రాఫిక్ జామ్ చేయద్దు అలా చేసిన వారికి పిఎస్ నుండి చాలాన్ వేయడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రుల్స్ పట్టించాలని సిఐ రఘుకుమార్ తెలిపారు.

## విద్యుత్ సమస్యలు పట్టంచుకోవడం లేదు



**ప్రజాపక్షం/పరిగి :** నెలలు గడుస్తున్న పరిగి విద్యుత్ శాఖ పట్టించుకొవడం లేదని కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్‌అలీ అన్నారు. పరిగి మున్సిపల్‌లోని 13వ వార్డులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉన్నాయని 21 నవంబర్ 2025న సమాచారం అందించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.కాలనీవాసులకు ఎవ్వరికైనా వీటి వల్ల ప్రమాదం జరిగితే పరిగి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీనాయకులు శ్రవణ్ కుమార్ , అనిల్ తదితరులు పాల్గోన్నారు.

12 ప్రజాపక్షం Telugu National Daily
హైదరాబాద్ సోమవారం 30-03-2026 www.prajapaksham.in

"మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న రిలీజ్ కానున్న నేపథ్యంలో 'లెనిన్' టీం ఓ నిర్ణయాన్ని తీసుకుంది. రామ్ చరణ్‌తో అఖిల్ అక్కినేనికి ఉన్న బాండింగ్ కారణంగా సహృదయంతో 'లెనిన్' సినిమాని వాయిదా వేశారు."

రీల్

## చివరి షెడ్యూల్‌లో 'మహాకాళి'



అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రలో దర్శకుడు ప్రశాంత్ వర్మ 'మహాకాళి' సెట్స్ నుంచి ఒక కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చాప్టర్ గురించి ఒక ఎక్సైటింగ్ అప్‌డేట్‌ను ఇచ్చారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రశాంత్ వర్మ షోరన్నర్‌గా వ్యవహరిస్తుండగా, పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. చిత్ర బృందం 100 రోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేయగా, చివర 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శుక్రాచార్యుడి కీలక పాత్ర కోసం అక్షయ్ ఖన్నా తన చిత్రీకరణను పూర్తి చేశారు. ఈ చిత్రంలో భూమి శెట్టి టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. ఆమె ఉగ్రరూపంలో కనిపించిన ఫస్ట్‌లుక్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా టాలీవుడ్ అరంగేట్రం భారీ అంచనాలను రేకెత్తించగా, అతని ఫస్ట్ లుక్‌కు కూడా సోషల్ మీడియాలో అద్భుతమైన ప్రశంసలు లభించాయి. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం, సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీ నాగేంద్ర తంగలా ప్రొడక్షన్ డిజైనర్ . 'మహాకాళి' విజువల్ వండర్ గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి,
డిఒపి: సురేష్ రగతు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వెంకట్ కుమార్ జెట్టి

## 'అనకాపల్లి'లో కావాల్సింది దక్కాలంటే..




భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కండ్రేగుల నాయుడు, త్రినాధరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కండ్రేగుల కుమార్ రాజా కో – ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ఠ జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాధరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. 'అనకాపల్లి.. ఇక్కడ మనకు కావాల్సింది దక్కాలంటే.. ఎదుటోడికి మనమంటే భయం ఉండాలి.. భయం లేనోడికి పిడికిలి రుచి చూపించాలి.. అదీ తెలిసినోడికి ఒటి రుచి చూపించాలి.. అప్పటికీ లొంగకపోతే ఆడి పుర్రె పచ్చడయ్యేలా తూటాల వర్షం కురిపించాలి.. మనకి కావాల్సింది దక్కించుకోవాలి'.. అంటూ మొదలైన ఈ టీజర్‌లో అన్ని రకాల ఎమోషన్స్ చూపించారు. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకోబోతున్నాయని ఈ టీజర్‌తో తెలిసిపోతోంది. ఈ టీజర్‌లోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్, మ్యూజిక్ ఇలా అన్నీ కూడా ఇంట్రెస్టింగ్ ఉన్నాయి. ప్రేమ కథ కూడా చాలా కొత్తగా ఉండబోతున్నట్టు అనిపిస్తోంది. ఈ చిత్రానికి మాయా.వి కెమెరామెన్‌గా, దేవ్ జాండ్ సంగీత దర్శకుడిగా, శ్రీకృష్ణ అట్లూరి ఎడిటర్‌గా పని చేశారు. త్రినాధరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రానికి భానువులు డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఈ సమ్మర్‌లోనే మూవీని రిలీజ్ చేయబోతోన్నారు.

## ఘనంగా 'సుయోధన' సక్సెస్ మీట్



ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిష్య చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ నటుడు యువ్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం 'సుయోధన'. వై.ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ నెక్స్ట్ మూవీకి ఇంతకంటే పెద్ద బ్లాక్ బస్టర్ కొట్టాలని అనుకుంటున్నాం. ప్రస్తుతం అన్ని ఏరియాల నుంచి రెస్పాన్స్ బాగుంది. ఈ సినిమా చేసిన అనుభవంతో నెక్స్ట్ మరో మంచి చిత్రంతో మీ ముందుకు వస్తాం. అయితే ఈ సారి ఏదైనా పేరున్న సంస్థతో భాగస్వామ్యం అయి సినిమా నిర్మించాలని అనుకుంటున్నాం. ఈ సారి మా సంస్థలో రాబోయే సినిమా పక్కా ప్లానింగ్‌తో ఉంటుంది. అన్నారు. డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ చిన్న సినిమాలను ప్రేక్షకులకు చేర్చడంలో మా మీడియా మిత్రులు ముందుంటారు. సుయోధన చిత్రాన్ని కూడా వారే ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. డైరెక్టర్ వైఎస్ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ సుయోధన మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రతి షోకు స్క్రీన్స్ పెరుగుతున్నాయి. ప్రియదర్శి, సాయికుమార్ నటన ఈ చిత్రానికి హైలెట్‌గా నిలుస్తోంది. మా సినిమాను మరింతగా ప్రేక్షకుల దగ్గరకు మీరు రీచ్ చేయాలని కోరుకుంటున్నా అని అన్నారు.

## హార్రర్ థ్రిల్లర్‌గా 'విచిత్ర

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో, రవి, శ్రేయ తివారి హీరో హీరోయిన్ గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో వస్తున్న చిత్రం 'విచిత్ర',ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ సెన్సర్ పనులు పూర్తి చేసుకుని మే 22న విడుదల కానుండి. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ
మా విచిత్ర మూవీ లో హీరోగా రవి, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి పూర్వరాజ్, 'బేబీ' శ్రీ హర్షిణి, రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించిన చిత్రం విచిత్ర'
'ప్రపంచం మొత్తం దూరమైనా దగ్గరగా ఉండేది అమ్మ ప్రేమే' ప్రతీ ఆడతల్లి గుండె తల్లడిల్లేలా సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా 'విచిత్ర',.
ఈ చిత్రం పోస్ట్ప్రొడక్షన్ అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే 22 న 'విచిత్ర 'మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ముఖ్యంగా చిత్రానికి నిజాని అందించిన మ్యూజిక్ లోని అన్ని పాటలు బాగా వచ్చాయి. చిత్ర గారు పడిన తల్లి సెంటిమెంట్ సాంగ్ హైలెట్ గా నిలుస్తుందని సైఫుద్దీన్ మానిక్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ :కడిమిశెట్టి లక్ష్మీ నారాయణ,
సంగీతం: నిజాని అంజన్.




## ఏప్రిల్ 10న వస్తున్న 'డెకాయిట్'

అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ 'కాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగడ పాత్రలో కనిపించనున్నారు. ప్రోమోలు, ఫస్ట్ సింగిల్ 'రుబారూ' ఒక రగడ హీరోని ప్రజెంట్ చేశాయి. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా సెకండ సింగిల్ 'చిచ్చుబుడ్డి'ని విడుదల చేశారు. ఇది శేష్ క్యారెక్టర్ సరికొత్త కోణాన్ని చూపిస్తోంది. చిచ్చుబుడ్డి' పాట సినిమా మూడ్‌ను పూర్తిగా మార్చేస్తుంది. ఇందులో అడివి శేష్ తొలిసారిగా తెరపై డ్యాన్స్ చేస్తూ హైఎనర్జీ అవతార్‌లో అదరగొట్టారు. సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో ఫోక్ బీట్‌లతో కూడిన పార్టీ జానర్ పాట కంపోజ్ చేశారు. భాస్కరభట్ల రవికుమార్ విజువల్ ఎక్స్‌పీరియన్స్‌కి సరిపోయే సరదా, ఆట పట్టించే సాహిత్యం అందించారు, జోనితా గాంధీ తన ఎనర్జిటిక్ వోకల్స్ తో ఈ పాటకు పవర్ యాడ్ చేశారు. తన గ్లామరస్ డ్యాన్స్ తో తెరపై కూడా మెరిశారు. ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తున్న 'డెకాయిట్' చిత్రంలో శేష్ సరసన మృణాల్ ఠాకూర్ నటించారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతుండగా, ధనుష్ భాస్కర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జ్ఞాని నేపథ్య సంగీతం సమకూర్చారు.



## పెద్ది కోసం 'లెనిన్' వాయిదా

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న రిలీజ్ కానున్న నేపథ్యంలో 'లెనిన్' టీం ఓ నిర్ణయాన్ని తీసుకుంది. రామ్ చరణ్‌తో అఖిల్ అక్కినేనికి ఉన్న బాండింగ్ కారణంగా సహృదయంతో 'లెనిన్' సినిమాని వాయిదా వేశారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉన్న 'లెనిన్' చిత్రాన్ని జూన్ 26న విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 30న విడుదల కానున్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' కోసమే 'లెనిన్' మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పరస్పర గౌరవంతో పాటుగా, ఎక్కువ సంఖ్యలో థియేటర్ల లభ్యత, సానుకూల వాతావరణాన్ని కల్పించేందుకు, 'లెనిన్' బృందం విడుదలను వాయిదా వేసింది.




## సుగ్రీవ' ఏప్రిల్ 24న విడుదల




ఎస్.జి.ఎస్ వి మూవీస్ పతాకంపై బాలు చరణ్, కాజల్ తివారి హీరో హీరోయిన్‌గా నర్తు చిరంజీవి దర్శకత్వంలో ఎమ్ పవన్ కుమార్ నిర్మిస్తున్న సస్పెన్స్ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'సుగ్రీవ'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఏప్రిల్ 24 న విడుదలకు సిద్ధం అవుతోంది. ఆనందంగా జీవిస్తున్న కుటుంబంలో అనుకోని సంఘటనలు ఎదురైతే ఆ కుటుంబం ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటుంది, వాళ్ళు ఆ సమస్యలు ఎలా ఎదుర్కొన్నారు అనేదే కథ. సినిమా చాలా బాగా వచ్చింది. నిర్మాత ఎమ్ పవన్ కుమార్ గారు ఎక్కడ రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించారు. నర్తు చిరంజీవి గారి దర్శకత్వం అద్భుతంగా ఉంది. యాక్షన్ ఎపిసోడ్స్ చాలా బాగా వచ్చాయి, గోవా , వైజాగ్ లాంటి అద్భుతమైన లొకేషన్స్ లో పాటలు చిత్రీకరించారు. సారథి స్టూడియోస్‌లో డి.ఐతో పాటు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 24 న విడుదలకు సిద్ధంగా ఉంది అని నిర్మాత పవన్ కుమార్ తెలిపారు.
'సుగ్రీవ' ఒక అందమైన కుటుంబ కథా చిత్రం. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ పట్నాయక్, విజయ్ కూరాకుల , లిరిక్స్: రంజిత్ కుమార్ రీకీ సినిమాటోగ్రఫీ: లక్కీ ఏకరీ
కొరియోగ్రఫీ: సునీల్ మాస్టర్, సాగర్ మాస్టర్,ఎడిటర్: బాబీ కదలి.






# యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలి

శాంతి నెలకొల్పాలి
పలువురు మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**అమెరికా బానిసత్వంలో తరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వగురువు నని చెప్పుకోవడం సిగ్గుచేటని పలువురు మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దేశాల దాడిని నిలువరించేందుకు భారత ప్రధాని చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సిపిఐ, సిపిఐ(ఎం), కాంగ్రెస్, టిజెఎస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా, రైతు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుద్ధానికి, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున వారు నినాదాలు చేశారు. యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలని శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ముందుకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఎగ్జిబిషన్ మైదానంలో టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. సభను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా రాక్షసత్వానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ సంపద ఉంటే అక్కడ దాడులకు పాల్పడుతూ ఆ దేశాలను హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు ఏకమై ట్రంప్ చర్యలను అడ్డుకోవాలన్నారు. ఈ యుద్ధాన్ని ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ భారత ప్రధాని మోదీ మాత్రం అమెరికాకు వ్యతిరేకంగా నోరు మెదపకుండా బానిసగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే యుద్ధ నివారణకు ప్రధాని చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ఏలాంటి కారణం లేకుండానే ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధంతో సామ్రాజ్యవాద అసలు స్వరూపం ప్రజల ముందు ఆవిష్కృతమైందన్నారు. యుద్ధం పేరుతో మానవత్వ విలువలను ధ్వంసం చేస్తూ అమాయక ప్రజలను అత్యంత అమానవీయంగా చంపడం టెర్రరిజం కాదా అని ప్రశ్నించారు. సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ బ్రిక్స్ సమావేశంలో నాలుగు దేశాలు యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడితే బ్రిక్స్‌కు అధ్యక్షుడుగా ఉన్న భారత ప్రధాని మోదీ మాత్రం కనీసం ఖండించే సాహసం కూడా చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు రియాజ్ మాట్లాడుతూ ఇరాన్ దేశంతో భారతదేశానికి అవినాభావ సంబంధాలు ఉన్నాయని, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా భారత ప్రధాని మోదీ వ్యవహరించడం సరికాదన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడులు మొదలు పెట్టగానే కాంగ్రెస్ పార్టీ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శాంతి సందేశాన్ని విడుదల చేసిందన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి వ్యతిరేకంగా జరుగుతున్న అధర్మ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ అధికార ప్రతినిధి చలపతిరావు మాట్లాడుతూ గతంలో ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడి చేసినప్పుడు ప్రపంచ దేశాలు వ్యతిరేకించక పోవడంతో దానిని ఆసరాగా తీసుకుని ఇప్పుడు ఇరాన్‌పై దాడికి పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్మారెడ్డి, ఎస్.ఛాయాదేవి, ఎన్.జ్యోతి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు కెవిఎల్, నాగేశ్వరరావు (ఐప్సో), జి.చంద్రమౌళి (అరసం), ఆర్.అంజయ్య నాయక్ (తెలంగాణ గిరిజన సమాఖ్య), డాక్టర్ వలీఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, ఎన్.శ్రీకాంత్ (ఎఐవైఎఫ్), కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్ (ఎఐఎస్‌ఎఫ్), సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, తాండూర్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలంకకు భారత్ చమురు

మోదీకి దిస్సనాయకే కృతజ్ఞతలు

**కొలంబో:**ఇంధన సంక్షోభంలో ఉన్న శ్రీలంకకు సహాయం చేసినందుకు ఆ దేశ ప్రధానమంత్రి అనుర కుమార దిస్సనాయకే భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. 20 వేల మెట్రిక్ టన్నులు డీజిలు, 18 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలుతో కూడిన మొత్తం 38 వేల మెట్రిక్ టన్నుల ఇంధనంతో ఒక నౌక శనివారం కొలంబో తీరానికి చేరుకుంది. ప్రాంతీయ సహకార కార్యక్రమంలో భాగంగా భారత్ నుండి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, లంకా ఐఓసికి ఈ అత్యవసర మద్దతు అందజేసింది. కొద్దిరోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా శ్రీలంక ఇంధన సమస్య గురించి దిస్సనాయకే తెలియజేశారు. శ్రీలంక అధ్యక్షుడు కూడా ఈ మేరకు ఎస్.జైశంకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీవ్రమవుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

కొట్టిన విషయం తెలిసిందే. కాగా, దళిత, ఆదివాసీ వర్గాల ప్రతినిధుల బృందంతో జరిగిన సమావేశం తీవ్ర మనస్తాపం కలిగించిందని, లోతుగా ఆలోచించేలా చేసిందని ఆ వీడియోతో కూడిన తన పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు.గిర్‌సోమనాథ్ జిల్లాలోని ఉనా పట్టణానికి సమీపంలో ఉన్న మోటా సమధియాలా గ్రామంలో 2016 జూలై 11న ఈ కొరడా దెబ్బల ఘటన జరిగింది. తమ సంప్రదాయ వృత్తిలో భాగంగా వేరే గ్రామంలో మరణించిన ఒక ఆవు కళేబరం నుండి చర్మాన్ని తొలగిస్తున్న నలుగురు దళిత యువకులపై దాడి చేశారు. నిందితులైన స్వయం ప్రకటిత గోరక్షకులు ఆ యువకులను కొరడాలతో కొట్టగా, ఆ తర్వాత పోలీసులు వారిని అక్రమంగా లాకప్‌లో బంధించి, మరోసారి దారుణంగా కొట్టారు. 'సుమారు 10 ఏళ్ల క్రితం, ఉనా ఘటన దేశం మొత్తాన్ని తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దళిత యువకులను బహిరంగంగా వివస్త్రులను చేసి, దారుణంగా కొట్టారు. ఆ సమయంలో, నేను వారి కుటుంబాలకు సంఘీభావంగా నిలిచాను' అని గాంధీ తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ఒక దశాబ్దం గడిచినా వారికి ఇంకా న్యాయం జరగకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. వారి గాయాలు ఇంకా మానలేదని, పైగా పరిస్థితి మరింత దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆ ప్రతినిధుల బృందం చెప్పిన విషయాలను వింటున్నప్పుడు, పరిస్థితి మెరుగుపడకపోగా, మరింత ఆందోళనకరంగా మారిందని స్పష్టమైంది. ఒక వ్యక్తిని ఎంత దారుణంగా కొట్టారంటే, అతని శరీరంలో ఏకంగా 19 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. మరొక వ్యక్తి సోదరుడిని కేవలం ఒక చిన్న అనుమానం లేదా కక్షతో సజీవ దహనం చేశారు' అని రాహుల్ తెలిపారు. ఈ ఘటనలు కేవలం అక్కడక్కడా జరిగే నేరాలు మాత్రమే కావని, భయం, అన్యాయంతో నిండిన దారుణ వాస్తవానికి ఇవి నిదర్శనాలని ఆయన పేర్కొన్నారు. తమ హక్కుల కోసం గళం విప్పేవారిని పద్ధతి ప్రకారం అణచివేయడమే అత్యంత ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. కొన్నిసార్లు బెదిరింపుల ద్వారా, కొన్నిసార్లు హింస ద్వారా, మరికొన్నిసార్లు హత్యల ద్వారా వారిని అణచివేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 'గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వ హయాంలో, దళిత, ఆదివాసీ వర్గాల పట్ల ద్వేషం, వివక్ష, అకృత్యాల వాతావరణం క్రమంగా తీవ్రమైంది' అని రాహుల్ ఆరోపించారు.ఉనా ఘటన బాధితులు నేటికీ న్యాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారని మాజీ కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. న్యాయం కోసం పదేళ్లుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ నిరీక్షణ, తీవ్రమైన అన్యాయమని గాంధీ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం కొన్ని చెదురుమదురు ఘటనలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, బలహీన వర్గాల గొంతులను అణచివేస్తూ, నేరస్తులు శిక్ష నుండి తప్పించుకునేలా చేసే ఒక వ్యవస్థ వైఫల్యానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. బిజెపి పాలిత గుజరాత్‌లో దళితులకు, ఆదివాసీలకు అవమానాలు, హింస, హత్యలే వాస్తవంగా మారాయని ఆయన పేర్కొన్నారు. '(ప్రధానమంత్రి నరేంద్ర) మోదీ గారికి సంబంధించిన ఈ రాజ్యాంగ విరుద్ధమైన, అన్యాయపూరితమైన నమూనానే ఇప్పుడు దేశం మొత్తం మీద రుద్దబడుతోందని' రాహుల్‌గాంధీ ఆరోపించారు.

## ఏ పనీ జరగడంలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉండే విధంగా చర్యలు చేపట్టాలి' అని సాంబశివరావు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభలో ఆదివారం పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ, ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమశాఖ, వైద్యం ,ఆరోగ్యం, రోడ్లు ,భవనాలు, కార్మిక ఉపాధి కల్పన, అడవులు, పర్యావణ, పౌర సరఫరా,నీటిపారుదల పద్దులపై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పనులు కావడంలేదని, స్నేహ పార్టీ అయినప్పటికీ ఏ పనీ చేయడంలేదని, తమకు అదనంగా ఇవ్వాల్సిన అవసరంలేదని, అన్ని నియోజకవర్గాల తరహాలోనే రహదారులు, నీటి ప్రాజెక్టులు తదితర పనులు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఏ నిధులనైనా ప్రతి నియోజకవర్గానికి కేటాయించాలని కోరారు. ఒక మంత్రి పనులను మంజూరు చేసినప్పుడు వాటిని ఆర్థిక శాఖ అంగీకరించాల్సిన బాధ్యత ఉండాలని సూచించారు. పాల్వంచ ఆస్పత్రిలో వేతనాలతో పాటు సిబ్బంది కొరత ఉన్నదని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పిహెచ్‌సి నుంచే డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని, వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల కొనుగోలుకు చెందిన నిధులు, ఆరోగ్యశ్రీ నిర్వహణ నిధులు సమయానికి విడుదల చేయాలని కోరారు. హైదరాబాద్‌లో 40 శాతం రాష్ట్ర జనాభా ఉన్నదని, ప్రభుత్వ పాఠశాలలు మాత్రం వెయ్యి కంటే తక్కువగా ఉన్నాయని, ప్రైవేటు పాఠశాలలకు లక్షలాది రూపాయల ఫీజులు తీసుకుంటారని వివరించారు. ప్రైవేటు విద్యా, వైద్య సంస్థలలో ఫీజులను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా, వైద్య రంగాలకు నిధులను కేటాయించాలని కోరారు. విశ్వ విద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, వాటిని భర్తీ చేయకుండా ఉన్నత విద్యను ఎలా అభివృద్ధి చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రొఫెసర్ అన్సారీపై గతంలో కక్ష కట్టి ఆయనకు బెనిఫిట్స్ రాకుండా చేశారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. డిఇఒ పోస్టులలో ఇతర శాఖలకు చెందిన వారిని నియమిస్తున్నారన్నారు. గుడి, బడి, మంచీటి పైప్‌లైన్ పనులకు కూడా అటవీ శాఖ అనుమతులు ఇవ్వడంలేదని, తద్వారా స్థానికంగా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమయానికి వేతనాలు రావడం లేదని, వచ్చే వేతనాలు కూడా తక్కువగా వస్తున్నాయని, అందుకే అవుట్ సోర్సింగ్ కోసం ప్రత్యేక ంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సాంబశివరావు కోరారు. వివిధ రంగాల కార్మికులందరూ కలిసి రాష్ట్రంలో 1.5 కోటి నుంచి రెండు కోట్ల వరకు అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, వారికి పిఎఫ్ సౌకర్యాన్ని కల్పిస్తే వారికి అద్భుతమైన మేలు చేసినట్టుగా వారు భావిస్తారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. సింగేణి సంస్థలో జిఒ నంబర్ 22 ప్రకారం ఇవ్వాల్సిన కనీసం వేతనం కూడా ఇవ్వడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన మంత్రి శ్రీధరబాబును కోరారు. ఆర్‌టిసిలో కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ణయం వల్ల ఎటువంటి ఇబ్బంది రాబోదని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌టిసి విలీన అంశం న్యాయస్థానాల్లో ఉన్నదని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్నారని, కానీ న్యాయస్థానంలో నిర్ణయం వచ్చినప్పుడు వస్తుందని, అప్పటి వరకు యూనియన్ పెడితే సగం సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## ఐజెయూ అధ్యక్షుడిగా బల్విందర్ సింగ్ జమ్మూ

(మొదటి పేజీ తరువాయి)

మోహన్ రాజ్ శ్రీనివాసన్ (తమిళనాడు), బిందూ సింగ్ (పంజాబ్‌చండీగఢ్), ఎం.పీ. మహారాజ (పాండిచ్చేరి), సి.ఎం.సాబిర్ అలీ ( కేరళమ్), జయశ్రీ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), వినీతా మండల్ హల్దర్ (ఛత్తీస్‌గఢ్), శివేంద్ర నారాయణ్ సింగ్ (బీహార్) టి.శ్రీనివాసరావు (న్యూఢిల్లీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్ల పాటు బాధ్యతల్లో ఉంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com